తెలంగాణ జాగృతి

# తంగేడు

తెలుగు సాహిత్య పక్ష పత్రిక



జనవరి 16, 2020

సంపుటి 01 సంచిక 07

*Complimentary Copy - 7*



భాతరదేశంలోని తొలి మహిళా ఉపాధ్యాయురాలు,

ప్రముఖ సంఘ సేవకురాలు

# క్రాంతిజ్యోతి శ్రీమతి సావిత్రిభాయి పూలే


***Printed and Published by : TELANGANA JAGRUTHI***

Pasham Amruthaaram Residency, H.No. 1-2-234/13/46/4, 3rd Floor, Near NTR Stadium Aravind Nagar, Domalguda, Hyderabad - 500 029. Telangana State. E-mail : editor@thangedu.co.in

# విషయ సూచిక




05 ఒక వైపు విలాసాలు, మరో వైపు ఆకలి, నాటి భూస్వామ్య వ్యవస్థలోని విషాదాన్ని చిత్రించిన **గం. గోపాల రెడ్డి**, నాటి కథ **గప్‌చుప్**

07 గ్రామీణ జీవితంలో **వ్యవసాయం** ప్రధానమైనది. ఈ వ్యవసాయ యాత్రలో సహజంగా పుట్టిన సామెతలు వివరిస్తున్న **వి. త్రివేణి** వ్యాసం.


# తంగేడు




13 బహుజన వాదం ఇంకా సాహిత్యం లోకి రాని కాలంలో ఈ సోయితో రచన కొనసాగించిన **మాది రెడ్డి** సుషుప్తి నవలను విశ్లేషించిన **విద్యావతి.**





17 మానవ భావోద్వేగాల సామస్త్యాన్ని ప్రతిధ్వనించిన కోడం పవన్ కుమార్ నవలను విశ్లేషించిన **ఆడెపు లక్ష్మీపతి** వ్యాసం - **'చరిత్రలో కొత్తకోణం'**





07 తెలుగువారికి అందునా తెలంగాణ వారికి ప్రాత: స్మరణీయుడు పోతన. ఆయనకే స్ఫూర్తిగా నిలిచిన కవి మడికి సింగన్న. **మడికి సింగన్న** మూలాలను క్లుప్తంగా విశ్లేషించిన **వడ్డేపల్లి** వ్యాసం.





27 నాటి **తెలంగాణ కథా వికాసంలో** చోటు చేసుకున్న సమాంతర సామాజిక పరిస్థితుల విశ్లేషణ **1930-1940.**





39 మానవత్వాన్ని గుండెల్లో వెలిగించుకున్న **కవితా నగరి** తిరునగరితో **మామిడాల** ముఖాముఖి





12 తనదైన అక్షర ముద్రను అడుగడుగునా ప్రతిఫలింప జేసిన ప్రతిభాశాలి **సి.నా.రె.** రచనా శిల్పం పరిచయం చేస్తున్న **గంద్ర లక్ష్మణ్‌రావు.**





23 విరిసిన ప్రేమ పరిమళం వాసన రువ్విన లక్ష్మి కందిమళ్ళ కథ **ప్రేమ పరిమళం...**

తియ్యని పాత అనుభూతులను ప్రోది చేసుకున్న **దేవకి దేవి** కథ **బీరువా... 27వ పేజీలో**

మానవుని సూక్ష్మతి సూక్ష్మమైన విశ్వరూపాన్ని ఆవిష్కరించిన కవిత **సుంకిరెడ్డి నారాయణరెడ్డి** **అసమాంతర... 04వ పేజీలో**

రుక్మిణీ కళ్యాణఘట్టంలో కవి కాలంనాటి ఆచార వ్యవహారలను ముందు నిలిపిన నాటి కవిత **మడికి సింగన్న** **రుక్మిణీ కళ్యాణం... 12వ పేజీలో**


ఇంకా... అక్షరాల సభ - మడత భాస్కర్, నక్కిదువా - పొన్నాల బాలయ్య, జీవనాడి - రేడియమ్, తంగేడు తదాత్మ్యం - శైలజా మిత్ర, అక్షరం - చెన్న మాధవుడు, మా పెరటి చెట్టు - అయిత అనిత, కవితలు

దృశ్యం, కొత్త పుస్తకం, సాహితీ శిఖరం, సభలు సమావేశాలు, స్వీకారం, ఇంకా ఇంకా...

# తంగేడు సంచికకు స్పందన...




తంగేడు బాగా వస్తోంది.
ఇది చరిత్రలో
నిలిచిపోతుంది.

**- బి.ఎస్ రాములు,**
మాజీ చైర్మన్, బిసి కమీషన్

తంగేడు అద్భుతం.
కవితా మేడమ్ అభిరుచి
కాంచనపల్లి కృషి
ప్రశంసనీయం.

**- దాసరాజు రామారావు**
(అమెరికా) కవి.

తంగేడు బాగా ఉంది.
నాకు ప్రతి రెగ్యులర్‌గా
రావడం లేదు. దయచేసి
పంపండి.

**- స్తంభం కాడి గంగాధర్, కవి**
కరీంనగర్.

తంగేడు రోజురోజుకి
అభివృద్ధి చెందుతుంది.
కానీ సరిగ్గా చేరడం లేదు.
పోస్టల్ ప్రాబ్లమా?

**- రేడియం, కవి**
హైదరాబాద్

తంగేడు పత్రిక
ఆదర్శనీయం. ఈ కాలంలో
ఇంత ఖర్చు చేస్తూ తీయడం
నిజంగా అభినందనీయం.

**- యెల్లి సుదర్శన్, కవి**
ముంబాయి

తంగేడు ఎంతో బాగుంది.
గత, ప్రస్తుత కాలంలోని
ప్రముఖుల కృషిని
ప్రచురించడం గొప్ప యత్నం.
కల్వకుంట్ల కవితగారికి
అభినందనలు.

**- దుగ్గిరాల సోమేశ్వరరావు,**
**కవి**

తంగేడు
చదువుతున్నాను. ఎంతో
ఆకర్షణీయంగా ఉంది.

**- ఎర్రోజు వెంకటేశ్వర్లు,**
కవి

తంగేడు
పత్రిక బాగుంది.
అభినందనలు.

**- విజయేందర్ రావు,**
ఉపన్యాసకులు

తంగేడు చదువుతున్నాను.
ఆకర్షణీయంగా ఉంది.

**- అయిత అనిత,**
కవయిత్రి, జగిత్యాల

తంగేడు ఎంతో బాగుంది.
మానసిక వికాసం
కలుగుతోంది.

**- ఎర్రమరాజు ప్రసాదరాజు**
ప్రిన్సిపాల్, కరీంనగర్

సంపాదకీయం

తెలంగాణ జాగృతి
తెలుగు సాహిత్య పక్ష పత్రిక

16 జనవరి, 2021

సంపుటి 01 సంచిక 07

# తెలంగాణలో అనువాదాల ఆవశ్యకత

ఆంగ్ల సాహిత్యంలోని అనేక ఉద్గ్రంథాలు తెలుగు సాహిత్యంలోకి అనువాదం కావడం మనకు నిత్యానుభవమే. చాలా గొప్ప తాత్వికుల సిద్ధాంతాలను కవుల భావుకతను మనం ఈ అనువాదాల ద్వారా ఆస్వాదిస్తున్నాం.

కానయితే ఈ అనువాదాలు తెలుగు సాహిత్యం నుండి అందునా తెలంగాణా సాహిత్యం నుండి ఎంత వరకు జరుగుతున్నాయి? ప్రపంచ ప్రజలకు రాష్ట్రేతరులకు మన రచనలు ఎంత వరకు చేరుతున్నాయి? మన కవులు రచయితలు ప్రపంచ సాహిత్య పటంలో కనీసం దేశ సాహిత్య పటంలో ఎక్కడున్నారు?

ఎవరో కొందరు మినహాయిస్తే మనకు తృప్తి కరమైన సమాధానం లభించదు. ఈ అనువాదాలు జరగవలసిన స్థాయిలో జరగడం లేదు. అన్ని ప్రక్రియలలో నిష్ణాతులైన వ్యక్తులు మన సాహిత్య రంగం లో ఉన్నారు. వీళ్ళు ప్రపంచ, అట్లాగే భారతీయ సాహిత్య రంగానికి చేరువ కావలసిన అవసరం ఉన్నది.

తెలుగు సాహిత్యం విషయానికి వస్తే ప్రాచీనంలో నన్నయాదుల పద్య కవిత్వమంతా అనువాదమే అని తెలంగాణ ఉద్యమం సందర్భంగా జరిగిన పరిశోధనలు నిరూపించాయి. అయినా ఈ కవిత్వం ఎంత స్మరణీయంగా మారిందో ప్రత్యేకించి పేర్కోవలసిన పని లేదు. బెంగాలీ నుండి అట్లాగే ఇతర భారతీయ భాషలనుండి అనువాద సాహిత్యం వల్ల ఎంత ప్రభావితులమైనమో సాహితీ లోకానికంతా తెలిసిందే. ఇక ఆంగ్ల సాహిత్యానువాదాలు తెలుగు వాళ్ళను ఇప్పటికీ ప్రభావితం చేస్తూనే ఉన్నాయి.

కాని ఈ స్థాయి మన సాహిత్యానికి ఉన్నదా? ఈ కృషి మన దగ్గర జరుగుతున్నదా? ఇది ఆత్మ పరిశీలన చేసుకోవలసిన అవసరం ఉన్నది.

మనం అనేక ఆటుపోట్ల కోర్చి తెలంగాణా రాష్ట్రాన్ని సాధించుకున్నాం. ఇప్పుడిప్పుడే మన అస్తిత్వాన్ని స్థిరీకరించుకుంటున్నాం. సాహిత్య అస్తిత్వాన్ని గురించి కూడా స్థిరీకరణ పొందుతున్నాం. కవులను గౌరవించడం, ప్రోత్సహించడం నిరంతరం కొనసాగిస్తున్నాం.

వీటితో పాటు తెలంగాణా సాహిత్య అస్తిత్వాన్ని ప్రపంచ పటం మీద నిలుపవలసి ఉన్నది. అన్ని భారతీయ భాషల్లో మన పరిమళాన్ని వ్యాపింపజేయ వలసి ఉన్నది.

అందుకు ఉత్తమ రచనలతో పాటు అనేక భాషా ప్రవీణులైన అనువాదకులు ఎదిగి రావాలి. అనువాద భాష, అనువాదిత భాష యొక్క మౌలికావధులను పూర్తిగా అవగాహన చేసుకోవలసి ఉన్నది. ఉభయ సంస్కృతులను ఆవాహన చేసుకోవాలె. అట్లాంటి అనువాదకులు తెలంగాణాలో లేరని కాదు. కాని ఇంకా ఎక్కువ వృద్ధి కావలసి ఉన్నది. దీనితో పాటు ఇతర భాషానువాదకులను ఆకర్షించే ఉత్తమ రచనల ఆవశ్యకత కూడా ఉన్నది. అన్ని ప్రక్రియల్లో ఈ విశిష్టత పరిఢవిల్లాలి.

తెలంగాణా సాహిత్యకారులు ఈ దిశ గా కూడా అడుగులు వేస్తారని ఆశిద్దాం. ఈ ప్రయత్నంలో మనం కూడా దోహదమవుదాం.

ఇదే సమయంలో సంక్రాంతి వస్తోంది. ఇది రైతుల పండుగ. వ్యవసాయ దారుల మనోభావాలకు ప్రతీక .సస్య లక్ష్మి దరహాసానికి వేదిక. ఈ సంక్రాంతి సాహిత్య క్రాంతికి కూడా భూమిక కావాలని ఆశిద్దాం.

జై తెలంగాణా, జై జాగృతి.

కవిత కల్వకుంట్ల



శ్రీమతి కల్వకుంట్ల కవిత
ఎడిటర్



డా॥ కాంచనపల్లి గో.రా.
అసోసియేట్ ఎడిటర్
9676096614

కవిత

# అసమాంతర



సుంకిరెడ్డి నారాయణ రెడ్డి

కళ్ళద్దాలూ చూడగలవు
మాట్లాడగలవా కళ్ళలా

పట్టువస్త్రమూ అల్లుకోగలదు
సుఖాన్నివ్వగలదా దేహస్పర్శలా

ప్లాస్టిక్కూ సౌఖ్యాన్నివ్వగలదు
కట్టెలా పరిమళాన్నివ్వగలదా
కనీసం మరణించగలదా



మడి అక్షయపాత్ర కాగలదు
కాకుంటే ఉరిపెట్టుకోగలదు
కంప్యూటర్ కన్నెత్తి కనికరించగలదా

కోక్ తంత్రుల దరిదాకా రాగలదు
నాళాల్లో లయ కాగలదా తాళవృంతంలా
నయనాల్లో తేట కాగలదా నారికేళంలా
2
అదొక జీవ రసాయనిక మంత్రం
3
వంద టన్నుల్ని గిరగిరా తిప్పకపోవచ్చు
కోట్ల అంకెల గణిత గుణిత భాగాహార
ఎమ్సీ స్క్వేర్ సమాహార చిప్స్ కాలేక పోవచ్చు
అసంగతుడు కాగలడు

నిర్గమన ప్రవేశ అక్షాంశరేఖల్లో
అస్థిమితుడు కాగలడు
సకల ప్రకృతి విపత్తుల
వికృతుల లక్ష్యం అతడే కాగలడు
విశ్వాంతరాళ చిట్టచివరి
రహస్యాన్ని అతడే ఛేదించగలడు
అతడొక జీవ యంత్ర
రసాయనిక ట్రిలియన్ చిప్ల
సూక్ష్మాతి సూక్ష్మ విశ్వరూపం

## రచయితలకు సూచనలు

- ✓ సమీక్ష కోసం పుస్తకాలు పంపేవారు విధిగా రెండు కాపీలు పంపాలి.
- ✓ పత్రిక కోసం రచనలు పంపించే వారు యునిక్ కోడ్‌లో ఉంటే ఓపెన్ ఫైల్ మరియు పిడిఎఫ్‌లో మెయిల్ చేయండి
- ✓ మా పత్రికకు రచనలు పంపినవారు ఇక్కడ అచ్చయాకనే ఫేస్ బుక్‌లో బ్లాగ్‌లో పెట్టండి.
- ✓ ప్రతి రచనకు ఇది ఎక్కడా ప్రచురణ కాలేదని, ఏ బ్లాగ్‌లో పోస్ట్ చేయలేదని, ప్రచురణ ప్రసారం కోసం ఎవరికీ పంపి ఉండలేదని హామీ పత్రం జత చేయండి
- ✓ పత్రికలో ఒక కథ లేదా వ్యాసానికి నాలుగు పేజీలు మాత్రమే అవకాశం ఉంటుంది. ఈ లెక్కన పదమూడు వందల పదాలకు మించకుండా వ్యాసం, కథ పంపించండి.
- ✓ కవితలు 15 పాదాలకు మించకుండా పంపించండి.
- ✓ వ్యాసాలు, కథలు, కవితలు ఏవైనా పోస్ట్‌లో కూడా ఈ క్రింది చిరునామాకు లేదా ఇ-మెయిల్‌కు పంపవచ్చు.

**తెలంగాణ జాగృతి**

పాశం అమృతరాం రెసిడెన్సీ, ఇ.నెం. 1-2-234/13/46/4, 3వ అంతస్థు, ఎన్.టి.ఆర్. స్టేడియం దగ్గర, అరవింద్ నగర్, దోమలగూడ, హైదరాబాద్ - 500 029. తెలంగాణ. E-mail : editor@thangedu.co.in

# గప్ చుప్

**గం. గోపాల రెడ్డి**

**1940వ సంవత్సరంలో వెలువడ్డ ఈ కథ పేదరైతు దైన్యం - నాటి భూస్వాముల విలాసం చిత్రించింది. వెరసి నాటి చీకటి కోణాన్ని ఆవిష్కరించింది...**

"అశీ ఇగరా!"

"ఏంది"

"దొరతాన్కి వోయొచ్చినావ్"

"ఆ పోయిన అగావు జీతముం డందుకు ఒకిత్తు ఇయ్యనంటుండడు. పిల్లలు మేము చస్తున్నం. దొరా అంటే చస్తే నన్నేమంటవు ఫో! అన్నడు".

వెంకయ్య ఒక్క నిట్టూర్పు విడిచిండు. ఆ ఒక్క నిట్టూర్పే చాలు హృదయమున్న వాన్ని కరిగించేటందుకు మూడు నెలలయింది, నేటికి వెంకయ్య మంచంపట్టి. శరీరంలో రక్తపు బొట్టు లేదు. చర్మం ఎముకలు మిగిలినయి...

ఇరవై యేండ్ల నుంచి చల్మారెడ్డి దగ్గర జీతమున్నడు. ఇన్నేండ్ల లో ఒక్కసారైనా తలనొప్పి అంటే ఎట్లుంటుందో ఆయనకు తెలియలే. రాత్రింబగళ్లు కష్టించిండు. ప్రతిఫలం? ఈనాడు మందుకోసం ఒక్క చిల్లిగవ్వైనా లేదు దగ్గర. నల్గురు పిల్లలు. పెద్దవానికి ఏడేండ్లు వుంటయి. పసులెంటపోతడు.

రామి సంసారం జేయవట్టిందగ్గర్నుంచి మొగడితో సహా తాను బాగ కష్టపడ్డది. పిల్లలను సమాధానం చెయ్యడమటుంచి రోగంతో పడ్డ మొగనికి ఏమి ఆసరా కాజాలని స్థితిలో ఉన్నది. ఎంత పొతంగ సంసారం చేసినా ఏ పూటకాపూటకే అదీ సగం కడ్పుకు సరిపోతుంది.

వెంకయ్య మంచం కుక్కిలో కండ్లు మూసుకొని పడి ఉన్నాడు. పిల్లలు "అమ్మా! బువ్వ పెట్టుమని ఏడుస్తున్నారు. రామి మొగని మంచం దగ్గర నిలబడి ఉన్నది. తన పిల్లలు ఆకలితో మాడడం రామి కడుపు పగిలిపోయింది. ఏంచేస్తుంది! కంటి నుంచి నీళ్ళు కార్చుట తప్ప!

వెంకయ్య కండ్లు మూసుకొని ఆలోచన చేస్తున్నాడు. తన గత జీవితమంత కండ్లకు కట్టినట్లయింది. నడుముకు రుమాలు బిగించి పొలంలో పనిచేస్తుండు. గడ్డ మీద కూర్చొని చల్మారెడ్డి సంతోషపడడం జ్ఞాపకం వచ్చింది. తను ఎవ్వరి కొరకు ఈ కష్టము చేస్తున్నానా? అనే ఆలోచనే లేకపోయింది. ప్రతి యేట గరిసె మీద గరిసె ధాన్యంతో నింపుతు వచ్చిండు. కాని ఇదంత, అనుభవించేదెవరు? ఆ ప్రశ్న వెంకయ్యకు కలిగింది. చల్మారెడ్డి ఇదంత అనుభవిస్తున్నడు. కానీ అతనికి పనిచేసే అవసరం లేదు. కాలు చెయ్యి అయినా కదిలియ్యడు. అట్టి చల్మారెడ్డి తనకేమీ - బాధ్యత లేనట్టుగ "ఫో! నన్నేమంటావు?" అంటాడు. ఈ మాట వెంకయ్య తలంపుకు రాంగానే శూలముతో పొడిచినట్లయింది. భగవంతుడనే వాడున్నాడా? అనే సందేహం కలిగింది. "ఒకడు ఆకలిచే మలమల మాడి చచ్చుటేమి? ఒకడు అన్ని సుఖసంపదల అనుభవించుడేమి? అనే ఊహే తట్టింది. ఎవరి సౌఖ్యం కొరకై రాత్రింబగళ్ళు కష్టించాడో అతడే పూర్తిగా మరిచిపోవుట గొప్ప అన్యాయంగా తోచింది. ప్రపంచమంతా బూటకం - పచ్చిదోపిడి - ఇల్లాటివెన్నో ఆలోచనలు వెంకయ్య తలలో తిరిగిపోయినయి. కండ్లు తెరిచిండు రామి ఎదురుగా ఏడుస్తూ. చీర కొంగును బిగ్గరగా నడుంకు చుట్టింది. పిల్లలు ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పడి ఉన్నారు. ఈ దృశ్యాన్ని చూడంగానే వెంకయ్యకు కండ్ల నిండ నీళ్ళు తిరిగినయి. వెంకయ్యకు జ్వరం తీవ్రంగా వచ్చింది. మూల్గుతున్నాడు. మనుష్యుల ధ్యాస కూడా తప్పింది. రోగిష్టి అందులో మూడు దినాల నుండి నోట్లోకి ఇంత అంబలైనా పడలేదు. రోగిష్టి అయిన భర్తకే లేనప్పుడు రామికెక్కడిది ? చంటి పిల్లకు పాలు దొరక ఏడ్చి నోరారిపోయింది. చావు బతుకు మీద దాని ప్రాణమున్నది. రామికి పిచ్చి లేచినట్టయింది. ఏమి చేయుటకు తోచలేదు. సాహసించింది. చల్మారెడ్డి దగ్గరికి మరియొకసారి పరిగెతింది.

చల్మారెడ్డి స్నేహితులతో ఇస్పేటు ఆడుతున్నాడు. చాలా సంతోషంగా గడచి పోతున్నది కాలము. స్నేహితులందరు అతని ఉదార స్వభావానికి పొగడు తున్నరు. ఆ స్నేహితుల పని అంత అతన్ని ఆకులలో ఓడించి పొట్ట బోసుకొనుటయే. పదులు ఇరవదులు వందల కొలది రూపాయలు రోజు వోడుతునే ఉంటడు. రణరంగంలో వెన్నిచ్చి పరిగెత్తినా చల్మారెడ్డి ఇందులో వెనుదీయడమనే దెరుగడు. చాలా

నాటి కథ

మోజులో ఉన్నది ప్యాకాట.

ఇంతలో రామి, కాళ్ళు తడబడుతుంటే ఎట్లాగో అతి కష్టముతో చల్మారెడ్డి ఇంటి ముందు చేరి "అయ్యా! అని అరిచింది. చల్మారెడ్డికి అరికాలి మంట నెత్తికెక్కింది. తన ఉల్లాసాన్నంతా ధ్వంసము చేసిన రామిని చీరెయ్యాలనుకున్నాడు.

"ఏమే భోసిడి పొగరెక్కింది! మాటి మాటికి నా వద్దకి రావద్దని చెప్పలేదా?'' అని ఆమె వైపు చెప్పు విసిరిండు.

చల్మారెడ్డి స్నేహితులంతా తమ ఉత్సాహాన్ని పాడుచేసినందుకు తగిన శాస్తి అయింది కదా అని ఒక్కమారు గొల్లున నవ్వారు.

రామికా దెబ్బతో స్పృహ తప్పింది. వీథిలో అట్లాగే పడిపోయింది. బజారు



నుండి పొయ్యే ఓ బిచ్చగానికి ఆమె అవస్థ చూసి మనసు కరిగింది. నోటిలో ఇన్ని నీళ్ళు పోసి తెలివి తెచ్చిండు. మెల్లగా ఆమెను ఇంటికి చేర్చిండు. రామి పడుకుంటు లేచుకుంటూ తన మొగని మంచము దరికి చేరి చూసేవరకు వెంకయ్య దీర్ఘనిద్రలో ఉన్నడు. హా! యని అతని మీద పడింది. చింపుడు బొంతలో పండుకొని వున్న చంటిది కెవ్వుమని కేకవేసి చుట్టబడ్డది. ఆ దృశ్యాన్నంతా చూసి రామి ఒక్క పెట్టు అరచి కిందపడిపోయింది. ఇదంతా ఏమీ తెలియదు. పిల్లలిద్దరు వెర్రి ముఖాలతో ఒకరినొకరు చూసుకున్నారు.

సమాజానికి ఈ గొడవ ఏమీ అవసరము లేనట్లు గప్ చుప్‌గా ఉన్నది.

# నక్కిదువా

ఆ శేష్టలను ఏమనుకోవాలి ?
చెట్టుకు చారెడు నీళ్ల పోయనివి
ముందో! వెనుకో! నాలుగు అడుగులు వేయ
నెనరులేని కోతుకాల బాతకానిలు

నడి బజార్లో డప్పు సప్పుల్లతో ఊరేగి
పరువు పంతన శెమ్కి బాసింగమై నాట్యమాడు
సింగులు వూగులాడేస్కోని రొమ్ములు విరిసి నడిచే బడాయిని

ధనం ఆకాశానికి భూమికి నడిమిట్ల
పాసి కుండై కుమ్మరిస్తున్న మోహావాన
పైసలు అడ్డదిడ్డంగా ప్రవహించే పాయలు పాకురు తొవ్వలు

లోభ దారిలో
పాలపిందెల జుగుప్సకార నడక కాదు బంధం

పెబ్బెలకెప్పుడు మురికి తప్ప
మూలాల సుగంధ స్పృహ ఆనదు డియర్

మిడతలదండై కొర్కతినే ఆభూషికి
పచ్చని చెట్టు ప్రాణ పరిమళంతో ఏం పని?

నీవు అనుకున్నట్టుగా ...
చెట్టంటే వంచితే వంగేదియిరిస్తే యిరిగేది కాదు
మహా జ్ఞానబోధి స్నేహవృక్షం
తోటమాలివై తోడుగుండు
వేటుగాడివై కోతపెట్టకు
గొడ్డలి మోకానికి వృక్ష హృదయానికి నేస్తమెన్నడు నెగులదు

కాల్లుపారజాపుకొని అన్నీ ఉన్నాయని ఆనందపడుతావు
చావు పుట్టుకల మధ్య సన్నని గీత దస్కితే
పిండాకూడు పేర్పువై పట్టన పగులుతుంది ఆహం

బల్లిపాతరల సింహాసనం ఎక్కి! బముసుండెదుకు?
పరోపకారి వైతే గాని పట్టుబడదు
ప్రపంచమెంత నక్కిదువో!

కుద్ గా మోయవలసిన దుక్కాలెప్పుడూ
అదలు బదులు కావు! కారణకార్య మూలాలు
చీకటి వెలుగుల సుఖదుక్కాల సమ్మేళనం జీవితం

వెలుతురు భారంకానీ రంగురంగుల దృశ్యమానం
చీకటి తనువంతా గాయాలైన పిల్లనగొయ్యి మధుర గానం

పచ్చపచ్చని నవ్వుల పువ్వుల పండ్లను సృష్టించే
పసి మనసుంటెనే కలకాలం ఆయుషుపోసుకుంటుంది దోస్తానం



పొన్నాల బాలయ్య

వ్యాసం

# వ్యవసాయిక సామెతలు - ఒక పరిశీలన

**గ్రామీణ జీవితంలో సామెతలు కవిత్వానికి ఏమీ తీసిపోవు అలాంటి సామెతలు సేద్య సందర్భంలో ఎలా వస్తాయో తెలుపుతున్న వ్యాసం...**



**డా॥ వి. త్రివేణి**

సామెతల శాస్త్రాన్ని ఆంగ్లంలో "Paremiology" అంటారు. సామెతలపై చేసే అధ్యయనాన్ని "Paremiography" గా అభివర్ణిస్తారు. సామెత లేని మాట ఆమెత లేని ఇల్లు వంటిదని పెద్దలు సామెత మీద సామెత చెప్పారు. ఇది నిజం. మాట రాణించాలన్నా, భావం గుంభనం కావాలన్నా 'సామెత' వ్యవహారంలో ఉండవలసిందే. సంస్కృతికి, వైభవానికి, అస్తిత్వానికి, ఆనందానికి, ఆవేశానికి 'సామెత' ప్రతీకగా నిలుస్తుంది. సమాజంలోని దురాచారాలను, చెడును, చాదస్తాన్ని హేళన రూపంలో, వ్యంగ్యరీతిలో, పరిహాసపు పలుకులతో చెప్పడం సామెతల ఉద్దేశం. ఇది ఎంతో అర్థవంతంగా, సంపూర్ణ భావాన్ని తెలుపుతాయి. సమాజం యొక్క పూర్తి స్వభావం ఒక్క సామెతల్లోనే ఒదిగిపోతుంది. జాతి సమైక్యతకు, జాతి పునర్నిర్మాణానికి, వ్యవస్థ పునరుజ్జీవనానికి సామెతలు ప్రధాన భూమిక వహిస్తాయి. ప్రాస, పదగుంభనం, రసస్ఫూర్తి, ఆలంకారిక శైలి, ధ్వని, గూఢత వంటి విభిన్న వైవిధ్య సారూప్యంతో సామెతలు జన వ్యవహారంలో భాగమైనాయి. భాషా సౌందర్యం, అనుభవసారం, నీతి సూచ్యం, హాస్యం కలగలిసి ఉన్నదే సామెత. అనుభవ సారాన్ని నీతిని ఉపదేశించడం, సంశయ నివారణం చేయడం, కార్యోన్ముఖతను కావించడం, ప్రమాద హెచ్చరికలను సూచించడం, వాదనకు ముక్తాయింపు పలకడం వంటి ప్రయోజనాలు సామెతల ప్రయోగంలో భాసిస్తాయి. తెలుగు భాషకే సొంతమై తెలుగువారి సంస్కృతి సంప్రదాయాలను సామెతలు ఎల్లవేళలా పరిరక్షిస్తున్నాయి. అనాది కాలం నుండి తెలుగులో సామెతలు సూక్తులుగా, సుభాషితాలుగా, జనాంతికాలుగా, లోకోక్తులుగా, శాస్త్రాలుగా వ్యవహార రూపంలో ఉన్నాయి. సామెతలు పదాలు, పదబంధాలు, వాక్యాల రూపంలోనే గాక; కథల రూపంలో, పాటల రూపంలో, పద్య రూపంలో కూడా ఉన్నాయి. అవి ప్రయోగ ప్రాధాన్యాన్ని బట్టి పౌరాణిక, చారిత్రక, సాంస్కృతిక, సామాజిక సామెతలుగా విభజింపబడ్డాయి. వ్యవహార శైలిని అనుసరించి ఆక్షేపణ, సంభాషణ, సంవాద, చమత్కార, ఉపమాన సామెతలు ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఆయా జాతులు, తెగలకు సంబంధించినవి కూడా చాలా సామెతలు నిత్య వ్యవహారంలో కనిపిస్తాయి.

సామెతలకు వివిధ లక్షణాలు నిర్ణయించబడ్డాయి. అవి సంప్రదాయ బద్ధమైనవి. జన ప్రియత్వం కలవి. వివేకాన్ని కలిగించడం. సంక్షిప్తంగా ఉండడం. అల్పాక్షరాలలో అనల్పార్థం స్ఫురించడం. సామాజిక కట్టుబాట్లకు కట్టుబడి ఉండడం. చారిత్రకాంశాల సంబంధం కలవి. పౌరాణిక, ఇతిహాస కథల నేపథ్యం కలవి. ఈ సామెతలకు భావాలంకారాలు ఉండవు. వయస్సు నిర్ణయం లేదు. సరిహద్దు నిర్ణయం లేదు. ఆక్షేపణ, వ్యంగ్యం కలవి. సామెతలు రూపాయి నాణెం వంటివి. చెలామణిలోకి వస్తేనే విలువ పెరుగుతుంది. సంఘంలో కొన్ని సూత్రాలు, వాక్యాలు సామెతలుగా గుర్తింపు పొందాయి. విశేష లోకానుభవాన్ని గడించినవే సామెతలు. విశేషార్థము గర్భితమై ఇవి ప్రయోగింపబడతాయి. దేశీయపద సమ్మిళితమై స్వచ్ఛతను ప్రదర్శిస్తాయి. నీతి బోధకాలుగా ఉండి ప్రాపంచిక జ్ఞానాన్ని తెలుపుతాయి. తక్కువ శబ్దాలతో ప్రజాబాహుళ్యంలోకి ఎక్కువ చొచ్చుకొని పోతాయి. జనుల ఆచారాలకు, వ్యవహారాలకు, మనోభావాలకు అనుగుణంగా ఉంటాయి. సన్నివేశానికి, సంవాదానికి సందర్భానుసారంగా వాడబడుతాయి. ఎంత కటువైన విషయాన్నైనా మెత్తగా చెబుతాయి. బలహీనమైన వాదమైన సామెతల జోడింపుతో బలం పొందుతుంది. సంభాషణలకు చైతన్యం,

వ్యాసం

ఉత్తేజం కలుగుతుంది. ఉపన్యాసకళకు నైపుణ్యం ఏర్పడుతుంది. పూర్వీకుల అనుభవాలకు సామెతలు వారధిగా నిలుస్తాయి. జాతి నాగరికతను పరిఢవిల్లజేసి ఆనందమయ జీవితాన్ని అందిస్తాయి.

In the potted wisdom of the world's proverb Literature, there is shrewdness, Commonsense, Good sense and at the same time we find a penetrating profundity, humour and satire and expendient salvation. - Epic Pertridge

జాతి సమైక్యత, జాతి పునరుజ్జీవానికి, సమిష్టి జీవనం, సామాజిక చైతన్యానికి సామెతలు వ్యవహారంలో ఉన్నాయి. నిరంతరం జన నానుడిలో చెలామణి అవుతున్నాయి.

భారతదేశం వ్యవసాయ ప్రధానమైన దేశం. వృత్తి ప్రధానమైంది. చాతుర్వర్ణ నిర్మిత వ్యవస్థలోని వృత్తి జీవితం భారతదేశంలోనే ఉంది. ప్రపంచంలోని మరే ఇతర దేశాలలో ఇటువంటిది కనిపించదు. మన దేశంలో వ్యవసాయం మొదలుకొని ఒక్కో కులానికి ఒక్కో వృత్తి జీవనం ఏర్పడి ఉంది. తెలుగు ప్రాంతాలలో వృత్తి ప్రధాన జీవనాధారంగా నిలుస్తుంది. తెలుగు ప్రజల జీవితమే వృత్తిలో మిళితమై ఉంటే; పుట్టిన సామెతలన్నీ ఆ వృత్తికి లేదా ఆ జాతి జీవనానికి సంబంధించినవే అయి ఉంటాయి. దాదాపుగా సామెతలన్నీ ఆయా వృత్తుల నుండి ఉద్భవించినవే. ఒక విధంగా వృత్తి సంబంధిత సామెతలను అధ్యయనం చేయడమంటే పూర్తి సామెతలను అనుశీలించవలసిందే. వ్యవసాయ వృత్తిలో అనురాధ నక్షత్రం మొదలుకొని ఆరుద్ర, చిత్త, పుష్యమి, మూల, రోహిణి, స్వాతి, హస్త వరకు; ఎరువు, ఏతాము, కలుపు, కొల్లేరు, దుక్కి, నాగలి, పైరు, రైతు, వడ్లు, విత్తనం, కంది, కంద వంటి వాటిపై సామెతలు అనేకం ఉన్నాయి. పాడి - పశు పోషణకు సంబంధించి కూడా ఎద్దు, గోవు, దూడలపై సామెతలు ఉన్నాయి. పాడి - పంటలు పరస్పర సమన్వయ వృత్తులు కాబట్టి సామెతలు కూడా వ్యవసాయానికి, పశుపోషణకు అనుసంధానించబడ్డాయి.

**వ్యవసాయం...**

భారతదేశం క్షేత్ర భూమి. వాతావరణ అనుకూలతను బట్టి మనదేశంలో వ్యవసాయం అధికం. మొదటి పంచవర్ష ప్రణాళికలో భారత ప్రభుత్వం వ్యవసాయానికే ప్రాధాన్యం ఇచ్చింది. దీని మీదనే సమాంతర వృత్తులెన్నో ఆధారపడి ఉన్నాయి. భారతదేశ ఆర్థిక వ్యవస్థ వ్యవసాయం మీదనే గణింపబడుతుంది. తలసరి వార్షిక ఆదాయ వృద్ధి సూచి ధాన్యపు ఉత్పత్తుల మీదనే సమీకృతమవుతుంది. మనదేశంలో పట్టణాభివృద్ధి కన్నా గ్రామ వికాసమే మిన్నగా ఉంది. గ్రామ పరిసర ప్రాంతాల్లోనే భూకమతాల విస్తీర్ణం అధికం. వ్యవసాయం పాదుకొల్పింది పల్లె ప్రజలే. వీరే జానపదులు. జానపదుల ఒరవడి నుండి అనేక వ్యవసాయ సామెతలు పుట్టుకొచ్చాయి. దేశానికి అన్నం పెట్టే రైతు గొప్పతనాన్ని, కీర్తిని, శ్రమ శక్తిని, ఔదార్యాన్ని సామెతలు వివరంగా చెప్పాయి. 'ఎనుగే చేను మేస్తే కాచేవాడు ఎవడు' వంటి సామెతలు కూడా రైతు జీవితంలో ఎదురవుతున్న కష్టాలను తెలియజేస్తాయి.

ఏఏ కాలాల్లో ఎటువంటి పంట వేయాలి? వాటి వాతావరణ పరిస్థితులు ఎటువంటివి? ధాన్యం రుగ్మత ఎట్టిది? వర్షాభావం గల కాలం ఏది? కాలానికి ఎదురీది పంట నిలబడుతుందా? అనే సందేహాలతోనే కార్తె (కాలం)లు పుట్టుకొచ్చాయి. ఏఏ నక్షత్రాలలో కాలం అనుకూలంగా ఉంటుందో రైతు బాగా ఎరిగినవాడు. అందుకే వ్యవసాయంలో కాలం ప్రాధాన్యం పెరిగింది.

- సేద్యంలో అనురాధ కార్తె

**ప్రాచీన కాలం నుండి ఎరువు సహజంగా తయారుచేసుకొనే విధానం రైతులు అవలంభి స్తున్నారు. చీడ పీడల నుండి రక్షింపబడడానికి, పంట దిగుబడి పెరగడానికి వ్యవసాయంలో ఎరువుల వాడకం అధికం. కాంపోస్టు ఎరువును తయారుచేసుకోవడం ఇప్పటికీ గ్రామీణ వ్యవసాయదారులు ఆచరిస్తున్నారు. జంతు, పక్షి వ్యర్థాల నుండి బయో ఎరువు ఏర్పడుతుంది. ఆర్గానిక్ ఎరువుల వాడకం వల్ల పంటలు విస్తృతంగా పండుతాయని పెద్దలు చెబుతారు. బలవర్ధకమైన పంట వంగడాల ఉత్పత్తికి ఈ పద్ధతి అనువైంది.**

అనుకూలమైంది. సామెతలు ఇదే చెబుతున్నాయి. వ్యక్తుల మనోరోగాలను పోగొట్టే కాలం ఇది.

- అనురాధలో అడిగినంత పంట.
- అనురాధలో తడిస్తే మనోరోగాలు పోతాయి.
- అనురాధ కార్తెలో అనాథ కట్టయినా ఈనుతుంది.

- ఆరుద్రలో విస్తారమైన పంట పండుతుంది. ఈ కార్తె గూర్చిన సామెతలు అధికంగానే ఉన్నాయి. వర్ష ఋతు ప్రభావం అధికం. వ్యవసాయ పంటలు ఎక్కువగా ఉంటాయి. అన్ని కార్తెలలో కెల్లా అత్యంత ప్రభావవంతమైంది ఆరుద్ర. ఆముదం పంటకు అనుకూలమైంది. స్త్రీల శ్రమ శక్తికి అధిక ప్రాధాన్యం ఇచ్చి గౌరవించే సామెతలు ఈ కార్తెలోనే పుట్టుకొచ్చాయి.

- ఆరుద్రలో అదనుసరి
- ఆరుద్ర వాన అదను వాన
- ఆరుద్ర కురిస్తే దారిద్ర్యం లేదు
- ఆరుద్ర కురిస్తే ఆరు కార్తెలు కురుస్తాయి
- ఆరు కార్తెలకు పోతు ఆరుద్ర కార్తె
- ఆరుద్ర వానకు ఆముదములు పండును

వ్యాసం

- ఆరుద్రలో తడిస్తే ఆడది మగవాడవుతాడు

- ఆరుద్రలో మొదటి పాదాన విత్తితే ఆరంభాలు చెడుతాయి

- ఆరుద్రలో వేసినా ఆరికా, ఆకులో పెట్టిన అన్నము ఒక్కటే

- ఆరుద్ర కార్తె విత్తనానికి అన్నము పెట్టిన ఇంటికి సేగిలేదు

- ఆరుద్రలో అడ్డెడు చల్లితే పునాసకు పుట్టెడు పండుతుంది

• చిత్తకార్తెను గూర్చిన హెచ్చరికను సామెతలు మొదటగానే తెలిపాయి. కానీ అందులో కూడా ఈ కార్తె ఉలవ పంటకు అనుకూలమైందట.

- చిత్తలో చిట్టెడు చల్లితే అడ్డెడు పండును.

- చిత్తలో చల్లితే చిత్తుగా పండును ఉలవ.

• పుష్య కార్తె కూడా చిత్త లాంటిదే. రైతులు ఈ ఈ కాలాలలో సేద్యానికి దూరంగా ఉండాలనే నిర్దేశాన్ని సామెతలు కలిగించాయి.

- పుష్య మాసానికి కూసంత వేసంగి.

- పుబ్బలో పుట్టెడు చల్లే కంటే అశ్లేషలో అడ్డెడు చల్లిందే మేలు.

• పునర్వసు కార్తెకు ఒక ప్రత్యేకత ఉంది. పంట గమ్మాళం నిండుతుందని సామెత చెబుతుంది.

- పునర్వసు కార్తెలో చిట్టెడు విత్తితే గరిసెడు పండును.

• విభిన్నమైన కార్తె మూల. పంట ఇంటి కొచ్చే కాలంగా సామెత నిర్ణయి స్తుంది.

- మూలకార్తెకు వరి మూల చేరుతుంది.

- మూలలో చల్లితే ఉలవలు మూడు పువ్వులు ఆరుకాయలు.

• రోహిణి కార్తె సేద్యానికి ఏమాత్రం పనికిరానిది. గ్రీష్మఋతు ప్రభావంతో ఎండలు దంచికొడతాయి. పంట పొలాలు బీడులు వారుతాయి. ఈ కార్తె స్థితిని సామెతలు వివరించాయి.

- రోహిణిలో విత్తనం రోళ్ళు నిండని పంట

- రోహిణిలో జొన్నలు సాహిణిలో గుఱ్ఱాలు.

- రోహిణిలో విత్తులు రోటిలో విత్తుటే.

- రోహిణిలో రోకళ్ళు చిగిర్చినన్నా చిగిరిస్తవి. రోళ్ళు పగులనన్నా పగుల్తది.

- రోహిణి కార్తెలో విత్తులో విత్తులు వేస్తారు. మృగశిరలో ముంచి వేస్తారు.

• వర్షాలు విస్తారంగా పడేవి స్వాతి కార్తె. రైతు కష్టాలను గట్టెక్కించేది ఈ కార్తె. ఈసామెతలు స్వాతి కార్తెపై ప్రశంసలు కురిపించాయి.

- స్వాతి వర్షం చేనుకు హర్షం

- స్వాతి విత్తనం స్వాతి కోపులు

- స్వాతి కురుస్తే చట్రాయి కూడా పండును

- స్వాతి కురిస్తే పిడితలలోకి రావు జొన్నలు

- స్వాతి కొంగ పంట కాపు నీళ్ళున్న చోటే ఉంటాయి.

• హస్త కార్తెలలో మొదటిది. రైతు నాగలి పట్టి దున్నేది ఈ కాలంలోనే. హస్తపై సామెతలు జన వ్యవహారంలో చాలా ఉన్నాయి.

- హస్తకు ఆది పంటా చిత్తకు చివరి పంటా.

- హస్తలో ఆకు అల్లాడితే చిత్తలో చినుకు పడదు.

- హస్త పోయినా ఆరుదినాలకు అడక్కుండానే విత్తు.

- హస్త చిత్తలు వఱపయితే అందరి సేద్యం ఒక్కటే.

- హస్తలో అడ్డెడు చల్లేకంటే చిత్తలో చిట్టెడు చల్లేది మేలు.

పంటకు ఎరువు ప్రాణాధారమైంది. ప్రకృతి సిద్ధమైన ఎరువు పంటకు పోషణను ఇస్తుంది. ప్రాచీన కాలం నుండి ఎరువు సహజంగా తయారుచేసుకొనే విధానం రైతులు అవలంబిస్తున్నారు. చీడ పీడల నుండి రక్షింపబడడానికి, పంట దిగుబడి పెరగడానికి వ్యవసాయంలో ఎరువుల వాడకం అధికం. కాంపోస్టు ఎరువును తయారుచేసుకోవడం ఇప్పటికీ గ్రామీణ వ్యవసాయదారులు ఆచరిస్తున్నారు. జంతు, పక్షి వ్యర్థాల నుండి బయో ఎరువు ఏర్పడుతుంది. ఆర్గానిక్ ఎరువుల వాడకం వల్ల పంటలు విస్తృతంగా పండుతాయని పెద్దలు చెబుతారు. బలవర్ధకమైన పంట పండాల ఉత్పత్తికి ఈ పద్ధతి అనువైంది. కానీ నేడు అన్ని కృత్రిమ ఎరువులే ఉపయోగిస్తున్నారు. విత్తనాలు చల్లినప్పటినుండి మొదలుకొంటే మొలకలెత్తడం, పైరు పెరిగి పెద్దగా కావడం, పంట చేతికి రావడం వరకు అన్ని వేళల్లో ఎరువును పిచికారీ చేస్తూనే ఉంటారు. ఎరువు వాడకం ఎటువంటిదో సామెతలు చెబుతున్నాయి.

- ఎరువులేని పైరు పరువులేని రైతు.

- ఎరువు ఉంటే వెళ్లినవాడు కూడా సేద్యగాడే.



- ఎరువు పెట్టిన పొలం ఏలుబడి అయిన కోడలు.
- ఎరువును అమ్మి బొంతను పొయ్యిలో పెట్టుకున్నట్లు

అనాదిగా ఏతాము పాటకు వ్యవసాయంలో ప్రశస్తి ఉంది. కర్షకులు శ్రమశక్తిని మరవడానికి మొదట ఎత్తుకొనే పాట ఏతాము. కష్టాల కడలిని ఆ పాటలో మరిచిపోతుంటాడు రైతు. ఏతాములో ఉన్న అనుబంధాన్ని సామెతలు పొగడినాయి.

- ఏతాము పాటకు ఎదురు పాట లేదు
- ఏతాము ఎంత వంగినా తిరిగి లేవడానికే కదా
- ఏతాము నేలకు వంగడం లోతు నీళ్ళు తేనె గదా

రైతుకు అవస్థ కలుపుతోనే. పంట పెరుగుదలకు ఆటంకంగా ఉంటుంది. అశ్రద్ధ చేస్తే చేనునే మింగేస్తుంది. పంట దిగుబడిని నాశనం చేస్తుంది. జాగ్రత్త వహించవలసిన విషయాలను సామెతలు తెలియజేస్తాయి.

- కలుపుతీయని వానికి కసవే మిగులును
- కలుపుతీయని వాడు కోత కోయడు
- కలుపుతీయని పైరు కళ్ళు చేయదు

సేద్యానికి నీటి వనరులు ప్రాధాన్యం వహిస్తాయి. ఆయా చెరువులు, కాలువలు గల పరిసర ప్రాంతాల్లో వ్యవసాయం నిరంతరం కొనసాగుతుంది. సారవంతమైన నేలలో పంట దిగుబడి వృద్ధి చెందుతుంది. అందుకే మైదాన ప్రాంతాల్లో సాగుబడికి కొదువలేదు. కాని కొల్లేరు సంగతి వేరుగా ఉంది. అది సామెతల ద్వారానే తెలుస్తుంది.

- కొల్లేటి పంట కూటికే చాలదు.
- కొల్లేటి వ్యవసాయం గొడ్డ వినాశనం
- కొల్లేటి వ్యవసాయానికి కోత కూడ దండగ

మొదట వ్యవసాయంలో దుక్కి దున్నడం ప్రధానం. ఎంత దున్నితే నేల అంత చదును అవుతుంది. ఈ దుక్కినే వివిధ ఉపమానాలతో పోల్చాయి సామెతలు.

- దుక్కి కొద్ది పంట బుద్ధి కొద్ది సుఖం
- దుక్కి చలువే చలువ తల్లి పాలే పాలు

నాగటి చాళ్ళలోనే విత్తనాలు చల్లేవి. పైరు పండేది. నాగలి సేద్యంలో ప్రధాన సాధనం. కొన్ని ప్రాంతాల్లో పొలాల అమావాస్య చేస్తారు. వ్యవసాయ పని ముట్లను పూజిస్తారు. ఇందులో నాగలిని పూజించడం ముఖ్యం. నాగలికి ఆకలికి మధ్య అంతరాన్ని చెబుతున్నాయి సామెతలు.

- నాగలి ఉన్న ఊళ్ళో ఆకలి చేరదు
- నాగలి భూమిలో నవధాన్యాలు పండుతాయి
- నాగలి మంచిది కాకపోతే ఎడ్లు ఏమి చేస్తాయి.

విత్తనంలో మహావృక్షం దాగి ఉంది. అనంత విశ్వం నిండి ఉంది. సకల జనుల ఆకలి తీర్చే పదార్థం విత్తనంలోనే ఉంది. పూర్వకాలంలో విత్తనాలను సహజ పద్ధతిలో భద్రపరిచేవారు. నేడు శాస్త్రీయ పద్ధతుల ద్వారా మేలు రకమైన విత్తన ఉత్పత్తులను చేస్తున్నారు. పండిన పంట ద్వారా వచ్చిన అన్ని రకాల ధాన్యాలు విత్తనాలు కావు. ఫలదీకరణ చెంది మొలకెత్తడానికి సిద్ధంగా ఉండేవే విత్తనాలుగా పరిగణింపబడుతాయి. ఈ నిగూఢమైన విషయాలు మన పెద్దలకు పాతకాలం నుండే తెలుసు. విత్తనాల మీద సామెతలు అనేకం పుట్టాయి.

- విత్తనం కొద్దీ మొక్క
- విత్తనాలుంటేనే పెత్తనాలు
- విత్తుకన్నా క్షేత్రం మెరుగు
- విత్తుటకు వేయి విత్తులు
- విత్తనం వేసి పొత్తు కలిపినట్లు
- విత్తనంలో లేనిది విశ్వంలో లేదు
- క్షేత్ర మెరిగి విత్తనము పాత్ర మెఱిగి దానము
- విత్తనంబు మఱ్ఱి వృక్షంబునకు నెంత
- విత్తు మంచిదయితే కాయ మంచిదగును
- విత్తు ఒకటి వేస్తే చెట్టు ఒకటి మొలుచునా
- విత్తనానికి దాపరికం విద్యకు వెల్లడి అవసరం
- విత్తనాల సంచులు మంచిదయితే విత్తపు సంచులు నిండును

పచ్చని పైరు పండినప్పుడే రైతు కళ్ళలో ఆనందం వెల్లి విరుస్తుంది. పైరు కలిగిన వాడే భాగ్యవంతుడవుతాడు. రైతు కష్టాలు తీరుతాయి. వేసిన ప్రతి విత్తనం మొలకెత్తినప్పుడు పంట దట్టంగా పెరుగుతుంది. పైరు పెరగడానికి రైతులు అవలంబించే పద్ధతులు అనేకం ఉన్నాయి. పూర్వకాలంలో అయితే భూమిలో సారం అయిపోతే పోడు వ్యవసాయం చేసేవారు. ఆ భూమిని వదిలిపెట్టి వేరే భూ కమతాలను చదును చేసుకొని సేద్యం చేసేవారు. అంతేగాక భూ కమతాలు పరిమితమవుతున్న సందర్భంలో పైరు మార్పిడిని అలవాటు చేసుకున్నారు. పైరు పట్ల రైతుల స్వయం సిద్ధతను సామెతలు ఎల్లవేళలా చెప్పుకొచ్చాయి.

- పైరుకు రాగులు భాగ్యానికి మేకలు
- పైరు మార్చిన పంట పెంపు
- పైరు గాలి తగిలితే పంట ఊరదు
- పైరు నిడిన వాడు బహు సౌఖ్యవంతుడు
- పైరుకు ముదురు పసరానికి లేత
- పైరు పలచనైతే పాతళ్ళు నిండుతవి
- పైరు మెండైతే వాములు దండి

మనం పండించే ధాన్యంలో వడ్లు ప్రధానమైనవి. దక్షిణ భారతదేశంలో ప్రజల ప్రధాన ఆహారపు పంట వరి. మన రాష్ట్రంలో కల్పించిన ప్రాజెక్టుల మూలంగా నీటి వనరుల శాతం పెరిగి వరి దిగుబడి బాగా వస్తుంది. వడ్ల మీద సామెతలు;

- వడ్ల గింజలోనిదే బియ్యపు గింజ
- వడ్లు, గొడ్లు ఉన్న వానిదే వ్యవసాయం

పంటల్లో వరి తర్వాత కంది పంట మీద ఎక్కువ సామెతలు పుట్టుకొచ్చాయి. కంది పంటకు, కాపు వాడికి చక్కటి పోలికలు చెప్పాయి. కొన్ని ప్రాంతాలలో కంది పంటతో గట్టెక్కిన రైతుల జీవనస్థితిని వర్ణించాయి.

- కంది పండితే కరువు తీరును

వ్యాసం

- కంది చేనులో క(రు పోగొట్టుకొని, పప్పు చట్టిలో వెదికినట్లు

- కంది గింజను, కాపు వాడిని వేచనిదే చవిగావు.

- కళ్ళెం వెళ్ళిన తర్వాత కంది గుగ్గిళ్ళు

దుంపలలో కందగడ్డపై సామెతలు వెల్లి విరిసాయి. సహజంగా కందకు దురదెక్కువ. ఈ గుణాన్ని సామెతల్లో పెట్టి ప్రజల జీవన వ్యవహారాల్లోకి తీసుకొచ్చాయి. ఒడుపు తనంతో కూడిన హెచ్చరిక ఉంటుంది.

- కందకులేని దురద కత్తి పీటకెందుకు

- కందకులేని నస బచ్చలికెందుకు

- కందకులేని దూల చేనుకెందుకు

- కాని చోట కందయినా కాయదు

ఇక సామెతల్లో రైతు కష్టాలను, కడగండ్లను తెలిపేవి ఉన్నాయి. ప్రత్యేకంగా రైతు జీవితాన్ని ఇవి ప్రతిబింబిస్తాయి. ప్రకృతికి, ప్రళయానికి ఎదురు తిరిగి రైతు పండించే పంట సమస్త మానవాళి పోషణకు ఆధారమవుతుంది. అందుకే రైతు సంక్షేమానికి రాజ్యాలు ప్రాధాన్యం ఇస్తాయి.

- రైతు క్షేమం రాజు భాగ్యం

- రైతు పాడు చేను బీడు

- రైతు బీదగాని చేను బీదగాదు

- రైతు లెక్క చూస్తే నాగలి కూడా మిగలదు

వ్యవసాయానికి సంబంధించిన చాలా సామెతలు నిజాం కాలంలో పుట్టి ఉండ వచ్చు. భూస్వామ్య విధానంలో రైతు - రైతు కూలి అయ్యాడు. రైతు కూలి - కూలి అయ్యాడు. భూమి కోసం - భుక్తి కోసం - వెట్టి చాకిరి నిర్మూలన కోసం తెలంగాణ సాయుధ పోరాటం ఏర్పడింది. భూమి శిస్తు కట్టలేక రైతుకూలీలు దొరలకు బానిసలు అయ్యారు.

అతి వృష్టి, అనావృష్టి ఏర్పడి పంట చేతికి రాక శిస్తులో కట్టవలసిన ధాన్యం అప్పు పడేవారు. దీనిని తర్వాత పంటలో నాగుల కింద జమచేసేవారు. ఆ పంటలో కూడా నష్టం వాటిల్లితే నాగులు పెరుగుతూ పోయేవి. ఇలా ఒక్కోసారి పంట పండినా అంతా శిస్తులోనే కట్టబడేది. వేయి పుట్ల గింజలు పండించినా, తినడానికి తిండి లేని స్థితిని నిజాం కాలంలో గమనించవచ్చు. దౌర్జన్యం, దోపిడీలతో నాడు బూర్జువా వ్యవస్థ అమలయ్యేది.

- అన్నీ పండించిన రైతుకు అన్నమే కరువు

- అతివృష్టి అయినా అనావృష్టి అయినా ఆకలి బాధ తప్పదు

- అడ్డెడు వడ్ల ఆశకు పోతే తూమెడు వడ్లు దూడ తిని పోయినట్లు

**పాడి - పశుపోషణ...**

వ్యవసాయానికి అనుబంధంగా పశు పోషణను చేపట్టడం రైతులలో కనిపిస్తుంది. పాడి ఉంటేనే సేద్యం సాగుతుంది. ఆవులు, గేదెలు, ఎద్దులు, లేగలు, దూడలు పొలం ఉన్న వారికి తప్పనిసరిగా ఉంటాయి. కొందరు ప్రత్యేకంగా పశుపోషణనే ఆధారంగా చేసుకొని జీవిస్తుంటారు. ఈ పాడి, పశు పోషణకు సంబంధించిన అనేక సామెతలు తెలుగు జన జీవనంలో ఉన్నాయి. పాడి నుండి లభించే అనేక ఉత్పత్తులు సంపూర్ణ ఆరోగ్యాన్ని కలిగిస్తాయి.

మొదట పాడి గూర్చిన సామెతలు చూద్దాం. పాడి పంటలు పదబంధాలు, జంట పదాలుగా స్వీకరిస్తాం. పశువులు మానవ జీవితంలో కూడా అనుబంధాలను ఏర్పరచుకుంటాయి. కారుణ్యాన్ని చూపుతాయి. వాటి పేడ ఎరువుగా పనికి వస్తుంది.

- పాడి గుట్టు పంట రట్టు

- పాడితో పంట ఓపదు

- పాడిలేని గొడ్డు, బిడ్డలేని ఆలు

- పాడి లేని ఇల్లు పేడలేని చేను

- పాడిలేని ఇల్లు పాడు బడ్డ నీరు

- పాడికి పసి బిడ్డకు దిష్టి లేదు

- పాడి కుండ పగులగొట్టుకొన్నట్టు

- పాడి గాచవలె పంట పొగడ వలె

పశు పోషణ వృద్ధి చెందాలంటే లేగలు, దూడలు పుట్టాలి. రైతులకు సంతోషాన్ని కలిగించే పశు సంపద మీద సామెతలు ఉన్నట్లే దూడలకు సంబంధించినవి కనిపించాయి.

- దూడ లేని పాడి దుఃఖపు పాడి

వ్యవసాయ పనుల్లో ఎద్దులు చేదోడు వాదోడుగా ఉంటాయి. కష్టించి పనిచేస్తాయి. నాగలిని భుజాలకు కట్టుకొని పొలం దున్నుతాయి. బీడువారిన భూమిని చదునుచేస్తాయి. ఎద్దుల పనితనాన్ని తెలుగు సామెతలు చాలా గొప్పగా ప్రస్తావించాయి.

- ఎద్దు కొద్ది సేద్యం సద్ది కొద్ది పయనం

- ఒంటి ఎద్దు సేద్యం ఒరుకాలి నొప్పి

- జోడెద్దులకే తెలుసు నాగలి కాడి బరువు

- గుడ్డెద్దు చేనులో పడ్డట్లు

- పెద్ద ఇంటి బొట్టె ఎద్దులున్న వ్యవసాయం

పాడిలో పాల ఉత్పత్తులు అధికం. పశుపోషణలో సమగ్ర ఆదాయం ఈ ఉత్పత్తుల వల్లనే కలుగుతుంది. సమీకృత ఆరోగ్యాన్ని పరిరక్షిస్తున్నాయి. పాలు, పాదుగుకు సంబంధించిన సామెతలు ఉన్నాయి.

- పొదుగు కోసి పాలు తాగినట్లు

- పొదుగు చింపిన పసరం పోతునీనుతుందా

- పొదుగులో ఉన్నా ఒకటే దుత్తలో ఉన్నా ఒకటే అన్నట్లు

- పొదుగులేని ఆవు పాలిస్తుంటే నాలికలేని పిల్లి నాకేసిందట

ప్రాచీన కాలం నుండి సంప్రదాయమైన వృత్తులను ఆధారంగా చేసుకొని తెలుగు ప్రజల జీవన వ్యవహారంలో ఉన్న సామెతలు ఇవి. ఈ సామెతలన్ని ఆయా వృత్తుల పరిభాషల్లో ఉన్నా కానీ ఇవి సామాజిక చిత్రికకు దర్పణం పడుతాయి. నీతిని, ధర్మాన్ని, సంఘ జీవనాన్ని, కలిసికట్టుతనాన్ని నేర్పుతాయి. వృత్తులన్నింటిలో ఉన్న పరస్పర సమైక్యతా భావాన్ని తెలుపుతాయి. సమిష్టి సామాజిక ప్రయోజనానికి ప్రాధాన్యం వహిస్తూ, సంభాషణల్లో ప్రావీణ్యాన్ని, కళాత్మకతను ప్రదర్శిస్తాయి.

# రుక్మిణీ కళ్యాణము

**పద్మపురాణోత్తర ఖండము - మడికి సింగన**



భాగవతంలోని రుక్మిణీ కృష్ణుల కళ్యాణ వర్ణన. తెరపట్టుట, అక్షితలు, పాణిగ్రహణము, మంగళవాద్యాలు మొదలైనవి కవికాలంనాటి ఆచారాలుగా గ్రహించవచ్చు. సంప్రదాయము, వివాహ వైభవం, వధూవరుల మనోభావాలు ఇందులో అందంగా వర్ణించారు.

మడికి సింగన క్రీ.శ. 14వ శతాబ్దం. కందనామాత్యుని మిత్రుడు. పద్మపురాణోత్తర ఖండం, భాగవత దశమస్కంధం (ద్విపద), జ్ఞానవాసిష్ట రామాయణంతోపాటు కొందరు కవుల రచనలు సకలనీతి సమ్మతి పేరుతో ఒక సంకలనం చేశాడు. ఇదే తెలుగులో తొలిసంకలనం.

చం. కదలని క్రొమ్మెరుంగు కసుగందని కెందలిరాకు నాచుతో
కొదువని తూడు బంగరవు పుత్తడి మవ్వపు బువ్వ భర్గుతో
నెదురని కామునమ్ము ఫణి యెంగిలికాని సుధాంశురేఖనా
నొదవుచునుండె రుక్మిణి పయోరుహనాభుని భాగ్యరేఖగాన్

కం. తెరచీర సట్టుయిరువురు
నిరువంకల నిలువబెట్టి యింపుదలిర్పన్
సురయక్ష సిద్ధ కిన్నర
నరకాంతలు మిము భజించి నలిగీర్తింపన్

సీ. సుముహూర్తమనుచు భూసురులు నల్గడ నిల్చి
లలిమంగళాష్టకములుపఠింప
నిత్యమంగళమని నిఖిలార్థవరులును
చెలువార గైవారములు వచింప
జయజయధ్వనులకు సకలదేవతలును
చదలనెల్లెడ నిల్చి సంస్తుతింప
నత్యంత కళ్యాణమనియు పేరంటాండ్రు
పాటించి పెండిరి పాటపాడ

గీ. దేవదుందుభులును దివ్యగానంబులు
పుణ్యకీర్తనములు భూరి నుతులు
రూఢిజెలగెనపుడు రుక్మిణీ కృష్ణుల
వరవివాహ వైభవంబు వొలిచె

సీ. తరుణి చేతను ప్రాలు వరుమౌళి బోయుచో
జనుగ్రేవ మెరుగులు చౌకళింప
నన్యోన్య ముఖవీక్షణాసక్తులైనచో
కలువలు తమ్ములు చెలిమి సేయ
ప్రథమ సంగమకాంక్ష ప్రసరింపు దలపులు
పొదవి మేనులయందు పులకలలయ
కన్నియ పతి కరగ్రహణంబు సేయుచో
పంచబాణుడు పునర్భవుడుకాగ

గీ. కల్పతరువును లతయును కలిసి మెలసి
యొక్క కుదుటను మొలచి పెంపొదవినట్లు
బెండ్లి పీఠంబు పైనుండి ప్రేమలొలయ
నవ్వధూవరులొప్పారి రపుడు చూడ

వ్యాసం

# బహుజన వృత్తినవల, 'సుషుప్తి'

**కులవృత్తిని దృష్టిలో పెట్టుకొని అప్పటి తెలంగాణ గ్రామ జీవన సంస్కృతిని మొత్తం అద్దంలో మాదిరి చూపిన వ్యాసం...**



కె. విద్యావతి

తెలంగాణ ముద్రతో వచ్చిన నవల సుషుప్తి.''కుమ్మరి కుల వృత్తి'' వస్తువుగా తెలంగాణలోనే కాక మొత్తం తెలుగు నవలా సాహిత్యంలో ఇప్పటి వరకు వచ్చిన ఒకే ఒక్క మొదటి నవల,"సుషుప్తి''.

1970 దశకంలో వచ్చిన ఈ వృత్తినవల మాదిరెడ్డి సులోచన సామాజిక స్పృహకు, సాహిత్య నిబద్ధతకు నిదర్శనం. 1947-55 మధ్యకాలంలో నిజామాబాద్ జిల్లాకు చెందిన లోకమలహరి పద్మశాలీల వలస జీవితాన్ని వస్తువుగా 'సంగం' నవల రాసింద్రు. ఇందులో భీవండి, సూరత్, బొంబాయిలకు వలసపోతున్న పద్మశాలీల జీవితాలను చిత్రీకరించింద్రు. సంగం నవల తర్వాత తిరిగి కుల వృత్తిపై వచ్చిన నవల సుషుప్తి. తెలంగాణ కుల వృత్తుల నుంచి కుమ్మరి కులాన్ని వస్తువుగా, వాళ్ల జీవితాలల్ల సంక్రమిస్తున్న మార్పులను కుల జీవితాన్ని వివరంగా ఛిత్రిస్తూ మాదిరెడ్డి సులోచన "సుషుప్తి'' నవలను రాసింది.

'కులవృత్తి' పై నవలను రాసిన మొట్టమొదటి రచయిత్రిగా తెలంగాణ మరియు మొత్తం తెలుగు సాహిత్యంలోనే విశిష్టతను పొందిన రచయిత్రి "మాదిరెడ్డి సులోచన''.

'సుషుప్తి' నవల 1975లో శేషాచలం కంపెనీ, మద్రాసు నుంచి ప్రచురితమైంది. అప్పుడు ఈ నవల ధర మూడు రూపాయల యాభై పైసలు.

మారుతున్న ఆర్థిక సామాజిక వాతావరణంలో, 1970-80 దశకంలో సామాజిక చలనం ఏర్పడటం, పల్లెజనం పట్నానికి, పట్నం వాళ్లు నగరం వైపు బయలు దేరడం ప్రారంభమైంది. జీవితంలో వికాసం, స్తోమతను పెంచుకోవడం కొరకు తాపత్రయం ఏర్పడింది. అంతవరకున్న కుల వృత్తులపై, గ్రామీణ వ్యవస్థపై, పారిశ్రామికీకరణ ప్రభావం బలంగా పడ్డది. కుల వృత్తిని నమ్ముకుని గ్రామాలనే అంటిపెట్టుకున్న వాళ్ళ జీవితాలు అడుగంటి పోయినయి. ఇట్లా దెబ్బ తిన్న వృత్తుల్లో కుమ్మరి వృత్తి ఒకటి.

"కుమ్మరి బాలయ్య'' కుటుంబ జీవితాన్ని, వాళ్ళ వృత్తిని నేపథ్యంగా పెట్టుకొని రచయిత్రి మాదిరెడ్డి సులోచన అప్పటి తెలంగాణ గ్రామ జీవన సంస్కృతిని మొత్తం అద్దంలో మాదిరి చూపించింది.

తెలంగాణలో సాంఘిక వాతావరణం మారుతున్న క్రమంలో అన్ని కుల వృత్తులు రోజు రోజుకు ఎట్ల పతనావస్థకు చేరుతున్నయో రచయిత్రి నవల మొదట్లనే చూపించింది.

కుమ్మరి బాలయ్య కుల వృత్తి వివరాలు చెప్పుకుంట తెలంగాణ గ్రామీణ జీవితంలో ప్రవేశిస్తున్న ఆధునిక భావజాలాన్ని, మార్పులను ఆవిష్కరించింది.

పారిశ్రామికీకరణ ఫలితంగా ప్లాస్టిక్ వస్తువులు, స్టీలు, సత్తుగిన్నెల వాడకం 70వ దశకం నాటికి పల్లెల్లో కూడా మొదలైంది. నిత్యావసర వస్తుజాలంలో మార్పుల వల్ల ఎక్కువ ఇబ్బందులు కలిగింది కుమ్మరి వాళ్ళకే! వంట సరుకులో మార్పు-అంటే కిరోసిన్. స్టౌలు, గ్యాస్ వంటివి ప్రవేశించటంతో మట్టి పాత్రలు వంట చేయడానికి ఉపయోగపడక పోవటం వల్ల  అటికెలు, సట్టిలు, ముంతలు వంటి మట్టి పాత్రల వాడుక, రెఫ్రిజరేటర్లు రావటం వల్ల చల్ల నీళ్లకు కుండలు, కూజాలు పెద్ద మొత్తంలో తగ్గి పోయినయి. ఇండ్లు కప్పడానికి, 'మట్టి పెంక' బదులు సిమెంటు రేకులు, నీళ్ళు తెచ్చుకోవడం కోసం మట్టి కడవలకు బదులు ప్లాస్టిక్ బిందెలు వాడటం వంటి అనేక మార్పులు జనజీవనంలో సంభవించడంతో కుమ్మరి వాళ్ల 'బతుకుదెరువు'కు ప్రత్యామ్నాయం లేకుండా పోయింది. "కుమ్మరిసారె''

వ్యాసం

మూలపడే ప్రమాదం పొంచివున్న తీరును రచయిత్రి చాలా సహజంగా చిత్రించింది.

ఊరు-పట్నం అనే తేడా లేకుండా తెలంగాణ జానపద జీవనసంస్కృతిలో ఏ శుభ కార్యానికయినా అశుభ కార్యానికయినా కుమ్మరి కుండలతోనే పని! గ్రామీణ జీవనసంస్కృతిలో అన్నంకూర వండుకోవడానికి, మంచినీళ్ళు తెచ్చుకోవడానికి, ఈడి గోళ్ళు 'కల్లు' నింపనీకి, పెండ్లి పేరంటాలు వంటి అన్ని అవసరాలకు కుమ్మరి కుండలు పనికొచ్చేవి. ప్లాస్టిక్ సంస్కృతి పల్లెల్లోకి వ్యాపించిన తర్వాత చాలా అవసరాలను ప్లాస్టిక్ సామాను తీరుస్తున్నది. అందువల్ల కుమ్మరి వాళ్ళు పూర్తిగా కుల వృత్తిపై ఆధారపడి జీవించే పరిస్థితి లేకుండ పోయింది.

> "ఒకప్పుడు తండ్రి తల్లిని కొడితే, తన కంటే బలహీనురాలయిన స్త్రీని కొట్టి 'మొగవాడు అనిపించుకోవటమా' అని అసహ్యించుకున్న గోవిందు భార్యను కొట్టాడు. అతను కాదు అతని శరీరంలో వున్న రక్తం కొట్టింది. అందుకే కొందరు స్త్రీ స్వేచ్ఛగా అనుభవించే లైంగిక జీవితం అరికట్టారు. ప్రకృతి పక్షపాతాన్నెవరు కాదనలేరు. స్పష్టంగా లైంగిక జీవితానికి ఫలితం మూట గట్టుకుంటుందని తెలుసు" అంటుంది రచయిత్రి ఇక్కడ..



ఒకప్పుడు తన వృత్తి లో ఓ వెలుగు వెలిగినాడు బాలయ్య. బాలయ్య చేసిన కూజాలంటే జిల్లా కంతా ప్రసిద్ధి. అలాగే అతను కూర చట్టీలు చేసి నార్సింగ్ సంతకు తీసుకువెడితే గంటలో అన్నీ అమ్ముడు పోయేవి!

"బాలయ్య పెరుగు తోడు పెట్టే ముంతలు యెంత బాగా చేస్తాడో, జాడీలు కొన బుద్ధి వెయ్యదు" అనేది నర్సింహారెడ్డి భార్య లక్ష్మమ్మ.

"బాలయ్యా పూలకుండీలు నువ్వు చేస్తే మన్నుతాయి. చూడటానికి అందంగా ఉంటాయి". డాక్టర్ గారు స్వయంగా కుమ్మరివాడకు వచ్చి తనకు కావలసినవి ఎన్నిక. చేసుకునేవాడు.

"బాలయ్యా మా ఇల్లు కప్పు వరకు వచ్చింది. ఓ పది వేలు పెంకు కావాలి". కొత్తగా పెంకుటిండ్లు కట్టుకునే వారు అడ్వాన్సులు ఇచ్చేవారు.

"అబే బాలయ్యా - నాకీ కుండల్ కావాల్ భాయి"- ఒకప్పుడు నవాబు గిరి వెలగబెట్టిన దావూద్ లుంగీ సవరించుకుంటూ వచ్చి పెద్ద పెద్ద కుండలు యెన్నిక చేసుకు పోయేవాడు.

"బాలన్నా చిప్పలు నీ ఆముల కాలితే గట్టి గుంటయె-" అంటూ చాకలి, హరిజన, బెస్తవాడల నుంచి స్త్రీలు వచ్చే వారు.

"ఓ బాలయ్యా! ఏందోయ్ కనిపించటం లేదు. వారం రోజుల నాటికి రెండొందల కల్లు ముంతలు కావాలి. తయారయితయా?" -గౌండ్ల స్వామి వచ్చి మట్టి దులుపుకొని కూర్చునేవాడు.

"నోములకు కొత్త కుండలు కావాలి. కాస్త మధ్యస్తంగా చెయ్యవోయ్"

-కోమటి వాడ నుంచి ఆర్డరు వచ్చేది.

- ఇవన్నీ ఇప్పుడు కాదు. ఒకప్పుడు. బాలయ్య వయసులో వున్నప్పుడు. అతని చేతి కింద యెప్పుడూ నలుగురు పని చేసేవారు. 'పని నేర్చుకుంటాడంటూ' బంధువులు, తెలిసినవారు తమ తమ పిల్లలను వదిలిపెట్టే వారు.

బాలయ్య భార్య యెంకమ్మకు కంపకు వెళ్ళే పని లేదు. కాళ్ళకు కడియాలు నడుముకు మూడు అంగుళాల వెడల్పుతో వెండి వడ్డాణం, మట్టి గాజుల వెనుక, ముందు వెండి కడియాలుండేవి. చెవులకు గెంటీలు, మెడలో గుండ్లపేరు ఉండేవి. "కుమ్మరి యెంకమ్మనా, పూసిన తంగేడులా వుంటుంది" అనుకునేవారు తోటి స్త్రీలు. పంట లేకపోయినా, వ్యవసాయదారులకు కుండలిచ్చి తెచ్చిన ధాన్యం ఇంటినిండా ఉండేది. బాలయ్య మాటలల్ల మారిన కాలం గురించి-

"బెమ్మంగారు సెప్పిన కాలమిదేనేమో! తోలు బట్టలు, టీలు గిన్నెలు! నా కుండలు ఎవడికి కావాలె? పెంక కప్పితే యిల్లు గాదంట - సిమిటి రేకులంట, రేకులు.. నా సేత్తో ఇచ్చేవోడిని, యెండకాలం ఎల్లుదలకు నూరు కూజాలు రెడ్డి గోరింట్ల. అదేందో అయిసు పెట్టెనంట...." ఇలా సాగుతుంది...

ఈ నవల రాసే నాటికి గ్రామీణ జీవితంలో ప్రవేశించిన, ప్రవేశిస్తున్న మార్పును కథాకథనం చేసింది రచయిత్రి "ఇప్పుడు బీదవారు కూడ పగిలే కుండలెందుకు అని సత్తుగిన్నెలు కొనుక్కుంటున్నారు. పెంకుటిళ్ళు కూడా చాలా తగ్గాయి. పది రోజులకో చన్నీటి కూజాలు మార్చే ధనికులు కూడా

వ్యాసం

రెఫ్రిజిరేటర్లు కొంటున్నారు. కుమ్మరి బాలయ్య తన సింహాసనం కోల్పోయినట్లు బాధ పడతాడు. ఆ కసి భార్య మీద కొడుకు మీద తీర్చుకుంటాడు.'' ...అని బాలయ్య దిగజారి పోయిన వృత్తి జీవితాన్ని చిత్రించింది.

ప్రత్యామ్నాయంగా గ్రామాలల్లకు దిగుతున్న వస్తుజాలానికి రచయిత్రి చేసిన దృశ్యీకరణం "యెంకమ్మ గంప నిండుగా పిడుతలు పేర్చుకొని అంగడి వెళ్ళింది. ఆమె గంప దింపుతుండగానె ఎదురుగా స్టీలు గిన్నెల కొట్టు కనిపించింది. కసిగా తిట్టుకుంది. ఇట్లె ఇంట్ల దుమ్ము వడ! ఇవ్వి వచ్చినంక బేరాలు లేవు. సాయంత్రం వరకు కూర్చుంటే పది గురుగులు అమ్మ గలిగింది... ఆకుల బుచ్చీ జర గంప ఎత్తు బిడ్డా! ఆకులు అమ్ముతున్న అమ్మాయి వచ్చి గంప ఎత్తింది. తల మీద బరువుతో అటుయిటు చూడలేక పోయింది. దూరంగా వున్న రెండు పక్కల కొట్లు కనిపించాయి. ఆ కొట్లవాళ్ళందరూ తమ జీవనోపాధి లాక్కుపోవడానికి వచ్చినంత బాధ పడింది. ఆమె బాధపడిన దాంట్లో తప్పు లేదు.

గంగమ్మ గంప నిండుగా మిరపకాయ బజ్జీలు, బోండాలు, రొట్టెలు తీసుకుని సంతకు వస్తే నాల్గు దాటకముందే గంప ఖాళీ అయ్యేది. ఇప్పుడు? చిన్న బుట్టలో తెచ్చి ఈగలు తోలుతూ కూర్చుంటుంది. ప్రతివాడు అయ్యరు హోటలుకే పోతాడు.లేదా సాయబు టీ కొట్టుకు వెడతారు.

గాజుల బంగారు పని అంతే అయ్యింది. రంగు రంగుల గాజులు భుజానికి వేసుకొని తిరిగితే, వీధిలో వారు పిలిచి గాజులు వెయ్యమనే వారు, మల్ల వచ్చేటప్పుడు ఏస్త. అంగట్లకు పోవాలె అనేది.

మంచి గాజులు అన్ని అయిపోవా అని ముత్తయిదువులు దెబ్బలాడెవారు.

....ఇగో ఇవి గుణసుందరి గాజులు... శ్రీ లచ్చుమమ్మ గాజులు.. అంటూ మలారం తీసేది. నిమిషాల మీద పెట్టె ఖాళీ అయ్యేది. బంగారుకు బేరమే

**బాలయ్య భార్య యెంకమ్మకు కంపకు వెళ్ళే పని లేదు. కాళ్ళకు కడియాలు నడుముకు మూడు అంగుళాల వెడల్పుతో వెండి వడ్డాణం, మట్టి గాజుల వెనుక, ముందు వెండి కడియాలుండేవి. చెవులకు గెంటీలు, మెడలో గుండ్లపేరు ఉండేవి. "కుమ్మరి యెంకమ్మనా, పూసిన తంగేడులా వుంటుంది" అనుకునేవారు తోటి స్త్రీలు. పంట లేకపోయినా, వ్యవసాయదారులకు కుండలిచ్చి తెచ్చిన ధాన్యం ఇంటినిండా ఉండేది. బాలయ్య మాటలల్ల మారిన కాలం గురించి-**

లేదు.మిగులు పడ్డ గాజులు సంతయిన మర్నాటికి ఇల్లు ఇల్లు తిరిగి అమ్ముకుంటుంది...

సంత వీధిలోనే గాజుల కొట్టు వెలిసింది. దాంట్లో గిల్టు నగలు, రిబ్బన్లు, బొట్టు కాటుక, లేసులు, సబ్బుపెట్టెలు ఇలా రకరకాలు అమ్ముతారు. అందరూ దర్జాగా కొట్టుకే పోతారు.

దర్జీ ఇస్తారి పెళ్ళాం మిగిలిన గుడ్డలతో డబ్బులు దాచుకోవటానికి చిన్న చిన్న సంచులు, చిన్న పిల్లల టోపీలు కుట్టేది. సంత రోజు నిమిషాల మీద అన్ని అమ్మి వారానికి కావలసిన కూరానారా కొనేది. ఇప్పుడు వాటి ముఖం ఎవరూ చూడటం లేదు...

వారిలో తనొకత్తి అనుకుంది యెంకమ్మ.కుల వృత్తి వదిలి వేరే పని చేసుకోవాలంటే మనసు అంగీకరించదు''.

ఇట్లా పల్లెలు, పట్నాలల్ల ప్రవేశిస్తున్న కొత్త వస్తువులు, వ్యాపారజీవనశైలి వల్ల కులవృత్తినే నమ్ముకుని బతుకుతున్న బాలయ్యలు ఎందరో వ్యర్థ జీవులుగా మిగిలి పోవలసి వచ్చిందన్న వాస్తవాన్ని రచయిత్రి పాఠకుల కళ్ళముందుంచింది.

ఇంక వీళ్ళ చదువుసంధ్యల గురించి రచయిత్రి కథాకథనం. వారికి పుట్టింది ఒక్కడే కొడుకు 'గోవిందు'. బడికి పంపితే స్కాలర్ షిప్ వస్తుంది అని పంపేవారు. అతను చదివాడా ఊళ్ళో తిరిగాడా వాళ్లకు అక్కర లేదు. ఎప్పుడయినా బజార్లో మాష్టారు కనిపించి చీవాట్లు వేసేవాడు.

"ఏం బాలయ్యా, కుర్రాడి సంగతి బొత్తిగా పట్టించుకోవేం? రోజా సాయంకాలం మా ఇంటికి పంపవయ్యా'' అనేవాడు.

"సదువుకొని ఊల్లు ఏలాలా, ఉద్యోగం సెయ్యాలా! మా పని వుంది. వాడొక్కడు బతక్కపోడు'' అనేవాడు.

గోవిందుతో పెళ్లినాటికే గర్భం దాల్చిన సుక్కి పెళ్ళయిన ఎనిమిదో నెలలోనే కొడుకును కంటది. ఆ బిడ్డ తండ్రి తను కాడని దావూద్ ద్వారా తెలిసిన మరు క్షణం తట్టుకోలేక గోవిందు, "సెప్పే, దెషా సెప్పు...'' సుక్కను వంగదీసి నాల్గు గుద్దులు వేశాడు.

"ఒకప్పుడు తండ్రి తల్లిని కొడితే, తన కంటే బలహీనురాలయిన స్త్రీ ని కొట్టి 'మొగవాడు అనిపించుకోవటమా' అని అసహ్యించుకున్న గోవిందు భార్యను కొట్టాడు. అతను కాదు అతని శరీరంలో వున్న రక్తం కొట్టింది. అందుకే కొందరు స్త్రీ స్వేచ్ఛగా అనుభవించే లైంగిక జీవితం అరికట్టారు. ప్రకృతి పక్షపాతాన్నెవరు కాదనలేరు. స్పష్టంగా లైంగిక జీవితానికి ఫలితం మూట గట్టుకుంటుందని తెలుసు'' అంటుంది రచయిత్రి ఇక్కడ.

"వదులు, వదులు "అతన్ని దూరం నెట్టింది. బాలెంతరాలు. పచ్చి శరీరం దెబ్బలకు ఓర్చుకోవడం లేదు. అపర కాళిలా గోవిందు పైకి లేచింది సుక్క..

"సత్తెం జెబుతాను. ఏం జేస్తవో జేసుకో.

ఈ పిల్లగాడు ఎవరి పిల్లగాడో,

నేను మా సర్పంచి కొడుకుతో తిరిగినా..''

"ఆన్నే పెండ్లి జేసుకోక పోయినవు..''

"చేసుకుందమనుకున్న. ఆ ముదనష్ట పోడు నీ అసుంటి మొగోడే. అందుకని ఆని కులం పిల్లను జేసుకున్నడు.''

ఈ సారి సుక్క మాటల్లో తెగింపు, కరుకుదనం స్పష్టంగా కనిపించాయి.

"నన్నెందుకు జేసుకున్నవే?''

వ్యాసం

"బుద్ధి లేక" అన్నది నిర్లక్ష్యంగా..

"అయితే బద్మాష్ ఒక్క గడియ ఉండొద్దే.. పో, పో. సుక్కను తరిమేశాడు..

"పోత తీయి - నువు కూకుండవెట్టి బువ్వ పెడ్తున్నట్లు మాట్లాడ్తవు - ఇదే కష్టం జేసుకోని నా పిల్లగాడిని నడుపుకుంట"

"కష్టమెందుకే లమిడీ ! సర్పంచి కొడుకు బువ్వ వెట్టడు?"

"పెద్దే పెద్దడు లే. నువ్వు మా ఉద్ధరించిట్టు.. శిన్న తప్పుకు మీరు ఎన్ని మాటలన్నా పడ్డ.

కూటికి లేకపోతే, నా తప్పు చూపి బయట పెట్టి పైసలు తెచ్చిన. ఈన సుద్దపూస నంట. పెండ్లమును సాదలేక ఇడ్సి పెట్టి మల్ల మాట్లాడుతడు."

గోవిందు నోటమాట రానట్టుండి పోయాడు." మాట్లాడేది సుక్క నా అనుకున్నాడు.

అతను తేరుకొనే లోపలే, ఆమె బట్టలు సదురు కొని చేతి సంచిలో పెట్టుకొని, కొడుకును భుజం మీద వేసుకొని వెళ్లి పోయింది.

స్త్రీ వ్యక్తిత్వం, పురుషాధిపత్య సమాజం పై నిరసనలు యెంకమ్మ మాటల్లో వినిపించింది రచయిత్రి - "శిగ్గ శరం లేదే నీకు? "అన్న బాలయ్యను తిరస్కారంగా చూచింది యెంకమ్మ. ఆమె గుండె లోని మంట ఎవరికి అర్థం కాదు. "ఏందీ? శిగ్గ శరమా? అవి రొండున్న మనుస్లు కొంగు నడుముకు కట్కోని కొంపకువోరు. లో తొడలు కనిపించే దాక చీర పైకి జెక్కి పన్ల జెయ్యరు." అన్నది.

**జానపదుల తిట్లు, ఒట్లు, ఏడుపులు, దీవెనార్తులు, సామెతలు.. తెలంగాణ పలుకుబడి, జాతీయాలతో ఈ నవలను తెలంగాణ భాషా పరంగా సుసంపన్నం చేసింది. ఆడవాళ్ల సంభాషణలు, మగవాళ్ల సంభాషణలు, పడుచు పోరగాళ్ళ మాటలు, మంచినీళ్ళ బాయి కాడి అమ్మలక్కల ముచ్చట్లు, దావూద్ లాంటి ముస్లింల ఉర్దూ పలుకుబడితో కూడిన తెలుగు మాటలు ఇట్ల, ఒక సజీవ స్థానిక భాషా శైలులకు చిత్రిక పట్టింది రచయిత్రి!**

'స్త్రీలకు శిగ్గ శరమూ ఉండాలంటే అవి కాపాడబడాలంటే, పురుషుల స్వభావం ప్రవర్తనలు మారినప్పుడే జరుగుతది. స్త్రీ కొక నీతి పురుషుని కొక నీతి వున్నంత కాలం స్త్రీ పురుష సంబంధాలల్ల అనైతికతనే వ్యాపించి వుంటది.' అన్న సామాజిక వాస్తవం ప్రతిబింబిస్తయి పై రెండు స్త్రీ పాత్రలు!

నలభై సంవత్సరాలకు ముందటి తెలంగాణ సమాజంలోని జానపద ఆచారాలు, కుల కట్టు బాట్లతో కూడిన పెళ్లి, పుట్టుక, చావు వంటి పద్ధతులు - వాటిలోని మానవీయ కోణాలను 'సుషుప్తి'లో ఆవిష్కరించింది రచయిత్రి..

స్థానిక ఆచారాలను వ్యక్తం చేసే తెలంగాణ పలుకుబడి, పడికట్టు పదాలను అక్కడికక్కడే వివరిస్తూ రాయటం నవలలో రచయిత్రి కథనశైలిలో చూపిన మరో ప్రత్యేకత..

భాషకు సంబంధించినంత వరకు, 'తెలంగాణ జానపద భాషారూపాల పదకోశము' , 'సుషుప్తి' నవల అంటే అతిశయోక్తి కాదు. రచనా భాషగా కథాకథనానికి రచయిత్రి కొంత ప్రామాణిక భాషను అక్కడక్కడ వాడినా, సమయ సందర్భాలను బట్టి పాత్రోచిత భాషను సన్నివేశాల చిత్రీకరణకు, సంభాషణలకు ప్రయోగించింది.

"యెంకమ్మ పూసిన తంగేడులా వుంది" అని తంగెడు చెట్లుతో పోల్చటం కేవలం తెలంగాణ భాషా ప్రయోగం!

జానపదుల తిట్లు, ఒట్లు, ఏడుపులు, దీవెనార్తులు, సామెతలు.. తెలంగాణ పలుకుబడి, జాతీయాలతో ఈ నవలను తెలంగాణ భాషా పరంగా సుసంపన్నం చేసింది. ఆడవాళ్ల సంభాషణలు, మగవాళ్ల సంభాషణలు, పడుచు పోరగాళ్ళ మాటలు, మంచినీళ్ళ బాయి కాడి అమ్మలక్కల ముచ్చట్లు, దావూద్ లాంటి ముస్లింల ఉర్దూ పలుకుబడితో కూడిన తెలుగు మాటలు ఇట్ల, ఒక సజీవ స్థానిక భాషా శైలులకు చిత్రిక పట్టింది రచయిత్రి!

'సుషుప్తి' నవల ఆధారంగా తెలంగాణ భాషకు సంబంధించిన చిన్న పదకోశం తయారు చెయ్యొచ్చు. పదులే కాదు వందలల్ల అనొచ్చు - పలుకుబళ్ళు, జాతీయాలు, జానపద నిరుక్తులు, కాకువు, అర్థ ఛాయలతో కూడిన తెలంగాణ గ్రామీణ భాషారూపాలు నవల అంతటా పొందుపరచబడ్డయి.

"అబే సాలె, లమ్డీ, లంజ, నెత్తి తుప్పలు పట్టి తంత" వంటి తెలంగాణ తిట్లను నిరభ్యంతరంగా రాయ గలిగింది అంటే, సామాన్య ప్రజలు మధ్య ఒక సామాన్యురాలిగా జీవితం గడిపి నప్పుడే సాధ్యమయితది.

వందలల్లో ఉన్న ఈ రచయిత్రి రచనల్ల గొప్ప జీవద్భాష, జీవితానుభవాలు ద్యోతకమయితయి !!

ఈ నవలా వస్తువు లోని ప్రధాన అంశం "ఆకలి". దాని భయంకర స్వరూపం!!

గ్రామీణ వృత్తుల అసంఘటిత శ్రామిక జీవనంలో, స్వాతంత్ర్యానంతరం భారతీయ ఆర్థిక వ్యవస్థలో బడుగు బలహీన సామాజిక వర్గాలకు జరిగిందే మిటో చూపిన నవల "సుషుప్తి".

ఇన్ని ప్రత్యేకతలు ఉన్న ఈ నవలను, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన, 'ప్రపంచ తెలుగు మహా సభలు' సందర్భంగా, "తెలంగాణ ప్రచురణలు, హైదరాబాద్" వాళ్లు 2017లో రెండవ ముద్రణను తీసుకొచ్చి, మరుగుపడ్డ తెలంగాణ మాణిక్యాలలో ఒకరయిన రచయిత్రి "మాదిరెడ్డి సులోచన" ను తిరిగి వర్తమానంలో తెలుగు పాఠకుల మధ్యన నిలుపటంతో పాటు, "బహుజన వృత్తి నవల - సుషుప్తి"ని వెలుగులోనికి తెచ్చింద్రు. విశ్వవిద్యాలయ స్థాయిలో పరిశోధనకు పాత్రమైన నవల 'సుషుప్తి'!!

వ్యాసం

# చరిత్రలో ఓ కొత్త విషాద కోణం

*"Human history becomes more and more a race between education and catastrophe".*
*- H.G. Wells ('The outline of History', Chapter-40).*



ఆడెపు లక్ష్మీపతి

మనిషిగా తన కర్తవ్యమేమిటన్న నైతిక మీమాంస, ఏ నిర్ణయం తీసుకోవాలన్న అస్తిత్వ సంకటస్థితి వ్యక్తికి ఎప్పుడు ఎదురవుతాయంటే... చుట్టూరా అస్తవ్యస్తత నెలకొని, సొంత జీవితం సంక్షుభితమైనప్పుడు. అస్తవ్యస్తతకు, సంక్షోభానికి మూలకారణం... తీవ్ర యుద్ధ పరిస్థితులు కావచ్చు. తుఫాను, వరదలు, పెను భూకంపం వంటి ప్రకృతి వైపరీత్యాలు కావచ్చు. కార్చిచ్చులా వ్యాపించి లక్షల సంఖ్యలో ప్రజల ప్రాణాల్ని హరించి వేసే అంటువ్యాధి లేదా మహమ్మారి కావచ్చు. మనలో కొందరు పుట్టి, ఒక రకంగా సంఖ్యా విషయిక, భౌతిక సంపత్తి సంబంధిత సాఫల్యాలతో జీవితాన్ని కొలుచుకుని, ముదిమిలోకి జారి, మృత్యువు ఒడిలోకి చేరిపోతారు. వీరు ఒక అర్థవంతమైన జీవనానికి ఆదర్శవంతమైన మార్గ దర్శకాలు పెట్టుకోరు. వీరి దృష్టిలో అస్తిత్వం అంటే పుట్టిన రోజులు, పెళ్లి రోజులు, జబ్బులు, దుర్ఘటనల సంయోజితమైన క్రియాశూన్య ఉనికి మాత్రమే. మరో కోవకు చెందిన వారున్నారు... వీరు నిర్ణయ స్వేచ్ఛను ఉపయోగించుకుని జీవితానుభవాల్లో క్రియాశీలంగా నిమగ్నమవడమే అస్తిత్వానికి పరమార్థం అని భావిస్తారు. ఈ రెండు కోవలకు చెందిన మనుషుల్నీ, వారి మనస్తత్వాలని, వారి జీవన వైఫల్య సాఫల్యాలని సుమారు డజనున్నర పెద్ద, చిన్న పాత్రల రూపంలో 'The Plague' నవల (1947)లో ఆల్బర్ట్ కాము అద్భుతంగా చిత్రించాడు.

వర్తమానంలోకి వస్తే, 2020 ప్రారంభం నుండి కోవిడ్-19 మహమ్మారి విజృంభిస్తూ వస్తోన్న గత 8-10 నెలల కాలంలో ప్రపంచవ్యాప్తంగా నెలకొనివున్న కల్లోల భరిత ఆర్థిక, సామాజిక పరిస్థితులు, ప్రత్యేకించి మనదేశంలోని సంక్షుభిత జీవన స్థితిగతులు, అనేక రంగాల్లోని అనూహ్య పరిణామాలు, ప్రజల భయభ్రాంతులు, వారి నిస్సహాయత, ప్రజారోగ్య అత్యయిక స్థితి, ఐసోలేషన్లు, క్వారంటైన్లు, సామూహిక ఖననాలు, దహనాలు... వగైరా బీభత్స దృశ్యాలు 'The Plague'లో చిత్రించిన వాటికన్నా అనేక రెట్లు తీవ్రమైనవి, విస్తృతమైనవని పరిస్థితులు ప్రత్యక్షంగా చూస్తున్న, అనుభవిస్తున్న మనకు తెలుసు. యావత్ ప్రపంచమే ఇప్పుడు గడగడలాడి పోతున్నది. అయితే ఆ నవల గుర్తుకువచ్చినప్పుడల్లా ఒక విషయం మనకు స్పష్టమవుతుంది. ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనైనా అనుకోని ఉపద్రవాలెదురైనపుడు మనుషుల స్పందనలు, వాటి క్రమానుగత దశలు దాదాపు ఒకేలా వుంటాయి. ఒక చారిత్రిక సంధి దశలో సంభవించిన ఘటనలను, సన్నివేశాలను, వాటిపట్ల మనుషుల స్పందనలను, భావోద్వేగాలను కల్పిత పాత్ర(ల)పరంగా ప్రదర్శించి నాటి పరిస్థితులను కళ్ళకు కడతాడు సాహితీకారుడు. ప్రాచీన పత్రాలు, అలేఖనాలు శోధించి, పలు ఆకరాల ద్వారా, వ్యక్తుల ద్వారా విషయ సేకరణ చేసి గతకాలాల ఘటనల్ని ఒక క్రమ పద్ధతిలో కూర్చి సమకాలికులకు అందిస్తాడు చరిత్రకారుడు. వర్తమానంలోని విశేషాలను, కీలక ఘట్టాలను లేదా వైపరీత్యాలను, అవి అశేష ప్రజానీకపు జీవితాల్ని ప్రభావితం చేసే తీరును ఉదంతాలుగా, ధారావాహిక దృశ్యమాలికలా నమోదు చేసి, ఒకవైపు సమకాలికుల దృష్టికి తెస్తూనే మరోవైపు భావితరాలకు అందిస్తాడు పాత్రికేయుడు. ఇక్కడ పాత్రికేయుడు పరోక్షంగా చరిత్రకారుడు కూడా. ఈ పుస్తకం **'కరోనా ఎట్ లాక్‌డౌన్ 360"** ప్రచురించడం ద్వారా కవీ, ప్రధానంగా పాత్రికేయుడూ అయిన కోడం పవన్‌కుమార్ పై ద్వంద్వ బాధ్యతల్నీ నిర్వర్తించాడనే చెప్పాలి.

ప్రపంచ మానవాళిని కనీ వినీ ఎరగని రీతిలో భయభ్రాంతుల్ని చేస్తూ, శాస్త్ర సాంకేతిక, వైద్య విజ్ఞాన రంగాల్లో ఎంతో పురోగతి సాధించానని జబ్బలు చరుచుకునే ఆధునిక మానవుడికి పెను సవాలుగా మారి, ఆధునిక చరిత్రలో

వ్యాసం

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత అత్యధిక స్థాయిలో ప్రాణ నష్టం, ఆర్థిక నష్టం కలిగిస్తూ అప్రతిహతంగా విలయతాండవం సాగిస్తున్న 'కరోనా వైరస్ డిసీజ్-2019' మిగులుస్తున్న దారుణ ఫలితాలను - సామాజిక సంబంధాల్లో, కుటుంబ బంధాల్లో, వ్యక్తి ప్రవర్తనలో, వ్యవస్థల వ్యాపారాల్లో, ప్రభుత్వాల పనితీరులో మొత్తంగా మానవ సమాజంలో చోటు చేసుకుంటూన్న అమానవీయ మార్పులను - సినిమా రీలులా మన కళ్ళ ముందర కదిలిస్తూ, ప్రస్తుతం మనం ఎంతటి దయనీయమైన సంకట స్థితిలో, అనివార్యమైన స్వార్థపూరిత బంధనాల్లో చిక్కుబడిపోయామో వివరిస్తున్నాడు పవన్‌కుమార్. ఈ ఫలితాల్లో కొండొకచో సానుకూల అంశాలూ గోచరిస్తాయి. అందరూ ఇంటిపట్టునే ఉండాల్సి వచ్చిన కారణంగా భార్యాభర్తలు, కుటుంబ సభ్యుల నడుమ అనుబంధాలు, అన్యోన్యత పెరిగాయి; ప్రజల్లో ఆరోగ్యకర జీవనశైలిపై, పుస్తక పఠనంపై శ్రద్ధ హెచ్చింది; వాతావరణ, నీటి కాలుష్యాలు గణనీయంగా తగ్గినై; డిజిటల్, ఆన్‌లైన్ లావాదేవీల వేపు ఎక్కువ మంది మొగ్గు చూపడంతో సాంకేతికత వాడకం పెరిగింది. అయితే ఇవన్నీ ఎంతకాలం నిలుస్తాయో తెలియదు. ఏదేమైనా, అనేక బతుకులను వివిధ రకాల వెతలకు గురిచేసి, దాదాపు అన్ని వర్గాల ప్రజల్లో జీవన భారాన్ని, భయాందోళనలను పెంచిన ఈ మహమ్మారి వర్తమాన చరిత్రను కోవిడ్-19కు ముందు, ఆ తర్వాత అని విభజించాల్సిన అవసరాన్ని కల్పించిందని మనకు అర్థమవుతుంది.

ఏమిటి ఈ కోవిడ్-19? 2019 డిసెంబర్ చివరలో హుబెయ్(చైనా) ప్రావిన్స్‌లోని వూహాన్ పచ్చి/సముద్ర సంబంధ ఆహార మార్కెట్‌లో 'నావెల్ కొరోనా వైరస్' (సివియర్ అక్యూట్ రెస్పిరేటరీ సిండ్రోం కలిగించే - 'SARS-CoV-2') ఉనికిని కనిపెట్టారు. గతంలోని SARS-CoV, MERS-CoVల కుటుంబానికి చెందిన వైరసే ఇది. కాకపోతే అతి వేగంగా ఉత్పరివర్తనాలకు లోనుకాగల గుణం వున్న వైరస్ ఇది. SARS-CoV-2 వైరస్‌లు మనిషి శ్వాస నాళాల్లోకి ప్రవేశించాక ఆంజియో టెన్సిన్ కన్వర్టింగ్ ఎంజైం -2 (ACE2)ని, ఆ తర్వాత ఆల్వోలర్ టైప్-2 కణాలను, ఇంకా ఊపిరితిత్తుల్లోని ఇతర తెలియని టార్గెట్ కణాలను ఇన్ఫెక్షన్‌కు గురిచేస్తాయి. వైరస్‌తో ఇన్ఫెక్ట్ అయిన కణాలు ఆతిథేయి ఉత్పత్తి చేసే ఇంటర్ ఫెరాన్ (IFN 1)ను తప్పించుకుంటాయి. ఫలితంగా ఊపిరితిత్తుల్లో వైరస్ కణాలు తమ సంఖ్యని ఇబ్బడి ముబ్బడిగా పెంచుకోవడానికి ఆస్కారం ఏర్పడుతుంది. మరికొన్ని గొలుసు చర్యల తర్వాత ప్రో - ఇన్ఫ్లమేటరీ సైటోకిన్స్ హెచ్చు మోతాదుల్లో విడుదలవుతాయి. ఈ 'సైటో కిన్స్ ప్రభంజనం' ఊపిరితిత్తుల వాపుకు, పుండుకు దారితీస్తుంది. ఊపిరి అందక, ఆక్సిజన్ స్థాయి పడిపోయే ఈ దశ రోగికి ప్రాణాంతకమవుతుంది. ఈ వ్యాధి ప్రమాద తీవ్రతను గుర్తించిన WHO జనవరి, 2020లో దీనికి COVID-19 అని నామకరణం చేసి 'పాండెమిక్ (మహమ్మారి)'గా ప్రకటించింది. మొదట్లో (పచ్చి/సముద్ర సంబంధ ఆహార) జంతువుల నుండి మనుషులకు జబ్బు అంటుకోవడమే ఈ వ్యాధి వ్యాప్తి చెందే ప్రధాన విధానం అని అందరూ భావించారు. కానీ అనంతర కాలంలోని కేసులు జంతువులతో ప్రత్యక్ష సంబంధం లేనివయినందున జబ్బు మనిషి నుంచి మనిషికి సంక్రమించే ఆస్కారముందని తెలియవచ్చింది. వ్యాధి లక్షణాలున్నవారి నుంచే కోవిడ్-19 వ్యాప్తి చెందే అవకాశాలు హెచ్చు అయినప్పటికీ లక్షణాలు లేని వారి నుంచి కూడా అది వ్యాపించే ఆస్కారం తోసివేయలేము. ఇప్పటివరకు ఈ వ్యాధి చికిత్సకు కచ్చితమైన మందు లేదు. వివిధ కంపెనీల వాక్సినులు ప్రయోగదశ (క్లినికల్ ట్రయల్స్)లో వున్నాయి.

నేనిది రాస్తున్న నాటికి ప్రపంచ వ్యాప్తంగా 4 కోట్ల 10 లక్షల మంది ఈ వ్యాధి బారినపడగా వారిలో 11 లక్షల మంది మరణించారు. వ్యాధి 220 దేశాలను తాకింది. అగ్ర రాజ్యమైన అమెరికా, లాటిన్ అమెరికా దేశమైన బ్రెజిల్ ఈ వ్యాధి కోరల్లో చిక్కి విలవిలలాడుతున్నాయి. అమెరికాలో సగటున రోజుకు 60 వేల కేసులు నమోదవుతున్నాయి. మరణాల రేటూ ఎక్కువగానే వుంది. భారతదేశంలో 75.5 లక్షల కేసులు నమోదు కాగా ఒక లక్షా పదిహేనుగు వేల మంది మరణించారు. తెలంగాణ రాష్ట్రంలో 2 లక్షల 23 వేల కోవిడ్-19 కేసులు రికార్డయితే, వారిలో 1,275 మంది మృత్యువాత పడ్డారు. కారణాలేమిటో తెలియదుగాని, వ్యాధి వ్యాప్తి ఉధృతి ఇటీవల కొద్దిగా తగ్గినట్లుగా కనపడుతోంది (వైరస్ 'విరిలిటి' తగ్గిందని డాక్టర్లు అంటున్నారు). కానీ కొన్ని దేశాల్లో 'సెకండ్ వేవ్' ప్రారంభమైనట్లు వార్తలు వస్తున్నాయి. మన దగ్గర ప్రజలు మునుపటిలా భయపడటం లేదు. ఊరికనే కూర్చుంటే బతుకు బండి సాగదన్న భావన, 80-85 శాతంగా ఉన్న రికవరీ రేటు ఇస్తున్న భరోసా, త్వరలోనే వాక్సీన్ వస్తుందన్న నమ్మకం, ఏదయితే అది కానీ లెమ్మనే మొండి ధైర్యం... బహుశ ఇందుకు కారణాలు కావచ్చు. దీని పర్యవసానాలు ఎలా ఉంటాయో తెలియదు.

గమనించాల్సిన వాస్తవమేమిటంటే, మానవుడు వేటాడి ఆహారం సేకరించే దశ నుండి వ్యవసాయ దశకు వచ్చేసరికి, అంటే గత 10,000 సంవత్సరాల నుంచే, అంటువ్యాధుల బారిన పడటం ఆరంభమైంది. ప్రాచీన మానవులు విడి సమూహాలుగా దూరదూరంగా వుండేవారు. కాలక్రమేణా వ్యవసాయం అభివృద్ధి చెంది, మిగులు ఉత్పత్తులు పెరిగి, సమూహాల నడుమ వస్తు మార్పిడి, వ్యాపార సంబంధాలు ఏర్పడ్డాక స్థానిక వ్యాధులు అంటువ్యాధులు (మలేరియా, మశూచి, క్షయ, కుష్టు, ఇన్ ఫ్లూయెన్జా)గానూ; నాగరికత పెరిగినా కొద్ది దేశాల మధ్య సముద్ర, వాయు రవాణా మార్గాలు నెలకొనడం, వనరులకై పోటీలో యుద్ధాలు జరగడం మూలంగా అంటువ్యాధులు

వ్యాసం

మహామ్మారులు (కలరా, ఎయిడ్స్, వైరల్ జబ్బులు)గానూ మారాయి. మన జబ్బులకు సూక్ష్మజీవులు, వైరస్‌లు, పరాన్న జీవులు బాహిర్ కారణాలైతే, ప్రత్యేక సందర్భాల్లో పలు శరీరావయవాల పనితీరు మందగించడం అంతర్గత కారణం. సృష్టిలోని ప్రాణికోటిలో ప్రతిజీవికీ దానిదంటూ ఒక ప్రత్యుత్పత్తి విధానం, జీవిత చక్రం వుంటాయి. ఒక ప్రాణి తన మనుగడ కోసం మరో ప్రాణి (ఆతిథేయి-హోస్ట్)లో తిష్ట వేసినప్పుడు ఆ రెండింటి మధ్య సయోధ్య ఉన్నంత కాలం ఏ పేచీ లేదు. ఉదా. మానవ శరీరంలోని గట్ బాక్టీరియా. కానీ విబ్రియో కలరే, మైక్రో బాక్టీరియం టుబర్క్యులోసిస్… వంటివి ప్రమాదకర సూక్ష్మజీవులు. ఇవి కలరా, క్షయ కారకాలు. మనిషిలోని సహజ ఇమ్యూనిటీ వ్యాధికారక సూక్ష్మ జీవుల దాడిని తిప్పికొడుతుంది. ఒక్కొక్కసారి మన ఇమ్యూనిటీ తికమక పడిపోవడం లేదా చిత్తయిపోవడం వల్ల వ్యాధి కారక సూక్ష్మజీవులది పై చేయి అవుతుంది. పరిణామ వాదం, ప్రకృతి వరణం ప్రకారం పరిసరాలకు తగిన శక్తి యుక్తుల్ని సముపార్జించుకున్న ప్రాణి మాత్రమే మనుగడ సాగించగలదు. అలా పరిణామం చెందిన రోగ కారక సూక్ష్మజీవులు ఒక దశలో మందులకు లొంగవు, వాటికి వ్యాక్సీన్లు పని చేయవు. వైరస్ అనేది ఎలెక్ట్రాన్ మైక్రోస్కోప్(ఇది వస్తువుని రెండు లక్షల రెట్లు పెద్దది చేసి చూపిస్తుంది)లో మాత్రమే కనపడే చిత్రమైన కణం. ఇది ఒకసారి జీవిగా, మరోసారి నిర్జీవిగా కూడా ఉండగలదు. కోవిడ్-19 కారక నావెల్ (కొత్తగా ఆవిర్భవించిన) కరోనా వైరస్ గతంలో వచ్చి పోయిన కరోనా వైరస్‌ల కన్నా భిన్నమైనది, ఆతిథేయిని బట్టి తన స్వరూప స్వభావాల్ని మార్చుకుంటున్నది. దీనిని నివారించగల వ్యాక్సీన్‌ని అభివృద్ధి చేయడం క్లిష్టమైన పనిగా వుంది. ఎట్టకేలకు శాస్త్రవేత్తల కఠోరకృషి విజయవంతమైంది. అయితే వ్యాక్సీన్ అందరికీ అందేలోగా కోవిడ్-19 ఇంకా ఎన్ని లక్షల మందిని బలి తీసుకుంటుందో చెప్పలేని పరిస్థితి. ఇది ఆరోగ్యవంతులను వ్యాధిగ్రస్తులను చేస్తున్నది. వయోధికులు, ఇతర జబ్బులున్న వారిపై తీవ్ర ప్రభావం చూపి ప్రాణాలు హరించి వేస్తున్నది. చేతులు తరచూ సబ్బుతో కడుక్కోవడం, మాస్కులు ధరించడం, భౌతిక దూరం పాటించడం… వంటి వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకుంటూ, ఇమ్యూనిటీ పెంచే ఆహారపుటలవాట్లు, జీవనశైలిని ఆచరించడం మనం ఇప్పుడు చేయగల్గిన పని. ఈ వ్యాధి వ్యాప్తి 'కర్వ్'ని వంచేందుకు, 'లింక్'ని తెగ్గొట్టేందుకు చాలా దేశాలు బహిరంగ సమావేశాలను నిషేధించాయి. లాక్‌డౌన్‌లు ప్రకటించాయి. త్వరగా, వేగంగా అంటుకునే ఈ జబ్బు నుంచి ప్రజల్ని కాపాడేందుకు కఠిన క్వారంటైన్, ఐసోలేషన్ నియమాలు విధించాయి. న్యూజిలాండ్, ఐస్‌లాండ్, దక్షిణ కొరియా దేశాలు వ్యాధి వ్యాప్తిని అరికట్టడంలో (ట్రేస్, ట్రాక్, ట్రీట్ పద్ధతి ద్వారా) విజయవంతమైనాయి. కానీ ఇతర చాలా దేశాలు హ్రస్వదృష్టితో, అల్ప సంతోషంతో నియమాలు సడలించిన ఫలితంగా అక్కడ వ్యాధి వ్యాప్తి తగ్గినట్టే తగ్గి మళ్ళా పెరుగుతూ పోయింది. మన దేశంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రకటించిన కోవిడ్ నిబంధనల/ఆంక్షల విధింపు, సడలింపులలో, దశల వారీ లాక్‌డౌన్, అన్‌లాక్‌లు ప్రకటించిన సమయ సందర్భాల్లో, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, చికిత్సలు ప్రజలకు అందుబాటులోకి తేవడంలో… వాస్తవిక దృష్టి, క్షేత్రస్థాయి పరిస్థితుల అవగాహన కొరవడ్డాయని, వ్యాధి నియంత్రణకు ముందుచూపుతో, శాస్త్రీయ దృక్పథంతో కూడిన వ్యూహ రచన సరిగా జరగలేదు. మన దైనందిన జీవితాలను అమితంగా ప్రభావితం చేస్తున్న కోవిడ్-19 వల్ల కష్టాలు, నష్టాలు కోకొల్లలు చూస్తున్నాం, అనుభవిస్తున్నాం. ఇది వర్తక వ్యాపారాలను, ప్రపంచ వాణిజ్యాన్ని, ప్రజల కదలికలను దాదాపు పూర్తిగా స్తంభింపజేసింది. చాలా దేశాల్లో పరిశ్రమలు తమ ఉత్పత్తులను భారీగా తగ్గించి వేశాయి. చాలా రకాల పరిశ్రమలు, ఉత్పాదక రంగాలు - ఫార్మాస్యూటికల్, సోలార్ పవర్, టూరిజం, ఇన్ఫర్మేషన్ అండ్ ఎలక్ట్రానిక్ పరిశ్రమ; సేవ, వినోద రంగాలు; హొటళ్ళు, రెస్టారెంట్లు, బార్లు, పబ్బులు, స్విమ్మింగ్ పూల్స్, సినిమా హాళ్ళు, జిమ్‌లు, ఫంక్షన్ హాళ్ళు, అమ్యూసింగ్ పార్కులు, రోడ్డు, రైలు, విమాన ప్యాసింజర్ రవాణా సంస్థలు ఇత్యాదిగా కోవిడ్-19 దెబ్బకు కుదేలైనాయి. చాలా మంది ఉపాధి, ఉద్యోగాలు కోల్పోయారు.

దారుణ మారణహోమం సాగిస్తూ ప్రపంచానికి కంటి మీద కునుకు లేకుండా చేస్తున్న ఈ కొత్త రకం మహమ్మారి ఎలా ఆవిర్భవించింది? ఇందుకు మానవ తప్పిదాలు ఏ మేరకు కారణం? ఏ వెల్లులకు మన నాగరికత ప్రస్థానం? అందరి మదిలో మెదులుతున్న ఈ ప్రశ్నలు ప్రపంచ నాయకులను, మేధావులను, శాస్త్రవేత్తలను అంతరావలోకనం లోకి నెట్టాయి. భవిష్యత్తులో రాబోయే ఇలాంటి మహమ్మరులను ఎలా ఎదుర్కోవాలి/నిరోధించాలి అనే ఆలోచనలో పడ్డారు అందరూ. గబ్బిలాల నివాస స్థావరాలు, వాటి ఆహారపు టలవాట్లు, సంచార శైలి… వీటిలోని మార్పులను బట్టి చూస్తే, చుట్టూ పర్యావరణంలో, మనిషి - ఇతర ప్రాణుల జీవావరణ సమతౌల్యంలో ఏదో తేడా వస్తోందనీ, మనుషులకు సోకుతున్న కొత్త కొత్త రోగాలకు ఇదే కారణమనీ తెలియ వస్తున్నది. వనరులు, మానవ వినియోగ భూభాగాల (పట్టణ, వ్యావసాయిక భూములు, నివాసాలు)లోని మార్పులు వైరస్ ఒక జాతి ప్రాణి నుంచి మరో జాతి ప్రాణికి సులువుగా వ్యాపించే దుష్పరిణామానికి దారి తీస్తున్నాయి కాబట్టి దీనికి సంబంధించిన మొత్తం ప్రక్రియను సమీక్షించాల్సిన అవసర ముందని అందరూ గుర్తిస్తున్నారు. తరిగిపోతున్న అడవులు, వన్యప్రాణులతో పెరిగిపోతున్న మనిషి సాన్నిహిత్యం, అతని తిండి అలవాట్లు, పెరుగుతున్న జనసాంద్రత, వాతావరణ మార్పులు,

వ్యాసం

ప్రపంచీకరణ ఇవన్నీ ఏదో ఒక మేరకు రోగాల సంక్రమణకు దోహదపడు తున్నాయనేది వాస్తవం. కోవిడ్-19 నియంత్రణ కోసం ప్రపంచ దేశాలు, ప్రముఖ ఫార్మా కంపెనీలు వాక్సిన్ కనిపెట్టే పనిలో తలమునకలై వున్న ప్రస్తుత సందర్భంలో అమెరికన్ సైన్స్ జర్నలిస్ట్ లౌరీ గ్యారెట్ ఒక ముఖ్య విషయాన్ని నొక్కి చెప్పింది. "సమ దృష్టి లేకుండా మనం మహమ్మారిపై సాగించే పోరు విఫలమవుతుంది. వైరస్‌లు సులువుగా పునర్ వ్యాపిస్తాయి. భూగ్రహం మీద రక్షణ లేని అభాగ్య జీవుల ద్వారా అవి ఒకరి నుంచి మరొకరికి సోకుతూ, బహుళ ఉత్పరివర్తనాలు లేదా మార్పులు చెంది వాక్సీనులను నిష్ప్రయోజనం చేస్తాయి". విలువైన ఈ మాట అందరూ వింటారని ఆశిద్దాం.

కోవిడ్-19 విషయంలో ప్రజల్లో అనేక భయాలు, అపోహలు వున్నాయి. క్వారంటైన్, ఐసోలేషన్, సానిటేషన్, భౌతిక దూరం, మాస్కులు... తదితర నిబంధనలు ప్రజల్ని గాభరా పెట్టేశాయి. కోవిడ్ నిబంధనల పేరుతో మృత దేహాలను దూరం నుంచే బంధువులకు చూపెట్టి సామూహిక ఖననం లేదా దహనం చేసిన పరిస్థితులు; తల్లో, తండ్రో, ఇతర ఆప్తులో కోవిడ్ అనుమానంతో మరణిస్తే కుటుంబ సభ్యులు శవాన్ని ఇంటికి తీసుకెళ్ల నిరాకరించి, ఆసుపత్రి/ మున్సిపల్ సిబ్బందికే డబ్బులిచ్చి అంత్య క్రియలు జరిపించిన ఘటనలు; కన్నతల్లో, తండ్రో కోవిడ్ నుంచి కోలుకుని తిరిగి వస్తే కొడుకులు, కోడళ్ళు వాళ్ళను ఇంటిలోకి రానివ్వకుండా బయటే ఉంచిన సన్నివేశాలు మనం చూశాం. దూర ప్రాంతం నుంచి తిరిగి వచ్చిన కుటుంబాలను కోవిడ్ భయంతో ఊరి బయటే వుంచడం, ఒక వూరి వాళ్ళు మరో ఊళ్ళోకి ప్రవేశించకుండా కంచెలు/ కందకాలు ఏర్పాటు చేసిన ఉదంతాలూ విన్నాం. కోవిడ్ సంక్షోభ కాలంలో వలస కార్మికుల బతుకులు మరీ దయనీయంగా మారాయి. భవన నిర్మాణ పనులు, ఇతర వ్యాపారాలు స్తంభించడంతో కూలీ పనులు దొరకక, పొట్ట గడవక వీరు నానా యాతనలు పడ్డారు. మొత్తంగా వాళ్ళ సంఖ్య ఎంత, ఏ రాష్ట్రం వాళ్ళు ఎక్కడెక్కడ వున్నారు - ఈ వివరాలు ఏ సర్కారు శాఖలోనూ లేవు. వాళ్ళను ఆదుకునే విషయంలో ఏ చట్టాల్లోనూ స్పష్టత లేదు. ఏదో గత్తర కమ్ముకు వస్తోంది, చస్తామో బతుకుతామో తెలియదు, చచ్చేలోగా అయినవాళ్ళని, కన్నవాళ్ళని చూడాలన్న తపనతో, వందలు, వేల మైళ్ళయినా నడిచిపోవడానికి సంసిద్ధులై మూటాముల్లె నెత్తిన పెట్టుకుని, పసివాళ్ళని చంకనేసుకుని ఎర్రటి ఎండలో రోడ్డున పడ్డ వేలాది కుటుంబాలను చూశాం. ఎలాగోలా గమ్యస్థానం చేరుకోవాలన్న ఆరాటంలో దొరికిన ప్రయాణ సాధనాలు ఎక్కేసి భద్రత లేని బతుకు పయనంలో రోడ్డు ప్రమాదాలకు గురై వివిధ రాష్ట్రాల్లో పలువురు మరణించారన్న వార్తలు విన్నాం. గ్రామాల గుండా వెళితే గ్రామస్థులు అడ్డుకుంటారన్న భయంతో కొన్ని అమాయక వలస కుటుంబాలు రైలు పట్టాల వెంట నడిచిపోతూ, అలిసిన చోట నిద్రిస్తూ, ఊహించని రీతిలో గూడ్స్ రైలు చక్రాల కింద ఖండ ఖండాలుగా ఛిద్రమైపోయాయన్న వార్తలు కూడా చూశాం. ఆంక్షలు, నిబంధనలు రాష్ట్రాల సరిహద్దులు దాటనివ్వనప్పుడు కడుపు మండిన కార్మికులు అక్కడక్కడా - మన రాష్ట్రంలో కంది, పటాన్‌చెరు ప్రాంతంలో, ముంబైలోని బాంద్రాలో - హింసాకాండకు తెగబడితేనే ప్రభుత్వాలు వారి కోసం ప్రత్యేక రైళ్ళు నడిపాయని మనకు తెలుసు. దేశ సర్వోన్నత న్యాయస్థానం 'వాళ్ళను రాష్ట్రాలు విడిచి ఎవరు వెళ్లి పొమ్మన్నారు?' అని కోపించే బదులు వారి గోడును మానవీయ కోణంలో అర్థం చేసుకుని ఎక్కడి వాళ్ళు అక్కడే ఉండేలా రాష్ట్ర ప్రభుత్వాలు వారి కోసం నివాస, భోజన, వైద్య వసతులు కచ్చితంగా ఏర్పాటు చేయాలని గట్టి ఆదేశాలు ముందే ఇచ్చి వుంటే బాగుండేది. ఆలస్యంగానైనా వాస్తవ పరిస్థితి గ్రహించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మేలుకుని దేశవ్యాప్తంగా 21,000 పునరావాస కేంద్రాలు, జిహెచ్ఎంసి పరిధిలో 80 షెల్టర్ హోమ్స్ ఏర్పాటు చేయడం జరిగింది.

ఇవన్నీ తలచుకున్నప్పుడు, భారత్ సర్వ సమగ్ర రాజ్యాంగం, సవ్యవస్థిత పాలనా, అధికార యంత్రాంగాలు, సుస్థిర ప్రభుత్వం వున్న పెద్ద ప్రజాస్వామ్య దేశమే అయినా మన వ్యవస్థలో ఏదో లోపం ఉందన్న వాస్తవం స్ఫురించి మన కడుపులో దేవినట్టవుతుంది. ఇదలా ఉంచితే, గొప్ప ఊరట కలిగించే విషయమేమిటంటే - మన ప్రజలు సంక్షుభిత కాలంలోనూ, ఉపద్రవం వెన్నాడుతున్న ఇంతటి భీతావహ సందర్భంలోనూ మనిషితనం మరిచిపోలేదు. దోవన పోతున్న వలస కార్మిక కుటుంబాలకు ఊళ్ళల్లో ప్రజలు అన్నపానీయాలు అందించారు, సేద దీర్చుకునేందుకు ఆశ్రయం కల్పించారు. పలు గ్రూపులు, స్వచ్ఛంద సంస్థల వాళ్ళు భోజనం పెట్టి, ఇతర అవసరాలు సమకూర్చి మానవత్వం చాటుకున్నారు. కొందరు రైతులు, పేద మహిళా కార్మికులు సైతం 'కోవిడ్ నిధి'కి ఉడతా భక్తిగా విరాళాలిచ్చి దాతృత్వం ప్రదర్శించారు.

పాత్రికేయుడు కోడం పవన్‌కుమార్ వినూత్నంగా ఆలోచించి ఒక నాన్-ఫిక్షనల్ ప్రక్రియ ఎంచుకున్నాడు; యావత్ ప్రపంచాన్ని కుదిపి వేస్తున్న కోవిడ్-19 విలయ హేలను, భారతదేశం, తెలంగాణపై ప్రత్యేక ఫోకస్‌తో, దాని ప్రభావపు సమస్త పార్శ్వాలను మనకు అందిస్తున్నాడు. ఇతనికి హై డెఫినిషన్ కెమెరా లెన్స్ లాంటి నిశిత దృష్టి ఉంది. **'కరోనా ఎట్ లాక్‌డౌన్ 360°'** పుస్తకంలో ఒక రకంగా వ్యాసాల రూపంలో వివిధ టాపిక్‌లున్నాయి; ప్రతి టాపిక్, విషయాన్ని పలు కోణాల్లోంచి ఆవిష్కరించి అనేక వివరాలు గుదిగుచ్చిన ఉదంతం/వార్తా కథనంగా దర్శనమిచ్చి మనలను అబ్బురపరుస్తుంది. ఉదాహరణకు, 'విమర్శల వెల్లువలో నిలదొక్కుకున్న డబ్ల్యూహెచ్‌వో'. ఇందులో, ప్రపంచ ప్రజల ఆరోగ్య రక్షణలో డబ్ల్యూహెచ్‌వో పాత్ర,

**పాత్రికేయుడు కోడం పవన్‌కుమార్ వినూత్నంగా ఆలోచించి ఒక నాన్-ఫిక్షనల్ ప్రక్రియ ఎంచుకున్నాడు; యావత్ ప్రపంచాన్ని కుదిపి వేస్తున్న కోవిడ్-19 విలయ హేలను, భారతదేశం, తెలంగాణపై ప్రత్యేక ఫోకస్‌తో, దాని ప్రభావపు సమస్త పార్శ్వాలను మనకు అందిస్తున్నాడు.**

బాధ్యతలు, కార్యకలాపాలు, జెనీవాలో దాని ప్రధాన కార్యాలయం రూపు రేఖలు, ఐరాస సహకారం, కొన్ని ప్రాణాంతక వ్యాధులను నిర్మూలించడంలో ఆ సంస్థ సాధించిన సాఫల్యాలు, కరోనా వైరస్ గురించి వాస్తవాలు దాచిన చైనాని వెనకేసుకొచ్చిందంటూ దానిపై ఆరోపణలు, ట్రంప్ ఆగ్రహించి ఆ సంస్థకి నిధులు నిలిపి వేయడం... తదితర వివరాలిచ్చి 'ప్రపంచ దేశాలను చుట్టు ముట్టే మహమ్మారి వ్యాధులను తుద ముట్టించడానికి ఈ సంస్థ అవసరం ఎంతైనా వుంది. దీన్ని కాపాడుకుంటూ మరింత పటిష్టవంతంగా తయారు చేయడానికి సభ్య దేశాలు ముందుకు రావాలి', అని ముక్తాయించడం బాగుంది. మరో ఉదాహరణః 'కుదేలైన దేశదేశాల ఆర్థిక వ్యవస్థ'. ఇందులో అమెరికా, జర్మనీ, జపాన్... లాంటి సంపన్న దేశాల ఆర్థిక వృద్ధి రేటులోని క్షీణతని తెలియజేసే పలు గణాంక వివరాలు వున్నాయి. భారత ఆర్థిక వ్యవస్థపై కరోనా ప్రభావం, ప్రభుత్వ ఉద్దీపన ప్యాకేజీలను వివరిస్తూ, '... ప్రభుత్వం ప్రకటించిన దేశవ్యాప్త లాక్‌డౌన్ మూలంగా 120 బిలియన్ డాలర్ల (సుమారు రూ.9 లక్షల కోట్లు) మేర ఆర్థిక వ్యవస్థపై భారం పడే అవకాశం వుందని ఆర్థిక నిపుణులు అంచనా వేశారు. దేశ ఆర్థిక వ్యవస్థ మందగమనంలో వున్న సమయంలో కరోనా విజృంభణ పిడుగుపాటులా పరిణమించింది... నెమ్మదించిన ఆర్థిక వ్యవస్థకు ఆర్బీఐ ఊపిరిలూదుతూ రూ.5.24 లక్షల కోట్ల మేర వెసులు బాట్లు రెండవ విడత చర్యలో భాగంగా ప్రకటించింది. వ్యవస్థలో తగినంత ద్రవ్య లభ్యత ఉండేలా చూడటంతో పాటు బ్యాంకుల రుణాల మంజూరు పెరిగేందుకు అవసరమైన చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగానే రివర్స్ రేపో రేటుని పావు శాతం తగ్గించింది. కరోనా సంక్షోభాన్ని దీర్ఘకాలంలో ఓ అవకాశంగా మార్చుకోవాలని ఆశిస్తున్న భారత ప్రభుత్వం ఆర్థిక స్వావలంబన సాధనకు ఇదో మార్గంగా ఎంచుకుంది. మూడవ విడత 'ఆత్మ నిర్భర్ భారత్ (స్వయం సమృద్ధ భారత్)' పేరుతో ఆర్థిక రంగం, మౌలిక వసతులు, మొత్తంగా వ్యవస్థ, క్రియా శీలమైన జనాభా, డిమాండ్ పెంపుదల... అనే అయిదు స్తంభాలపై రూ.5.94 లక్షల కోట్లతో ఈ పథకానికి రూపకల్పన చేసింది. దీనితో మొత్తం ప్యాకేజీ విలువ రూ.12.88 లక్షల కోట్లకు చేరింది. రూ.20 లక్షల కోట్ల ఆర్థిక ప్యాకేజిలో మిగిలిన రూ.7.11 లక్షల కోట్లను విడతల వారీగా కేంద్ర ఆర్థిక మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఆయా రంగాలకు కేటాయించారు. మొత్తం ప్యాకేజి స్థూల జాతీయ ఉత్పత్తి (జీడీపీ)లో 10 శాతంగా ఉంటుందని' వివరించారు. అదే పేరాగ్రాఫులో ప్రజా సంక్షేమం పట్ల ప్రభుత్వ సంకల్పాన్ని మన కళ్ల ముందుంచుతాడు రచయిత.

చాలా ఆకరాలు శోధించి అనేక వివరాలు, గణాంకాలు సేకరించి ప్రతి journalistic piece ని సమగ్రంగా తీర్చి దిద్దాడు పవన్‌కుమార్. 'దక్షిణ ఆఫ్రికా, బ్రెజిల్, సూడాన్, అఫ్ఘనిస్తాన్, సిరియా... లాంటి దేశాలతో కలుపుకుని మొత్తం ప్రపంచ క్షుద్బాధితుల సంఖ్య 2019లో 13.5 కోట్లు కాగా, ఆ సంఖ్య 2020లో 26.5 కోట్లకి పెరిగింది'... 'హైదరాబాదులో మొత్తం 20 లక్షల మంది వలస కార్మికులు, బిచ్చగాళ్ళు, అనాథలు ఉన్నారు'... 'తెలంగాణలో 56,000 పరిశ్రమలు మూతపడ్డాయి. 16 లక్షల మందిని ఉద్యోగాల్లోంచి తొలగించారు'. 'కుల/చేతి వృత్తుల వారు దేశవ్యాప్తంగా 34 కోట్ల మంది ఉపాధి కోల్పోయారు'... రచయిత సమగ్ర అవగాహనకు అద్దం పట్టే ఇలాంటి అంకెలు, వివరాలు ఈ పుస్తకంలో కోకొల్లలుగా కనపడతాయి. ఇందులోని వ్యాసాలన్నీ కరోనా ఉధృతిని ఏప్రిల్-జులై నెలల వరకు మాత్రమే దృష్టిలో పెట్టుకుని రాసినట్లుగా వుంది.

కోవిడ్-19 బతుకుల్ని అతలాకుతలం చేసింది. ఎన్నో విషాద ఘటనలు, హృదయ విదారక దృశ్యాలు వింటు న్నాము, కంటున్నాము. ఈ పుస్తకం చదువుతూంటే మనల్ని ఒకరకమైన 'dejavu' అవహిస్తుంది. కోవిడ్ ప్రభావం మన మీద పలు విధాలా పడింది. ఈ పుస్తకంలోని వ్యాసాల సమాహారంలో ఆ ప్రభావపు అన్ని ఛాయలు, వైవిధ్యం వున్నాయి. అన్ని రంగాలపై, సమస్త జీవన పార్శ్వాలపై కోవిడ్-19 ప్రభావాన్ని అనితరసాధ్యమైన లోచూపుతో, సామాజిక అధ్యయనకారునికి వుండే సమగ్ర దృష్టితో విశ్లేషించాడు పవన్‌కుమార్. దేశ విభజన నాటి కల్లోలం, ఘర్షణలను చిత్రించిన ఫిక్షన్, నాన్-ఫిక్షన్ (The Otherside of Silence, Train to Pakistan), హోలోకాస్ట్ దురంతాలను వర్ణించిన సాహిత్యం (If this is a Man), అక్టోబర్ విప్లవాన్ని అన్ని దశల్లో వివరించిన చారిత్రిక గ్రంథాలు (October- The Story of the Russian Revolution), రెండో ప్రపంచ యుద్ధ తుది దశను, హిట్లర్ పాలన చరమాంకాన్ని అక్షర బద్ధం చేసిన పుస్తకాలు (Ten Days that Shook the World) చాలా చదివాం. ఈ పుస్తకం ఇదే కోవలోకి వస్తుందనడంలో సందేహం లేదు. వర్తమానానికి, నడుస్తున్న చరిత్రకు కత్తుల వంతెన వేసిన కోవిడ్-19 ప్రభావ సమస్త పార్శ్వాలను వివరించే ఈ **'కరోనా ఎట్ లాక్‌డౌన్ 360°'** భవిష్యత్ తరాలకు మంచి రిఫరెన్స్ పుస్తకంగా నిలిచి పోతుంది. పాత్రికేయ మిత్రుడు కోడం పవన్‌కుమార్‌ని మనస్ఫూర్తిగా అభినందిస్తున్నాను.

కవిత

# అక్షరాల సభ



డా॥ మడత భాస్కర్

అక్షరాల సభ మొదలైంది....
అచ్చులన్నీ హల్లుల ముందర
అమాయకంగా
ఒదిగిపోయినాయి....
సున్న, విసర్గలు దూరంగా
మూలకు నక్కి
ముడుచుకున్నాయి....
కొన్ని అక్షరాలు
తప్పిపోయిన తమ మిత్రులను
తలచుకొని
కన్నీరుమున్నీరవుతున్నాయి....
మరి కొన్నేమో
మారిపోతున్న తమ ఆకారాన్ని
చూసుకొని, లో లోపల
కుమిలిపోతున్నాయి.....
'అంతస్థాలు' అంతర్ముఖమై
అంతరార్థాన్ని వెతికే పనిలో
ఉన్నాయి....
పరుషాల ముఖం పౌరుషంతో
జేగురించింది...
'సరళాలు' సందడిగా
సంభాషించుకుంటున్నాయి.......
'అనునాసికాలు' అధ్యక్షుని,
మాటలు అనుసరిస్తున్నాయి.....
'మహాప్రాణాలు' ప్రాణాలరచేత
పట్టుకొని నిల్చున్నాయి....
'ఊష్మాలు' ఉచ్ఛ్వాస, నిశ్వాసలను
కూడా మరిచిపోయాయి...
అప్పుడే వచ్చిన బండి 'ఱ'
వర్ణ భేదం లేని 'వర్ణమాలకు జై' -
అంది...




దీర్ఘాలన్నీ సుదీర్ఘంగా గొంతు
కలిపాయి
అక్షరాలన్నీ
విరామచిహ్నాల సహాయంతో
'భాషామతల్లి'ని స్మరించుకున్నాయి
ఉన్నట్టుండి
అక్షరాలకు ఆవేశం ఎక్కువైంది. ..
'ధిక్కారం' మరచిన పాటల్లో
స్వరాలుగా మారుతున్నందుకు
కొన్ని 'నిరసనగళం' విప్పాయి.....
'అధికారా'నికి గొడుగుపట్టే
కవిత్వమైనందుకు
కొన్ని "పశ్చాత్తాపం'
ప్రకటించాయి....
అసంబద్ధ ప్రసంగాలకు
అక్కరకొస్తున్నందుకు
కొన్ని అక్షరాలు సిగ్గుపడ్డాయి....
చివరగా
'ప్రశ్న'ను బ్రతికించుకోవడానికి
చావడానికైనా సిద్ధమేనని
అక్షరాలన్నీ
తీర్మానించుకున్నాయి.........

కథ

# ప్రేమ పరిమళం

విరిసిన ప్రేమపరిమళం రువ్విన
లక్ష్మీ కందిమళ్ళ కథ ...



లక్ష్మీ కందిమళ్ళ

ఎంత పెద్దదానివైపోయావు, ఎంత అందంగా వున్నావు అంటూ ఉక్కిరి బిక్కిరి చేస్తూ తన రెండు చేతుల మధ్య పొదువుకొని ఇక ఆ పెళ్ళి అయిపోయేదాక వదిలింటే ఒట్టు. నాకు సంతోషంతో పాటు ఎంత ఏడుపు వచ్చిందో. ఈ స్పర్శ ఈ ఆత్మీయ పరిమళం నన్ను వదిలి వెళ్ళి ఎన్ని రోజులు అయ్యింది? తిరిగి మళ్ళీ ఇన్ని రోజులకు ఆ స్పర్శ, ఆ అనుభూతి. అప్రయత్నంగానే ఆపుకున్నా ఆగని కన్నీళ్ళు మా ఇద్దరి కళ్లల్లో.

★ ★ ★

మాట ఎంత మెత్తనో మనసు అంతే సున్నితం మా అనూషక్కకు. అక్క నా చిన్నప్పుడు నన్ను ఎంత ప్రేమగా చూసుకునేదో అందుకే మా అనూషక్కంటే నాకు ఎంతిష్టమో. అనూషక్క మాకు దాయాది అయిన పెదనాన్న కూతురు. అక్కా వాళ్ళు నాకు ఊహ తెలిసే వరకు మా వూరిలో లేరు. వాళ్ళ అమ్మమ్మ ఇంట్లో వుండేవాళ్ళు.

పెద్దనాన్న గుండెపోటుతో చనిపోయాక పెద్దమ్మ పుట్టింటిలోనే వుండిపోయింది. అనూషక్కకు ఒక తమ్ముడు వున్నాడు పేరు వినయ్, నా కన్నా ఒక సంవత్సరం పెద్దవాడు. ఇద్దరం ఒకే తరగతి కాబట్టి నేను వినయ్ అనే పిలిచేదాన్ని. ఇద్దరూ ఇద్దరే అక్కా తమ్ముడు ఎంతో సున్నిత మనస్కులు. అందుకే మా వూరిలో అందరికన్నా నాకు వాళ్ళిద్దరంటేనే ఇష్టం. అనూషక్క వాళ్ళ పెద్దనాన్న వీళ్ళ పొలం పండించుకుంటూ సరైన గుత్త ఇచ్చేవాడు కాదు. అందుకే పెద్దమ్మ పిల్లలు పెద్దగవుతున్నారు డబ్బు అవసరం వుంటుందని తిరిగి మా వూరికి వచ్చింది అనూషక్కను, వినయ్‌ని తీసుకొని తిరిగి మా వూరికి రావడమైతే వచ్చారు కానీ పాపం వాళ్ళ పరిస్థితి దారుణం. వాళ్ళు వుండటానికి సరైన ఇల్లు కూడా లేదు. అనూషక్క వాళ్ళ పెద్దనాన్న చాలా కఠినాత్ముడు, దుర్మార్గుడు. తిరిగి వాళ్ళ ఆస్తికి వాళ్ళు వచ్చారని కడుపు మంట. వాళ్ళ భాగానికని ఒక పాతబడిన ఇల్లు ఇచ్చాడు. వాళ్ళ ఇల్లు మా ఇంటికి వెనక వుండేది. అప్పుడు ఆ ఇంట్లో కరెంటు కూడా లేదు. ఇంటి ముందు పాతబడిన ఇల్లులు మొండి గోడలతో,ముళ్ల చెట్లతో నిర్మానుష్యంగా భీతిగొల్పేది. రాత్రి అయితే కీచురాళ్ళ అరుపులు. వాళ్ళు ఆ ఇంట్లో ఎలా వుంటున్నారని బాధనిపించేది నాకు. వాళ్ళు అలా ఇబ్బంది పడటం చూడలేక నాన్న మా ఇంట్లో నుంచి కరెంటు కనెక్షన్ ఇప్పించాడు. అప్పుడు అనూషక్క, వినయ్ ఎంత సంతోషించారో నాకు ఇప్పటికి గుర్తు. అప్పటి నుండి అనూషక్కకు వినయ్‌కి మా మీద మరింత ప్రేమ పెరిగింది. అప్పుడప్పుడు అమ్మా నాన్న కాస్తంత మంచి చెడు చూసేవాళ్ళు మగతోడు లేని వాళ్ళని. అనూషక్క ఎన్నో సార్లు అనేది, చిన్నమ్మ చిన్నాన్న లేకపోతే మేము ఏమైపోయేవాళ్ళమని. అప్పుడు నాకు ఏమి చెప్పాలో కూడా తెలిసేది కాదు. కానీ మనసు మాత్రం తడితడిగా అయ్యేది.

కొద్ది రోజుల తర్వాత ఇక ఆ ఇంట్లో వుండలేక అక్కా వాళ్ళు మా వూరిలోనే కొంచెం దూరంలో వాళ్ళ దగ్గర బంధువుల ఇంటి దగ్గర ఇల్లు తీసుకొని ఆ ఇంట్లోకి మారి పోయారు.

ఆ ఇల్లు నాకు చాలా నచ్చేది. కల్లంలో ఇల్లు అవటం వల్ల చుట్టూ చెట్లతో ఎంతో ఆహ్లాదంగా వుండేది. ఆ ఇంటికి వెళ్ళాక అక్కా వాళ్ళు ఇంకా చాలా మొక్కలు వేశారు. నాకు మొక్కలు అంటే ప్రాణం. అందుకే చదువు సాకుతో రోజూ వెళ్ళే దాన్ని ఆ మొక్కల కోసం అక్కా వాళ్ళ కోసం. అక్కా వాళ్ళ ఇంట్లో వున్నంత సేపు ఆ మొక్కల మధ్య సీతాకోకచిలుకలా తిరిగే దాన్ని స్వేచ్ఛగా హాయిగా. అక్కా వాళ్ళు ఆ ఇంట్లోకి మారినప్పుడు అక్కా వాళ్ళ పెద్దనాన్న మరింత మండిపడ్డాడు

కథ

పెద్దమ్మ పైన. ఆ పిల్లలను చెడగొట్టడానికే ఆ ఇంటికి వెళ్ళిందని. ఏది ఏమైతేనేమి అక్కా వాళ్ళకు అక్కడికి వెళ్ళాక ఒంటరి తనం దూరమైంది. వాళ్ళల్లో కాస్త సంతోషం కనిపించేది నాకు.

★ ★ ★

మా ఊరిలో ఐదవ తరగతి వరకే బడి వుండటం వల్ల, ఆరవ తరగతి నుండి పక్క ఊరికి వెళ్ళాలి. బడికి వెళ్ళే దారంతా పొలాలు, ఒంటరిగా వెళ్ళను భయమేసేది, అక్క, నేను, వినయ్ ఇంకా కొందరు పిల్లలం అంతా కలిసి వెళ్ళేవాళ్ళం.

అమ్మకు ఆరోగ్యం బాగాలేక ఉదయం తొందరగా లేచేది కాదు. కొంచెం ఎండ పడ్డాకే లేచేది. అందుకని నా క్యారియర్‌కు నేనే వండుకునేదాన్ని, ఇంకా అదృష్టం ఏమిటంటే మా ఇంట్లో అప్పుడు గోబర్ గ్యాస్ వుండేది. ఆ గ్యాస్ పొయ్యి మీద కొంచెం అన్నం, నాకు ఇష్టమైన టమోటా కూర చేసుకునేదాన్ని సులువుగా నేను క్యారియర్ సర్దుకొని, స్నానం చేసి వచ్చేలోగా, అమ్మ లేచి నాకు జడ వేసి, జొన్నరొట్టె చేసేది. నేను రొట్టె తిని స్కూల్ కు క్యారియర్ తీసుకొని వెళ్ళేదాన్ని.

అక్కకు ఎంత బాధో.. అంత చిన్న వయసులో నా క్యారియర్ నేను చేసుకొని వెళ్ళటం, అదీ రోజూ టమోటా కూరే అని. అందుకే తన క్యారియర్ లో తను ఏమి తెచ్చుకున్నా ఎక్కువగా తెచ్చి, కొసరి కొసరి తినిపించేది. అమ్మ కన్నా ఎక్కువగా అక్క ఏ జన్మలోనో అమ్మ అయి వుంటుందని అనుకునే దాన్ని, కల్మషం లేని తన ప్రేమలో.

★ ★ ★

అక్క ఎంతో అందంగా వుండేది. గుండ్రటి ముఖం,రింగు రింగుల జుట్టు, పచ్చని మేనిఛాయతో మెరిసిపోతూ పుత్తడిబొమ్మలా. అక్కావాళ్ళు వాళ్ళకు వున్నదాంట్లో వాళ్ళు ఆత్మాభిమానంతో బ్రతికే వాళ్ళు, ఎవరిని ఎప్పుడూ ఏ సాయం అడిగే వాళ్ళు కాదు. అయినా పనికట్టుకొని వాళ్ళ పెద్దనాన్న ఇంకొందరిని తోడుచేసుకొని వాళ్ళపై లేనిపోని అపవాదులు వేసేవాడు.



ఎవరివల్ల ప్రేమ, ఆదరణ అందని అనూషక్క,పెద్దమ్మ ఎవరి మాటలను పెద్దగా పట్టించుకునేవాళ్ళు కాదు.. ఎంత బాధనైనా బయటికి కనిపించ కుండా మింగుకునే వాళ్ళు. గుంభనంగా ఒంటరితనపు బాధను అనుభవిస్తున్నా వాళ్ళ ముఖంపై చిరునవ్వు చెదిరేది కాదు. వాళ్ళు ఎవరితో మాట్లాడినా ముందు వాళ్ళ చిరునవ్వు పలకరించేది. వాళ్ళలో

**అనూషక్కకు ఒక తమ్ముడు వున్నాడు పేరు వినయ్, నా కన్నా ఒక సంవత్సరం పెద్దవాడు. ఇద్దరం ఒకే తరగతి కాబట్టి నేను వినయ్ అనే పిలిచేదాన్ని. ఇద్దరూ ఇద్దరే అక్కాతమ్ముడు ఎంతో సున్నిత మనస్కులు. అందుకే మా వూరిలో అందరికన్నా నాకు వాళ్ళిద్దరంటేనే ఇష్టం. అనూషక్క వాళ్ళ పెద్దనాన్న వీళ్ళ పొలం పండించుకుంటూ సరైన గుత్త ఇచ్చేవాడు కాదు. అందుకే పెద్దమ్మ పిల్లలు పెద్దగవుతున్నారు. డబ్బు అవసరం వుంటుందని తిరిగి మా వూరికి వచ్చింది అనూషక్కను, వినయ్‌ని తీసుకొని తిరిగి మా వూరికి రావడమైతే వచ్చారు కానీ పాపం వాళ్ళ పరిస్థితి దారుణం.**

నాకు నచ్చింది అదే వాళ్ళను అలా దయనీయంగా చూస్తున్నప్పుడు, వాళ్ళపై నాకు ఎంతో జాలి కలిగేది ఎవరికి ఏ హాని చేయని మనుషులు అయినా దూషణకు గురవుతున్నారని బాధనిపించేది. ఈ సమాజం కళ్ళున్న గుడ్డిది. ఇలాంటి వాళ్ళు లోలోపలే కుమిలి పోతూ తమను తాము నిందించుకుంటూ వుంటారు శాపగ్రస్తులుగా అలా అనుకోవడం వాళ్ళు తిరిగి ఎవరిని దూషించలేరు ఆ అనిస్సహాయతే సమాజానికి దొరికిన అవకాశం.. అలా శిక్షిస్తూ వుంటుంది.

కథ

★ ★ ★

అక్కా వాళ్ళు మాతో వున్నంత చనువుగా మా వూరిలో ఇక ఎవరితో వుండే వాళ్ళు కాదు. అందుకనే వాళ్ళను గర్విష్టులుగా అనుకునేవాళ్ళు, నాకైతే వాళ్ళలో స్వచ్ఛతే కనిపించేది. ఎవరికైనా మనం దగ్గరైనప్పుడే వాళ్ళ స్వభావం తెలుస్తుంది.

నా కోసం రోజూ ఎదురు చూస్తూ వుండేవాళ్ళు. నన్ను చూడగానే వాళ్ళ ముఖాలు వెలిగిపోయేవి ఆనందంతో. నాకు అంతే బడికి వెళ్ళినా, బడి సెలవు వున్నా అక్కా వాళ్ళ తోనే గడిపేదాన్ని, అక్క తప్ప వేరే లోకం లేనట్టు అతుక్కుపోయేదాన్ని. అక్క పదవ తరగతిలో వుండగా ఒకరోజు పొద్దున పొద్దున్నే పిడుగులాంటి వార్త. అక్క వాళ్ళ ఇంటి పక్కన వున్న వాళ్ళ అత్త కొడుకుతో వెళ్ళి పోయిందని. అప్పుడు నాకు ఎంత ఏడుపు వచ్చిందో

అక్క అలా వెళ్ళి పోయాక, వాళ్ళ పెద్దనాన్న కుటుంబం, ఆ ఇంటికి ఆ పరిసరాలకు వెళ్ళలేదు. పైగా ఆ పిల్ల అలా చేయక ఇంకేమి చేస్తుందని ఎంతో ఆడిపోసు కున్నారు.

★ ★ ★

స్కూలులో భోజనం సమయంలో అక్క గుర్తుకు వచ్చి బాగా ఏడ్చుకునేదాన్ని రోజూ స్కూలుకు ముగ్గురం "గువ్వల్లా" వెళ్ళే వాళ్ళం, ఇప్పుడు ఒక "గువ్వ" మమ్మల్ని వదిలి వెళ్ళిపోయింది. అక్క అక్కడ ఎలా వుందో అని వేదనగా వుండేది. బయటికి ఎప్పుడూ అనేదాన్ని కాదు. కానీ అక్క గురించిన విషయాలు తెలుసుకోవాలని ఆరాటపడేదాన్ని లోలోపల. అక్క అలా వెళ్ళి పోయాక నన్ను అక్కా వాళ్ళ ఇంటికి వెళ్ళనిచ్చే వాళ్ళు కాదు అమ్మా, నాన్న. నాకు కూడా వెళ్ళాలనిపించేది కాదు. ఇక అక్కడ అక్క లేదని. అక్క గురించిన విషయాలు అప్పుడప్పుడు అమ్మా, నాన్న మాట్లాడు కుంటుంటే విని ఊరట పడేదాన్ని.

అక్క బావతో సంతోషంగానే వుందని, చిన్నతనంలోనే తండ్రి చనిపోవడం వల్ల తండ్రి ప్రేమను నోచుకోని అక్క, ఇప్పుడు బావను పెళ్ళి చేసుకొని ఆ లోటు తీరి సంతోషంగా వుందని అక్క సంతోషంగా వుందని నాకు సంతోషంగా అనిపించేది.

తరువాత కొద్ది రోజులకు వినయ్, పెద్దమ్మ కూడా హైదరాబాద్ వెళ్ళి పోయారు వినయ్ చదువుకోసం. నన్ను టౌన్ చదువుకు పంపను ఇష్టం లేక పెళ్ళి చేసేశారు నాకు. ఆ తర్వాత అక్క గురించిన ఆలోచనలు కొంచెం దూరమే అయ్యాయి. నా సొంత జీవితంతో, కొత్త లోకంలో...

★ ★ ★

అనూషక్కకు పెళ్ళి అయ్యాక మళ్ళీ మేము కలుసుకోవడం ఇప్పుడే.. ఇన్ని రోజుల తర్వాత అనూషక్క వాళ్ళ పెద్దమ్మ మనవరాలు పెళ్ళికి కర్నూలు వచ్చింది. ఆ పెళ్ళి అయిపోయేదాక ఎన్ని మాటలు నడిచాయో కొన్ని నోటితో అయితే, కొన్ని మనసుతో అక్క ఆ పెళ్ళి అయిపోయాక తిరిగి వూరికి వెళ్ళి పోతుంటే, ఇద్దరిలో నిశ్శబ్ద దుఃఖం తప్పని వీడుకోలుతో.

★ ★ ★

నాకు ఎప్పుడూ అనిపిస్తూ వుంటుంది.

అక్క చేసిన తప్పు ఏంటి?

అక్కను, అంతలా అనుకోను

తనకు కావలసిన ప్రేమను తను వెతుక్కుంది.

అదేనా అక్క చేసిన తప్పు.

ప్రేమ, ప్రేమను.. ప్రేమించడం తప్పా?

కవిత

# జీవనాడి

కాస్తుంది
కురుస్తుంది
వేస్తుంది

అనుభూతికి
జీవనగతికి
పరమార్థానికి
రసజ్ఞానం

చిగురిస్తుంది
విరబూస్తుంది
రాలుతుంది
పురిటిజ్ఞానం

ఆనందపు మురిపాన్ని
నిర్యాణపుసుద్దుల్నీ
పునర్జీవనగీతాల్నీ
లోలోపలి జ్ఞానం

ప్రకృతి ఋతురాగంలో
ఆరుస్వరాల
అంతరంగ విశ్లేషణ
తెలిసి తెలియనట్టి
రహస్య సందేశం

తెలుసుకున్నవాడు రైతు
తెలుసుకోలేనివాడు బైతు



రేడియమ్



## The Commonwealth of Cricket




ప్రముఖ చరిత్రకారుడు, భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) క్రికెట్ పాలక కమిటీ (సీఓఏ) మాజీ సభ్యుడు, రామచంద్ర గుహ రచించిన తాజా పుస్తకం The Commonwealth of Cricket. పాఠశాల స్థాయి నుండి జాతీయ స్థాయి దాకా భారత్‌లోని అన్ని స్థాయిల క్రికెట్ గురించి ఇందులో వివరించారు. ఒక ఆటగాడిగా, అభిమానిగా, రచయితగా, క్రికెట్ పరిపాలకుడిగా దశాబ్దాలుగా ఈ క్రీడతో ఉన్న అనుబంధంతో ఈ పుస్తకాన్ని రచించారు రామచంద్ర గుహ. టెస్టులు, వన్డేలు, టీ ట్వంటీ... ఇలా మూడూ ఫార్మాట్లలో టెస్టు క్రికెట్‌కు ఉన్న ప్రాధాన్యతను ఇందులో పొందుపరిచారు. భారత క్రికెట్‌లో జరుగుతున్న పలు వివాదాస్పద అంశాలను సైతం ఇందులో ఆసక్తికరంగా వివరించారు.

## Khaki in Dust Storm




ప్రజలకు రక్షణ కల్పించడంలో, శాంతి భద్రతలను కాపాడటంలో పోలీసుల పాత్ర కీలకం. పోలీసులు వృత్తి నిర్వహణలో ఎదురయ్యే అనేక సవాళ్లు, బాధ్యతలను Khaki in Dust Storm పుస్తకం ద్వారా పాఠకులతో పంచుకున్నారు రిటైర్డ్ ఐపీఎస్ అధికారి అమోద్ కె.కాంత్. 1980, 90 దశకంలో ఢిల్లీలో వివిధ స్థాయిల్లో విధులు నిర్వర్తించిన అమోద్ కె.కాంత్, తాను చూసిన, పాల్గొన్న అనేక భద్రతా పరమైన సంఘటనలను ఇందులో వివరించారు. ఖలిస్థాన్ ఉద్యమం, ప్రధానిగా ఇందిరాగాంధీ హత్య అనంతరం జరిగిన అల్లర్ల వంటి కీలక సంఘటనలను పోలీసులు ఎలా పరిష్కరించారు అనే అంశాలను ఆసక్తికరంగా వివరించారు. అంతే కాకుండా విధి నిర్వహణలో ఎదురయ్యే సవాళ్లు, పై స్థాయి నుండి వచ్చేఒత్తిళ్ల వంటివి కూడా ఈ పుస్తకంలో వివరించారు.

## Sebastian and Sons: A Brief History of Mrdangam Makers

మృదంగం... సంగీతం కోసం వాడే పరికరాల్లో పేరుగాంచింది. దక్షిణ భారతదేశంలో ముఖ్యంగా కర్ణాటక వంటి రాష్ట్రాల్లో మృదంగం, సాంప్రదాయ సంగీత వాయిద్యంగా ప్రముఖంగా ఉపయోగిస్తారు. అయితే మృదంగం పరికరం తయారీ వెనకున్న పూర్తి వివరాలను Sebastian and Sons: A Brief History of Mrdangam Makers పుస్తకంలో వివరించారు రచయిత టీ.ఎం కృష్ణ. ఆంధ్రప్రదేశ్, కేరళ, కర్ణాటక, తమిళనాడు లోని వివిధ ప్రాంతాల్లో పర్యటించిన రచయిత, మృదంగం గురించి ప్రపంచానికి తెలియని అనేక అంశాలను సేకరించారు. మృదంగం పరికరం తయారుచేసే విధానం,




వ్యక్తులు, కళాత్మక నైపుణ్యాలు వంటి అనేక విషయాలను ఈ పుస్తకంలో పొందు పరిచారు.

## Red Fear: The China Threat




భారత్- చైనా.. ప్రపంచంలోనే అత్యధిక జనాభా గల రెండు దేశాలు. అంతేకాదు ఆసియాలో అత్యంత బలమైన ఆర్థిక వ్యవస్థ గల దేశాలు. అయితే భారత్- చైనా సరిహద్దుల్లో ఘర్షణలు జరగటం ఈ మధ్య తరచుగా వింటున్నాం. కశ్మీర్‌లోని లద్దాఖ్‌లో వివాదాస్పద ప్రాంతమైన గాల్వాన్ లోయలో ఇటీవల భారత్, చైనా సైనికుల మధ్య జరిగిన సంఘర్షణ ప్రపంచవ్యాప్తంగా ఆందోళనను రేకెత్తించింది. భారత్, చైనా ల మధ్య15 వ శతాబ్దం నుండి 21 వ శతాబ్దం వరకు సాగుతున్న సరిహద్దు సంఘర్షణలను, వాటి చరిత్రను Red Fear: The China Threat పుస్తకంలో వివరించారు రచయిత ఇఖ్బాల్ చంద్ మల్హోత్ర. చైనా నుండి భారతదేశానికి పొంచి ఉన్న ముప్పును, ప్రస్తుతం ఎదురవుతున్న సవాళ్లు, పలు సైనిక, రాజకీయపరమైన అంశాలను ఈ పుస్తకంలో పొందుపరిచారు.

# బీరువా

తీయని పాత అనుభూతులను ప్రోది చేసుకున్న కథ బీరువా...



తిరునగరి దేవకీ దేవి

రిటైరై అప్పుడే పుష్కర కాలం గడిచింది. 6-1-2020న జరుగబోయే గోల్డెన్ జుబ్లీ ఫంక్షన్ సందర్భంగా కాలేజి నుండి ఆహ్వానం అందింది. ముప్పై నాలుగేండ్ల అనుబంధం ఆ కాలేజీతో. ఇంకా వారం రోజులుంది. ఓల్డ్ స్టూడెంట్స్, కొలీగ్స్ అందర్నీ కలవొచ్చనే ఆరాటం. ఏడు రోజులు ఏడు యుగాలుగా గడిచినై. ఆరోగ్యం పెద్దగా సహకరించడం లేదు. నిమోనియా సోకింది. మందులు తప్పవు కదా! వాటి సైడెఫెక్ట్‌తో కాళ్ళ వాపులు. స్వేచ్ఛగా తిరుగలేను. కచ్చితంగా కారు ప్రయాణమే. తప్పదు. నాకవసరమైనప్పుడు వచ్చే డ్రైవర్ మల్లేశంకు ఫోన్ చేసిన. ఊళ్ళో లేనన్నాడు. ఇంకో డ్రైవర్ కృష్ణకు చేసిన. అక్కడా మొండిచెయ్యే ఎదురైంది. ఇక నా ప్రయాణానికి నీళ్ళొదులుకున్నట్టే అనుకొని నీరుకారి పోయిన. మధ్యాహ్నం భోజనం చేద్దామని వంటింటి వైపు పోతున్న నన్ను ముందు నా పని చూడమన్నట్లుగా ఫోన్ మోత. తప్పదు కదా! వెనక్కి పోయి ఫోన్ అందుకున్న. రాగిణి మేడమ్ ఫోన్.

**బహుమతులందుకోని విద్యార్థుల లిస్టు తయారు చేసిన. వీలైనంత తొందరగా స్టాఫ్ రూంకు వచ్చి పుస్తకాలు తీసుక పొమ్మని సర్క్యులర్ పంపిన. అనివార్యంగా ఆ రోజు రాలేని విద్యార్థులు ఒక్కొక్కరు వచ్చి తీసుకుపోవడం చాలా రోజులే కొనసాగింది. తమ బహుమతులు తమకు చేరిన అవకాశానికి ఎంతో మురిసిపోయిన వాళ్ళ ముఖాల్లో సంతోషం చూస్తే నా ఆనందానికి అవధులు లేకుండా ఐపోయింది.**

ఆమె మా కాలేజిలో డెబ్బై ఐదులో అనుకుంట ఓ సంవత్సరం పని చేసింది.

“మీరు గోల్డెన్ జుబ్లీకి.పోతున్నరా” ఆమె ప్రశ్న “పోవాలనే అనుకున్న. డ్రైవర్ లేడు” నా సమాధానం.

“ఔనా? ఐతే ఓ పని చేద్దాం. మీరు మా యింటికి రండి. మా కారులో పోదాం.” ఆమె పరిష్కార మార్గం చెప్పింది.

నా సంతోషానికి అవధులు లేవు. ఎగిరి గంతేసిన. ఇక చెప్పేదేముంది. బడి రోజుల్లో చిన్న పిల్లలు విహారయాత్రకు పోతున్నంత ఉత్సాహంతో కూకట్ పల్లి లోని వాళ్ళింటికి చేరుకున్న. అటుపై శంకర్‌పల్లి మీదుగా మా ఊరు వికారాబాదుకు ఒంటిగంటకల్లా చేరుకున్నం. న్యాయంగా ఆ రోజు వికారాబాద్‌లో నాకు ఓ విందు భోజనానికి మరో విద్యాపీఠం భూమి పూజ కార్యక్రమానికి ఆహ్వానాలు ఉన్నాయి. రాగిణీ మేడమ్‌కు అసౌకర్యం అవుతుందన్న ఆలోచన కాలేజికి పోవాలన్న ఆతృత ఆ ఆహ్వానాలను తిరస్కరించింది.

ఆహ్వాన కమిటీ ముందు భోజనాలు చేయమంది. హాల్లో అడుగు పెట్టినం. అంతా అనుకున్నట్టే పాత విద్యార్థులు, ఎక్స్ కొలీగ్స్, నాన్ టీచింగ్, కాంటిన్ జెంట్ ఊరి పరిచయస్తులు ఎంత మందో. ఆత్మీయ ఆలింగనాలు (కరోనా రాలేదు కదా) కరచాలనాలు నమస్కారాలు. కలగూర గంప వ్యవహారం. భోజనాలు ముగుస్తుండగానే ఎవరో మోసుకొచ్చిన వార్త. ముఖ్య అతిథి రాక గంట ఆలస్యమని. చేసేదేముంది? కాలేజంతా కలియ తిరుగుతూ స్టాఫ్ రూం చేరుకున్నం. ఉత్సాహం ఉరకలు వేసినా ఏడు పదుల వయస్సాయె. అలసట ఆవహించింది. మా తెలుగు అధ్యాపకుడి ఆహ్వానంతో మా శరీరాలు కుర్చీలలో చేరగిలబడిపోయినై. ఆ గదితో ఉన్న అనుబంధం ఇంతా అంతా కాదు. నా కళ్ళు ఎంతో ప్రేమగా ఆ గదినంతా కలియ చూసినై. నాక్ సందర్భంగా ఏర్పాటు చేసిన రకరకాల చార్ట్స్, ఫొటోలు, తెలుగు, ఇంగ్లీష్, హిందీ శాఖలు కలిసి కొన్న బీరువా అన్నీ నన్ను ఆత్మీయంగా

పలకరించింది. ఆ పలకరింపులు నన్ను గతంలోకి తీసుకపోయినై.

క్లాసు ముగించుకొని వచ్చి రిజిస్టర్స్ డ్రాలో పెడుతున్న లాంగ్ బెల్ అది అకాల లాంగ్ బెల్. అంటే ఏదో బంద్ అన్నట్టు బిసి విద్యార్థులు ఫీజులు విషయంగా చేస్తున్న బంద్ అన్న వార్తను రుక్కమ్మ మోసుకొచ్చింది. విద్యార్థులున్నా లేకపోయినా అధ్యాపకులు ఫైవ్ అవర్స్ స్టే కంపల్సరి కదా! లైబ్రరీకి పోదామని లేచిన.

**"అదీ ఆలోచిద్దాం. మనసుంటే మార్గముండదా?! ఐనా బీరువా షాపు ఓనరు నాకు బాగా తెలిపిన వాడే. బాలెన్స్ అమౌంట్ నెక్స్ట్ ఇయర్ ఇద్దాం. ఒప్పుకుంటే ఓకే. లేదంటే మనమే వేసి తర్వాత తీసుకుందాం. పిల్లలకోసం ఆ మాత్రం చేయలేమా?" అన్నాన్నేను. మా వాళ్ళూ అంగీకరించిన్రు. అనుకున్నట్టే షాపు యజమాని ఒప్పుకోవడంతో బీరువా మా స్టాఫ్ రూంను అలంకరించింది.**

"ప్రిన్స్‌పల్ సారు పిలుస్తుండు" అంటూ రుక్కమ్మ ఎంటరైంది.

ఏమై ఉంటుందని ఆలోచిస్తూనే ప్రిన్స్‌పాల్ రూం చేరుకున్న. ఆయనకు విష్ చేసి ఓ చేర్‌లో కూర్చున్న

"ఎందుకు పిలిచినట్టు" అన్న మొహం పెట్టి.

"మేడమ్! కాలేజ్ డే వారం రోజులే ఉంది. పిల్లలకు లిటరరీ ప్రైజులు అకడమిక్ ప్రైజులు తేవాలె. విద్యార్థులు లేరు..క్లాసులూ లేవు. ట్రేన్ టైముంది. ఈ రోజే పోతే బాగుంటుంది కదా!" ప్రిన్సిపల్ మాట. నేను కాలేజిలో చేరి ఇరవై ఏడు సంవత్సరాలు. ఇప్పటి వరకు నేను లిటరరీ కన్వీనర్ అయింది లేదు. పుస్తకాలు తెచ్చింది లేదు. అందుకేనేమో ఆయన మాట నా చెవుల్లో అమృతం పోసినట్లని పించింది. వెంటనే అందుకు సిద్ధమైన. మా ఇంటి ప్రథమ పురుషుడికి కూడా సమాచారం చేర వేసి లేడికి లేచిందే పరుగన్నట్లు బయలు దేరిన. నాతో పాటు తెలుగు ఇంగ్లీష్ హిందీ సలహా దారులతో ఉరుకుల పరుగులతో ట్రేన్ కాచ్ చేసినం. ఏ సిగ్నల్స్ ఆటంకపరుచ లేదు. పన్నెండు న్నరకల్లా నాంపల్లి, ఒంటిగంటకల్లా నవయువగ బుక్ హౌసు చేరుకున్నం.

విద్యార్థుల ప్రైజ్ పుస్తకాలు ఓ పది వేల విలువ సుమారుగ అని షాపు యజమానికి చెప్పినం.

"ఏ టైప్ పుస్తకాలు ఇయ్యమంటరు సార్" షాపు ఓనర్ ప్రశ్న.

"సాహిత్యానికి సంబంధించినవి."

"అవేనా? కాంపిటీటివ్ ఎక్జామ్స్‌కి సంబంధించినవా?"

"మాకు సాహిత్యం పుస్తకాలే కావాలె."

"అది కాదు సార్. కాంపిటీటివ్‌లో డిస్కౌంట్ ఎక్కువ ఉంటది."

"డిస్కౌంట్ లొల్లి పక్కన పెట్టండి. పిల్లలకు ఉపయోగ పడేవే కావాలె." అన్నాం మేము.

"మీ ఇష్టం. పుస్తకాలు వెతుక్కోండి." షాపు ఓనరు.

ముగ్గురమూ షాపు లోపలికి పోయినం. షాపంతా కలియ తిరిగినం. నేను మా తెలుగు అధ్యాపకుడు నారాయణ రావు కలిసి పరిశోధన చేసిన లెవల్లో పుస్తకాలు వెతికినం. దాశరథి



కథ

"చిల్లర దేవుళ్ళు"... వట్టికోట "ప్రజల మనిషి"... శ్రీ శ్రీ మహాప్రస్థానం కొడవటిగంటి "చదువు" ఇంకా అమృతం కురిసిన రాత్రి, మేఘ సందేశం, రాచకొండ ఇల్లు అన్నీ పిల్లలకు సాహిత్యంతో పరిచయం ఉండే ఆలోచన కల్పించే పుస్తకాలను సెలెక్ట్ చేయడంతో పుస్తకాలతో యుద్ధం చేసినమా అనిపించింది. బయటి ప్రపంచంతో సంబంధం లేకుండా ఏదో దీక్ష చేసిన ఫీలింగ్. టైమే తెలియలేదు. ఏడైంది. తొందరగా తెమలమని గడియారం హెచ్చరించింది. ఇంగ్లీషు ,హిందీ సలహాదారులు తమకు అనుకూలమైన పుస్తకాలు సెలెక్ట్ చేసుకున్నరు.

నేను కౌంటర్ దగ్గరికి పోయి "బిల్ ప్రిపేర్ చేయండి" అంటూ మేం సెలెక్ట్ చేసిన పుస్తకాలను బిల్ కౌంటర్ టేబుల్ మీదికి చేర్చినం.

"మేడమ్ డిస్కౌంట్ 15%-10% ఓకేనా?"అడిగిండు షాపతను "అర్థం కాలేదు" అన్నాను.

నేను "15% బిల్లులో చూపించి మీ చేతికి 10% ఇస్తం".

షాపతను "ఔనా!"అంటూ మా సహాధ్యాపకులవైపు చూసి "ఈ బహిరంగ రహస్యం ఇప్పటి వరకు మనకు తెలియదు కదా!" అన్నాను నేను.

"నిజమే! మనకు అప్ టు డేట్ నాలెడ్జ్ నిల్" నవ్వుతూ అన్నారు మావాళ్ళు.

"ఏంచేద్దాం?" అని ప్రశ్నించి "ఒక పని చేద్దామా"అని నేనే తిరిగి అన్న"

"చెప్పండి" అడిగిను మా వాళ్ళు

"10%తో విద్యార్థులకు ఉపయోగపడే పనేమైన చేస్తే?"అన్నాన్నేను.

"చాలా మంచి ఐడియా"మా వాళ్ళ సమాధానం.

"సేట్ జీ ! 15%-10% చెయ్యండి" అని చెప్పగానే "సరే "అంటూ ఆయన బిల్ చేసి ఇచ్చిండు. కరెక్ట్‌గా గుర్తు లేదు. ఓ పన్నెండు వందల చిల్లర మా చేతిల పెట్టిండు. ఆ పుస్తకాల పాక్‌లను షాపులోనే పెట్టి వెనకాల ఉన్న ఓ చిన్న హోటల్‌లో ఆత్మారామున్ని శాంతింపచేసి పుస్తకాలతో

**ఆత్మీయ ఆలింగనాలు (కరోనా రాలేదు కదా) కరచాలనాలు నమస్కారాలు. కలగూర గంప వ్యవహారం. భోజనాలు ముగుస్తుండగానే ఎవరో మోసుకొచ్చిన వార్త. ముఖ్య అతిథి రాక గంట ఆలస్యమని. చేసేదేముంది? కాలేజంతా కలియ తిరుగుతూ స్టాఫ్ రూం చేరుకున్నం. ఉత్సాహం ఉరకలు వేసినా ఏడు పదుల వయస్సాయె. అలసట ఆవహించింది. మా తెలుగు అధ్యాపకుడి ఆహ్వానంతో మా శరీరాలు కుర్చీలలో చేరగిలబడిపోయినై. ఆ గదితో ఉన్న అనుబంధం ఇంతా అంతా కాదు. నా కళ్ళు ఎంతో ప్రేమగా ఆ గదినంతా కలియ చూసినై.**

ఆటోలో నాంపల్లి చేరుకున్నం. అదృష్టం కొద్ది ట్రేన్ దొరికింది. సీట్లూ దొరికినై. పని అనుకున్నట్టుగా సవ్యంగా సాగి నందుకు తృప్తిగా అనిపించింది. ఊపిరి పీల్చుకున్న. ట్రేన్‌తో పాటు నా ఆలోచనలూ వేగం పుంజుకున్నై. మధ్యలో విరామంగా మా వాళ్ళతో చాటింగ్ కూడా. ఉన్నట్టుండి నా మెదడులో ఓ మెరుపు.

వెంటనే "నాకో ఆలోచన వచ్చింది" అన్నాన్నేను మా వాళ్ళతో.

చెప్పండి "ఓ బీరువా కొందామా?"

"బీరువా ఎందుకు?"

"మన సాహిత్య శాఖకు".

"ఏం చేద్దాం?"

"మన ఫైల్స్ తో పాటు ప్రైజ్ లు తీసుకోని విద్యార్థుల పుస్తకాలను అందులో పెట్టొచ్చు"

"పెట్టి?"

"ఈ మధ్య కాలంల కాలేజ్ డే రోజు విద్యార్థులు అందరు రావటం లేదు.వాళ్ళ పుస్తకాలను బీరువాలో పెట్టొచ్చు. వీలును బట్టి వచ్చిన వాళ్ళకు ఇవ్వొచ్చని. పుస్తకాలు బీరువాలో సేఫ్టీగా ఉంటై కదా?"

"నిజమే. కాని ఈ అమౌంట్‌కు బీరువా!" అనుమానంతో మా వాళ్ళ ఎదురు ప్రశ్న.

"అదీ ఆలోచిద్దాం. మనసుంటే మార్గముండదా?! ఐనా బీరువా షాపు ఓనరు నాకు బాగా తెలిసిన వాడే. బాలెన్స్ అమౌంట్ నెక్స్ట్ ఇయర్ ఇద్దాం. ఒప్పుకుంటే ఓకే. లేదంటే మనమే వేసి తర్వాత తీసుకుందాం. పిల్లలకోసం ఆ మాత్రం చేయలేమా?" అన్నాన్నేను. మా వాళ్ళూ అంగీకరించిను. అనుకున్నట్టే షాపు యజమాని ఒప్పుకోవడంతో బీరువా మా స్టాఫ్ రూంను అలంకరించింది. కాలేజ్‌డే కూడా ఐపోయింది. పుస్తకాలూ మిగిలిపోయినై.

బహుమతులందుకోని విద్యార్థుల లిస్టు తయారు చేసిన. వీలైనంత తొందరగా స్టాఫ్ రూంకు వచ్చి పుస్తకాలు తీసుక పొమ్మని సర్క్యులర్ పంపిన. అనివార్యంగా ఆ రోజు రాలేని విద్యార్థులు ఒక్కొక్కరు వచ్చి తీసుకుపోవడం చాలా రోజులే కొనసాగింది. తమ బహుమతులు తమకు చేరిన అవకాశానికి ఎంతో మురిసిపోయిన వాళ్ళ ముఖాల్లో సంతోషం చూస్తే నా ఆనందానికి అవధులు లేకుండా ఐపోయింది. తర్వాత సంవత్సరం బీరువాబాకీ తీరింది. ఆ తర్వాత మా డిపార్టుమెంటుకు కావలసిన పుస్తకాలు అందులో చేరినై. కాలం ఆగదుకదా! వయస్సు నన్ను విశ్రాంతి తీసుకొమ్మంది.

అప్పుడు మేము విద్యార్థుల కొరకు స్వంతంగా ఒక్క రూపాయి ఖర్చు పెట్టలేదు. ఒక చిన్న ప్రయత్నంతో వాళ్ళకో సదుపాయం. అందులో కొండంత సంతృప్తి. అదో మధుర స్మృతి. ఆ స్మృతులన్నీ కనురెప్పల చాటున ఇంకా కదలాడుతూనే ఉన్నాయి.

"మేడమ్! నిద్ర పోతున్నరా? చీఫ్ గెస్ట్ వస్తున్నాడట. అనౌన్స్ చేస్తున్నరు పదండి" అంటూ రాగిణి మేడమ్ నా ఆలోచనలకు బ్రేకు వేసింది.

వేదిక వైపు నడిచినం. ముఖ్య అతిథి రాక ప్రసంగం నిష్క్రమణ అన్నీ జరిగిపోయినై. కానీ గతస్మృతుల సువాసనలు నన్ను వీడలేదు.

కవిత



# తంగేడు తాదాత్మ్యం



శైలజామిత్ర

విరబూసిన మట్టి ముఖమ్మీద
పువ్వు జల్లినట్లు.. పండగ సందడితో
సందడి ముఖమెరుగని జీవితాలకు
కోల్పోయిన కోలాహలాన్ని పరిచయం చేస్తూ
బతుకమ్మ చల్లగా బతకండంటూ దీవిస్తోంది

నాలుగు గోడలు దాటలేని ప్రాణాలు
పలకరింపు చిరుజల్లులతో తడిసి మురిసిపోతున్నాయి
ఒకరినొకరు ఎదురయ్యే రోజుల్ని ఒడిసిపట్టుకుంటూ
చిరునవ్వుల్ని లేపనంగా దిద్దుకుంటున్నాయి.

రంగుల ఆకాశం బతుకమ్మ ఆహ్లాదాన్ని చూస్తూ
మసకబారిన మబ్బుల్ని తట్టి లేపుతోంది..

ఎండిపోయిన పెదాలపై రాలిన పాట చినుకులు
పల్లెపదాల జీన్లు తొడుక్కొని ఆనందంతో పరుగు తీస్తున్నాయి.

ఏపుకొచ్చిన పంటలన్నీ
ఎన్నో ఏళ్లుగా కనిపించక
కరువైన రెండెడ్ల గిలక చప్పుళ్ళకు మురిసిపోతున్నాయి.
మెరవడమే మరచిన మేఘాలన్నీ సరికొత్త వర్ణాలతో
రైతుల ముఖాల్లో వింత కాంతుల్ని నింపుతున్నాయి.

బతుకమ్మ పూల దొంతర్ల నుండి రాలుతున్న
పుప్పొడి సుగంధంతో
ప్రకృతి పరవశించిపోయి
తంగేడు వనమంతా తాదాత్మ్యంతో తడిసిపోతోంది.

వ్యాసం

# పోతనకు స్ఫూర్తి అయిన మహాకవి - మడికి సింగన

తెలుగు వారికి అందునా తెలంగాణ వారికి ప్రాత: స్మరణీయుడు పోతన. ఆయనకే స్ఫూర్తిగా నిలిచిన కవి మడికి సింగన్న. మడికి సింగన్న మూలాలను క్లుప్తంగా విశ్లేషించిన వడ్డెపల్లి వ్యాసం...



వడ్డేపల్లి కృష్ణ

మడికి సింగన... అనేక శాసనాల ఆధారంగా, ఇతడు రామగిరిని పరిపాలించిన ముప్ప భూపతి ఆస్థాన కవిగా నుండి, తిక్కన సోమయాజి మనుమరాలగు చిట్టాంబికను పెళ్లాడినట్లుగా 4 పద్యకావ్యాలు రచించినట్లుగా రూఢి అవుతుంది.

1. పద్మపురాణోత్తరఖండము 2. భాగవత దశమ స్కంధము 3. వాసిష్ఠ రామాయణము 4. సకల నీతి సమ్మతము అనేవి అతడు రచించిన కావ్యాలుగా క్రీ.శ. 1325-1400 మధ్య కాలం వాడుగా తేటతెల్లమవుతోంది.

సింగన తన మొదటి రెండు కావ్యాలను ముప్పభూపతి మంత్రియేగాక నేటి కరీంనగర మందలి నాటి, వెలిగందుల దుర్గ పాలకుడగు కందన మంత్రికి అంకితమిచ్చాడు. కందన కేసనకు స్వయాన సోదరుడు. సింగన పద్య రచనలో సిద్ధహస్తుడు. అల్లసాని పెద్దన కూడా యితని పద్యాన్ని అనుసరించి రచన చేసినట్లుగా తెలుస్తున్నది. పద్మ పురాణమందలి మొదటి అశ్వాసంలోని ఆ పద్యం-

చ: చని చని కాచెనంత మునిసత్తముడున్నత శృంగజాలమున్
కనియె శ్రుతి స్మృతి ప్రకట గాఢతరార్థ వరిష్ఠ దివ్యబో
ధన పదవీ మహత్వ సముదగ్ర గరిష్ఠ దపోవిశేష సం
జనిత నితాంత పుణ్యగణ సంచయ సువ్రత నిష్ఠునయ్యెడన్

ఈ పద్యమే పెద్దన్న ప్రసిద్ధమైన
"ఆటజని కాంచె భూమిసురుడంబరచుంబిత" మనెడు పద్యానికి మాతృకగా నిలుస్తున్నది. భావాలను సూటిగా సుందరంగా చెప్పడం సింగన పద్యవిద్య ప్రత్యేకతగా భావించ వచ్చు. మచ్చుకు పద్మపురాణమందలి సూర్యోదయ వర్ణన పద్యాన్ని పరిశీలిద్దాం-

సీసం: కమలినీముఖ పద్మకాంతి నివాళింప
నేపారమెత్తిన దీపమనగ
పూర్వపర్వత శిరో భూషావిశేషమై
చెలువారు గైరిక శిలయనంగ
ప్రాచీదిశా వధూఫాల దేశంబున
లలినొప్పుసిందూర తిలకమనగ
జంభారివారణ కుంభ మధ్యంబున
భాసిల్లు జెంగల్వబంతియనగ

తే.గీ మెరసి చీకటి విరియించి మిన్నుముట్టె
చక్రవాకాళి తాపము సంహరించి
యళుల మేల్కొని కొలకుల దెలువులొసగి
తరణి హుదయాద్రి బొడదెంచె దక్షిణంబు

(పద్మ : 1-117)

ఈ పద్యంలో తేలిక పదాలతో పాటుగా 'గైరిక శిల' అంటే బంగారు మేరు పర్వతమని, 'జంభారివారణ' మంటే ఇంద్రుని ఐరావతమని పండితులకు మాత్రమే అర్థమయ్యే పద ప్రయోగాలు చేశాడు. తూర్పున గల పర్వత శిఖారాగ్రముల్ని స్వర్ణ కాంతులతో ప్రవేశింపజేస్తూ ఐరావత కుంభ సమానమైన కొండల మధ్యలో ఎర్ర ఎర్రని చెంగల్వ బంతిలా మెరుస్తూ చీకట్లను పారద్రోలుతూ, సూర్యుడు ఉదయిస్తున్నట్లుగా, చక్రవాక పక్షులకు - పద్మాలకు ప్రీతి కూరుస్తూ తరణి (సూర్యుడు) తరలివస్తున్నాడని మనోహరంగా సూర్యోదయ వర్ణన గావించాడు.

ఆ తర్వాత కావ్యమైన 'భాగవత దశమ స్కంధము'ను పాల్కురికి అడుగు జాడల్లో ద్విపద కావ్యంగా మలిచాడు. దశమ స్కంధము శ్రీ కృష్ణ లీలలకు సంబంధించినది కాబట్టి -ఇతడు హరిభక్తుడు అయినందున ఈ కవి స్కంధము నొక్కటే గ్రహించి 1. కళ్యాణ కాండ 2. మధుర కాండ 3. జగదభి రక్షకాండ అనే రామాయణ కాండములుగా విభజించి రచన చేశాడు. బమ్మెర పోతన్నకు మార్గ దర్శకంగా నిలిచాడు.

ఎర్రన భారతంలో శారదను శారద నీరదగా శ్వేత వస్త్ర ధారిణిగా వర్ణించినట్లు యీ కవి చీకటిని నల్లని ఉపమానాలతో వర్ణించాడు. ఇతని కథా కథన విధానం సూటిగా నన్నయ ప్రసన్న కథా కవితార్థ యుక్తిగా సాగుతుందనడానికి కళ్యాణ కాండలోని యీ ద్విపదను చూపవచ్చు.

నరకాహ్వామందు దానవ కులేశ్వరుడు
పరశక్తి మహిమ దుర్వార సత్త్వమున
ధరణిపై గల తతి నెల్ల నోర్చి

వ్యాసం

తన శాసనంబుల దగ నిల్పియంత
దనివోక యతి బలోదగ్రుడై నడిచి
యమరాధి పుంగెల్చి యగ్నినోడించి
శమనుని గెల్చి రాక్షసు పారద్రోలి..... (కళ్యాణ కాండ)

ప్రాసనియమంతో వరుసగా 3 ఇంద్రగణములు 1 సూర్య గణము కలిగి మొదటి గణములోని ప్రథమాక్షరానికి యతికూర్చడం ద్విపద లక్షణం! ఈ లక్షణాలన్నీ పాటిస్తూనే నరకుని వీరవిహారాన్ని సలక్షణంగా వర్ణించాడీ ద్విపద పాదాల్లో...

అలాగే 'జగదభి రక్షకాండలో
మేలైన కృష్ణుని మే ఛాయలోలె
నెరినొప్పు కాళింది నీరంబువోలె
తరచైన తేటుల దాటులవోలె
పెనుపైన నీలాల పేరులవోలె
లలినొప్పు నీలోత్పలంబులవోలె
దలమారి చీకటి దట్టమైపేర్చె..!'

అంటూ కృష్ణుని మేనిచాయలా- కాళింది మడుగు నీరులా- తుమ్మెదల్లా- నీలాల పేరులా- నల్లని కలువల్లా(నీలోత్పలాలు) నల్లని శిరోజాల కొప్పుల్లా(తురుములు) చీకటి దట్టంగా వ్యాపించినట్లు వర్ణించాడు. అయితే ద్విపదలోని ప్రాసనియమం వీడి కొన్ని పంక్తుల్ని మంజరీ ద్విపదలా మలచి స్వతంత్రించాడు.

సంస్కృత 'యోగ వాసిష్ఠం'ను సింగన 'వాసిష్ఠ రామాయణం'గా రచన చేశాడు. రఘువంశ గురువైన వసిష్ఠుడు శ్రీరామ చంద్రునికి కావించిన ధర్మ ప్రబోధమే యీ ప్రబంధం! 'జగం మిథ్య- ఆత్మ సత్యం' అనే ధర్మ దీక్షా కర్తవ్యంలో దాశరథి కర్తవ్యోన్ముఖుని చేయు సందర్భంలో-

ఉత్ప: చిత్త సమాకులీకరణ శీల మనోహర దైన్య సాధ్యని
స్సత్త మహాభుజంగ కుల సంశ్రయగర్త సమృద్ధ వల్లి దు
ర్వృత్త గృహాంత వాసిని నవీన విలాసిని లక్ష్మి యట్టి సం
పత్తి సమస్త దోహ భవ భావ భయప్రదగాక సౌఖ్యమే?

సకల దుఃఖ హేతువైన సంపదలను - సంసార సౌఖ్యాలను త్యజించి రాజ ధర్మాన్ని పాటించడమే. కర్తవ్య పాలన చేయడమే సర్వోత్కృష్టమని వసిష్ఠుడు ప్రబోధించినట్లుగా ఈ ఉత్పల మాలను సింగన రచించాడు. వేదాంత సార సంగ్రహంగా రూపొందించాడు. మూలంలోని అనేక ఉపకథల్ని స్వీకరించి యుక్తి యుక్తముగా రచించాడు. పోతన్నకు స్ఫూర్తిగా నిలిచాడు.

కవిత

# అక్షరం

అక్షరమా! అక్షరమా!! నీ
లక్షణమది గొప్పదే అక్షరమా!

అజ్ఞానం అంతరించి
విజ్ఞానం వికసించుచు
సృష్టినంత సుట్టేవు అక్షరమా!
నీ ప్రజ్ఞ ఎంత గొప్పదే అక్షరమా

అక్షరాలు జతగూడిన పురుడు పోయు పదములు
పదముల పాదాలే పాటలై పారును యేరులై పొంగును
పొంగేటి పొంగునని అక్షరమది తెల్పును అక్షరమా?
నీ వెంత గొప్ప దానివే అక్షరమా

జంగమాల జాతకాలు
తిర్యక్కుల తిప్పలంత
స్థావరముల అస్తిత్వం తెలుపునంత అక్షరమా!
నీ ఉనికి ఎంత గొప్పదే అక్షరమా

అణువణువున నీవుందువు
అంతరిక్షమందున్నవి అక్షరమై కనుగొందువు
శాస్త్రమందు నేత్రమై సూత్రముగ నీవుందువు అక్షరమా!
నీ యుక్తి నెవరెరుగుదురే అక్షరమా

నీవు లేక పలుకు లేదు
పలుకు లేక పిలుపు లేదు
పలుకులోన మెలికలను అక్షరమై తెల్పుదువు అక్షరమా!
నీ ప్రజ్ఞ ఎంత గొప్పదే అక్షరమా

సమరంతో పనిలేదు
తిమిరానికి తావులేదు
సాటిరారు పోటిలేదు అక్షరమా
నీ పోటియందెవరుందురు అక్షరమా
నీ శక్తికెదురు లేదులే అక్షరమా!



చెన్న మాధవుడు

# నాటి తెలంగాణ కథల్లో సాంఘిక పరిస్థితి

**సమాజం 1930 నుండి 1940**

**నాటి తెలంగాణ కథావికాసంలో చోటు చేసుకున్న సమాంతర సామాజిక పరిస్థితుల విశ్లేషణ...**



డా॥ కాంచనపల్లి గోరా

తెలంగాణ కథా రచయితల్లో ఈ కాలం వచ్చేసరికి భాషా విషయంగా కొంత మార్పు వచ్చింది. గ్రాంధిక వాసనలు సడలి పోయి వ్యవహార భాషాప్రయోగం మొదలైంది. తెలంగాణ క్రియాపదాలు, నుడికారం వాడకం మొదలైంది. కాగా తెలంగాణ భాషకు మాండలిక పరిధిని విధించిన కుట్ర ఇంకా మొదలు కాలేదు. కేవలం సమాజంలోని విషయాలు ఉన్నదున్నట్లు రాయడమే కాక కొంత వర్గ దృక్పథం ప్రవేశించిందీ కాలంలో. కథలలో పద్యాలు రాసే పద్ధతి దాదాపుగా తొలగిపోయింది.

1894 -1979 మధ్య కాలంలో జీవించిన చలం ప్రసక్తి అక్కడక్కడా కనిపిస్తుంది. అయినా ఇక్కడి స్థానీయత ప్రకారమే ఈ కథలు నడిచినవి కాని ఎవరి ప్రభావం ఉందని ఇదమిత్థంగా తేల్చలేము.

1910 నుండి గిడుగు రామ్మూర్తి ప్రతిపాదించిన భాషోద్యమ ప్రభావం అక్కడక్కడా కనబడుతుంది.

దానితో పాటు ఈ కథలలో తెలంగాణ భాష వాడడం కనిపిస్తుంది.

గడుపుతుంండ్రి, సాగించిండు, మిడ్క, మనిషి కావాలె, బొర్రలు సవురు కుంటూ, (కోవిల్లో) భోసిడి, ఇగరా, ఇస్పేటు, (గప్ చుప్) లాంటి పదాల వాడకం ఉంది.

ఈ కాలపరిమితిలోని నందగిరి వెంకటరావు ప్రతి ఫలం (1934), అందుగుల తిరుమలరావు నిష్ఫల (1940) మరియు చారిత్రిక కథా కాలం నాటివి. ప్రతిఫలం కథలో చారిత్రిక స్పృహ కనబడుతుంది. నిష్ఫలం కథలో చారిత్రిక వ్యక్తులను పేర్కొనడమే ఉంది కాని చారిత్రిక సంఘటనలు కనిపించవు. ఒక వీరుడు తన విజయానికి ప్రపంచ మంతా ప్రశంసిస్తుంటే భార్య దగ్గర కూడా ఆ మెప్పు ఆశిస్తాడు. కాని భార్య నిర్లిప్తత అతన్ని నిరాశ పరుస్తుంది. మానవ సంబంధాలలో ఉండే సహజానుభూతులు ఇందులో కనబడుతాయి. రెండు కథల్లోనూ రాజరిక వ్యవస్థలోని యుద్ధాలు సైనిక మనస్తత్వాలు కనబడుతాయి.

"ప్రతిఫలం" కథలో నాటి యుద్ధాలలో జరిగే మోసాలు చూస్తాం, విద్యానాథ పండితుడు తానీషాను మోసగించి ఔరంగజేబు క్రౌర్యానికి బలౌతాడు. నాటి యుద్ధాలలోని క్రౌర్యం యుద్ధం రావడం వల్ల జరిగే విషాదాలు, ఈ కథ చిత్రించింది.

వెట్టి మాదిగ భాగ్యరెడ్డి వర్మ (1932), గరీబోన్ని ఎం.బి. సీతారామారావు (1939), సంఘాల పంతులు సురవరం ప్రతాప రెడ్డి (1940) లాంటి కథలలో, నాటి గ్రామంలోని పెత్తందారి వ్యవస్థ కనబడుతుంది. వెట్టి మాదిగలో పటేల్ గిరి చేసిన దౌర్జన్యం, దళితుని దైన్య పరిస్థితి చిత్రించారు. కథలో నిష్కారణంగా దెబ్బలు తిన్న మాదిగ మల్లు నాటి గ్రామ వ్యవస్థలోని దైన్యతకు నిలువెత్తు ప్రతీక. పటేల్ రామిరెడ్డి అహంకారం నాటి పాలకులు పెంచి పోషించిన క్షీణ విలువలకు నిదర్శనం. పటేల్ చెప్పిన పనిని వాయిదా వేయడమే మాదిగ మల్లు చేసిన మహా దోషం. అట్లాగే "గప్ చుప్" కథ కూడా అట్లాంటిదే. వెంకయ్య అనే శ్రామిక జీవి కథ ఇది. వెంకయ్య నడుముకు రుమాలు బిగించి పొలంలో పని చేస్తుంటే గట్టు మీద కూర్చొని యజమాని సంతోష పడ్డాడు. అట్లాంటి చలమా రెడ్డి ఇప్పుడు వెంకయ్య మంచాన పడితే "పో, నన్నేమంటావ్," అన్నాడు.

వెంకయ్య భార్య రామి ఏడుస్తూ ఆకలి తట్టుకోలేక చీర కొంగును బిగ్గరగా నడుముకు చుట్టింది. పిల్లలు ఏడ్చి ఏడ్చి సొమ్మసిల్లి పడి ఉన్నారు. వెంకయ్యకు జ్వరం తీవ్రంగా ఉంది. మూల్గుతున్నాడు. మూడు రోజులనుండి నోట్లోకి ఇంత అంబలైనా లేదు. రామి భరించలేక ఇస్పేటు ఆటలో ఉన్న చల్మారెడ్డి దగ్గరికి వెళ్లి అభ్యర్తిస్తుంది. చల్మారెడ్డి విసుగుతో, కోపంతో, చెప్పును రామి పైకి విసురుతాడు.

స మా జ ం

**"ప్రతిఫలం" కథలో నాటి యుద్ధాలలో జరిగే మోసాలు చూస్తాం, విధ్యానాథ పండితుడు తానీషాను మోసగించి ఔరంగజేబు క్రౌర్యానికి బలౌతాడు. నాటి యుద్ధాలలోని క్రౌర్యం యుద్ధం రావడం వల్ల జరిగే విషాదాలు, ఈ కథ చిత్రించింది. వెట్టి మాదిగ భాగ్యరెడ్డి వర్మ (1932), గరీబోన్ని ఎం.బి. సీతా రామారావు (1939), సంఘాల పంతులు సురవరం ప్రతాప్ రెడ్డి (1940), లాంటి కథలలో, నాటి గ్రామంలోని పెత్తందారి వ్యవస్థ కనబడుతుంది. వెట్టి మాదిగలో పటేల్ గిరి చేసిన దౌర్జన్యం, దళితుని దైన్య పరిస్థితి చిత్రించారు. కథలో నిష్కారణంగా దెబ్బలు తిన్న మాదిగ మల్లు నాటి గ్రామ వ్యవస్థలోని దైన్యతకు నిలువెత్తు ప్రతీక.**

సమాజానికి ఈ గొడవ అవసరం లేనట్టు 'గప్ చుప్'గా ఉంటుంది.

ఇక సురవరం ప్రతాప రెడ్డి "సంఘాల పంతులు" కథ కొంచెం భిన్నంగా ఉంటుంది. అంగ్రేజీ ఇలాకాలో జనులు సుఖంగా ఉంటె నిజాం ఇలాకా రామసాగరంలో జనులు పోలీసుల దౌర్జన్యాల వల్ల, కష్టాలు పడతారు. సంఘాల పంతులు వల్ల ఊరిలో సంఘాలు ఏర్పడి దౌర్జన్యం ఎదిరిస్తారు. చివరికి అసలైన ఖానూన్ అమలులోకి వచ్చి, దౌర్జన్యం చేసిన అధికారులు మోతల్ (సస్పెండ్) తనుజ్జుల్ (డిగ్రేడ్) అవుతారు. చరుకు పల్లి రఘోత్తమ రావు 'కోవిల్లో" (1940) కథ కూడా పెత్తందార్ల అహంకారాన్ని చిత్రించిన కథ. దొర, పటేల్, కరణం, లాంటి వాళ్ళ కోసం పూజా కార్యక్రమం కూడా ఎట్లా నిరీక్షణకు గురౌతుందో తెలిపే కథ ఇది.

ఇంకా "సుగుణా ఈ పొరపాటు నాదే", (1934) జే. వనాంబ, "టాకీలో సమావేశాలు", (1940) గుండవరపు హనుమంత రావు, "ఈ రాధేనా" (1938) ఎల్లా ప్రెగడ సీతాకుమారి, తిరుగు బాటు (1940) వి.ఆర్. అవధాని. లాంటి కథలన్నీ స్త్రీ దృక్పథం కలిగిన కథలే. కనీసం స్త్రీ చుట్టూ తిరిగే కథలు. నేడు విస్తృతి చెందిన స్త్రీ వాదానికి ప్రాతిపదిక కొంత వరకు ఈ కథల్లో చూపిన దృక్పథం కూడా.

'సుగుణా ఈ పొరపాటు నాదే' అన్న కథ స్త్రీ పురుష సంబంధాలను అపార్థం చేసుకున్న ప్రేమికుని కథ. తనకు ప్రేయసికి అపార్థాన్ని సృష్టించడానికి ఒక కపట స్నేహితుడు ఆడిన నాటకం తెలిసికొని, తన ప్రేమికురాలి స్వచ్ఛతను గుర్తించి పశ్చాత్తాప పడుతాడు. "టాకీలో సమావేశము" కథలో స్టార్ థియేటర్‌లో జెవానీ కీ రాత్ సినిమా చూడడానికి రూపాయి పావలా టికెట్టు కొని కథా నాయకుడు లోపలికెడతాడు. రూపాయి పావలా అంటే ఆ రోజుల్లో చాలా ఎక్కువ అన్నమాట. మిగతా తరగతుల్లో చాలా రద్దీ ఉండడం వల్ల అతడు ఎక్కువ ధర టికెట్ కొనుక్కుంటాడు. అక్కడ పరిచయమైన స్త్రీతో ప్రేమలో పడతాడు. ఆమె వేశ్యా వాటికకు చెందినదైనా స్వచ్ఛమైనదని తెలుసుకొంటాడు. ఆమె తానున్న జీవితం పైన అసహ్యపడి బయటకు రావాలని కోరుకుంటుంది. తను వివాహిత కావడానికి ఉబలాట పడుతుంది. చివరికి ఆమెను అక్కడనుండి తీసుకెళ్ళి బ్రహ్మ సమాజ పద్ధతిలో వివాహం చేసుకునే ప్రణాళిక వేస్తాడు మాధవ రావు.

అట్లాగే 'ఈ రాధేనా' కాల్పనిక వాసనలున్న కథ. భావుకతతో కొనసాగుతుంది. తన మరదలు రాధ పైన అయిష్టంగా ఉన్న బావ రాజాను ఆ అమ్మాయి ఏమీ తెలియనట్టు వచ్చి మరో వ్యక్తి గా అతన్ని ట్రాప్ చేస్తుంది. రాజా కలలన్నిటికీ ఆమె సరిపోక పోయినా చివరికి ఆమె అంటే ఇష్టపడే స్థితి వస్తుంది. తన ప్రేమ వ్యక్తం చేశాక ఆమె తన మరదలే అని తెలిసి ఆశ్చర్యపోతాడు రాజా. నాటి సమాజం లో కన్నె పిల్లల కథలు యువకుల భావ ప్రపంచం రచయిత్రి చక్కగా చిత్రించారు. వ్యావహారిక భాషా వినిమయం చక్కగా కొనసాగుతుంది. షాద్ నగర్ లోని ప్రకృతీ సౌందర్యం చక్కగా వర్ణించబడింది.

ఇక "తిరుగుబాటు" అనే మరో కథలో తనను అణచి వేసే పురుష సమాజం పైన స్త్రీ తిరుగుబాటు వైనం చిత్రిస్తుంది.

సరోజినీ అనే స్త్రీని భర్త వదలి పెట్టి మరో పెళ్లి చేసుకుంటాడు. ఆమె స్వయం కృషితో లా చదువుతుంది. తనను వదలిపెట్టిన భర్త కూడా ప్లీడరే. ఆయన ముందే నిలుచొని లాయర్‌గా సవాల్ చేస్తుంది.

ఆమె కోర్టులో సహేతుకంగా వాదిస్తే జడ్జి సానుకూలంగా వింటాడు. ఈ విషయమే సహన్యాయవాదులు హైకోర్ట్ లైబ్రరీలో చర్చిస్తారు. అట్లాగే మొగాడు లేకుండా మాతృత్వం పొందిన మరో

**ఇక ఈ కాలంలో వచ్చిన "మా బావ" (1940) అవురువల్లి కృష్ణా రావు కథ, అట్లనే "పల్లెబడి" (1940) చరుకు పల్లి హరికృష్ణ రావు కథ ప్రత్యేకంగా పేర్కొనదగినవి. మా బావ కథలో ఒక స్థిరత్వం లేని వ్యక్తి నిర్ణయాలు ఎట్లా ఇబ్బంది పెడతాయో చెబుతుంది. అట్లాగే "పల్లె బడి" కథలో ఆనాటి బడుల స్వరూపం తెలుస్తుంది. ఈ కథలో దస్త్రాలు, పోయిండ్రు, బడి పెంబ (మానీటర్) శవ ధూమ్ (బాగా అల్లరి) లాంటి పదాలు నాటి తెలంగాణ భాషా నైపుణ్యాన్ని తెలుపడానికి ఉపయోగపడేవి. పిల్లల అల్లరి, వాళ్ళను బాదడం, కోదండం ఎక్కించడం, స్వయంగా తలిదండ్రులే పిల్లలని శిక్షించమని కోరడం ఇవన్నీ ఖానిగీ, బడి పద్ధతులు.**



అమ్మాయిని సరోజిని చేరదీయడం గురించి క్లబ్బులో చిత్రిస్తారు.

సీను ప్రభాతం పత్రికా కార్యాలయానికి మారితే తరువాత తెలుస్తుంది. సరోజినీ దేవి ఎం.ఎ.ఎల్.ఎల్.బి. గారు ఓ ఆశ్రమం స్థాపిస్తారు. దాన్ని గురించి పత్రికలో ప్రచురించే చర్చ అక్కడ జరుగుతుంది.

సరోజిని పెట్టిన ఆశ్రమంలో వృత్తి విద్యలు నేర్పిస్తారు. వృత్తి విద్యలు నేర్చుకొన్నవారు పెండ్లి చేసుకోవాలను కుంటే పెండ్లి కూడా చేస్తారు. ఈ విషయాలన్నీ తెలిసికొని ఈ వరకు విమర్శించిన వాళ్ళు, ఎగతాళి చేసిన వాళ్ళు కూడా చందాలు ఇవ్వడానికి ముందుకు రావడం ఇందులో ట్విస్ట్, ఈ కథ లో సాశ్చర్యం అని అరుదైన పదం వాడారు. కొన్ని దృశ్యాలుగా విభజించి కొంత నాటకీయతతో వస్తువును పరిచయం చేస్తారు.

ఇక ఈ కాలంలో వచ్చిన "మా బావ" (1940) అవురువల్లి కృష్ణా రావు కథ, అట్లనే "పల్లెబడి" (1940) చరుకు పల్లి హరికృష్ణ రావు కథ ప్రత్యేకంగా పేర్కొనదగినవి. మా బావ కథ, ఒక స్థిరత్వం లేని వ్యక్తి నిర్ణయాలు ఎట్లా ఇబ్బంది పెడతాయో చెబుతుంది. అట్లాగే "పల్లె బడి" కథలో ఆనాటి బడుల స్వరూపం తెలుస్తుంది. ఈ కథలో దస్త్రాలు, పోయింద్రు, బడి పెంబ (మానీటర్) శవ ధూమ్ (బాగా అల్లరి) లాంటి పదాలు నాటి తెలంగాణ భాషా నైపుణ్యాన్ని తెలుపడానికి ఉపయోగపడేవి. పిల్లల అల్లరి, వాళ్ళను బాదడం, కోదండం ఎక్కించడం, స్వయంగా తలిదండ్రులే పిల్లలని శిక్షించమని కోరడం ఇవన్నీ ఖానిగిబడి పద్ధతులు.

బడి పొద్దటి నుండి రాత్రి వరకు కొనసాగేది. పొద్దున్న దూపకు విడువడం, మధ్యహ్నం అన్నానికి విడువడం, తరువాత దీపం ముట్టించాక "దీపం పరబ్రహ్మం" అని శ్లోకం చదువుతూ, ప్రార్థన చేయడం ఆనవాయితీ. దీనితో బడి ముగిసేది.

పిల్లలంతా దండం పంతులూ అని చెప్పి పలకలు చంక పెట్టుకొని, భుజం మీద తట్టు గుడ్డలు, చాపచింపు లేసుకొని, ఒక్కొక్కరు తమ ఇండ్లకు ఉరికేవారు.

కథలన్నింటిలోనూ అన్యాపదేశంగానే తెలంగాణా జీవన శైలి కనబడుతుంది. నాటి గ్రామీణ సంస్కృతి సహజమైన ప్రేమలు, అదే విధంగా నాటి పట్టణాలు, వాటిలోని సామాజిక స్పృహ, నాటి వ్యక్తి వైరుధ్యాలు, విభిన్న కోణాలకు ఈ కథలు అద్దం పడుతాయి. తెలంగాణా ఆత్మ గౌరవాన్ని ప్రకటించుకొన్న సందర్భంలో ఈ కథల సేకరణ జరగడం ప్రశంసనీయం. ముదిగంటి సుజాతా రెడ్డి, సంగిశెట్టి శ్రీనివాస్‌ల కృషి తెలంగాణ సాహితీలోకానికి శాశ్వత స్మరణీయం.

**బడి పొద్దటినుండి రాత్రి వరకు కొనసాగేది. పొద్దున్న దూపకు విడువడం, మధ్యాన్నం అన్నానికి విడువడం, తరువాత దీపం ముట్టించాక "దీపం పరబ్రహ్మం" అని శ్లోకం చదువుతూ, ప్రార్థన చేయడం ఆనవాయితీ. దీనితో బడి ముగిసేది.**

**పిల్లలంతా దండం పంతులూ అని చెప్పి పలకలు చంక పెట్టుకొని, భుజం మీద తట్టు గుడ్డలు, చాపచింపు లేసుకొని, ఒక్కొక్కరు తమ ఇండ్లకు ఉరికేవారు. కథలన్నింటిలోనూ అన్యాపదేశంగానే తెలంగాణా జీవన శైలి కనబడుతుంది. నాటి గ్రామీణ సంస్కృతి సహజమైన ప్రేమలు, అదే విధంగా నాటి పట్టణాలు, వాటి లోని సామాజిక స్పృహ, నాటి వ్యక్తి వైరుధ్యాలు, విభిన్న కోణాలకు ఈ కథలు అద్దం పడుతాయి.**




దర్శకుడు: **వికాస్ భా**, భాష: **హిందీ**

చివరి నిమిషంలో తన పెళ్లి ఆగిపోవడంతో ఒంటరిగా యూరోప్ వెళ్లి, తిరిగి సంతోషాన్ని సంపాదించిన ఒక ఢిల్లీ యువతి కథ నేపథ్యంగా రూపొందిన సినిమా క్వీన్. ఢిల్లీలో ఉండే రాణి మెహ్రా అనే పంజాబి యువతి పాత్రలో కంగనా రనౌత్ నటించింది. రాణి అందం, అమాయకత్వం, తెలివితో పాటు, భయస్తురాలుగా ఉంటుంది. రాణి జీవితంలోకి విజయ్ (రాజ్ కుమార్) అనే యువకుడు ప్రవేశించి, పెళ్లి ప్రతిపాదన తీసుకొచ్చి, రాణిని ఒప్పిస్తాడు. రాణి పెళ్లికి ఒప్పుకుంటుంది. అనంతరం విజయ్ కొన్ని నెలలు విదేశాల్లో ఉంటాడు. అనంతరం ఇండియాకు వచ్చిన విజయ్, పెళ్లికి ఒక రోజు ముందు, రాణిని పెళ్లి చేసుకోనంటూ, వివాహాన్ని రద్దు చేస్తాడు. విదేశాల్లో తన లైఫ్ స్టైల్ పూర్తిగా మారిందని, నాకు రాణి సరిపోదంటూ కారణం చెప్తాడు విజయ్. షాక్ నుండి తేరుకోవడానికి, హనీమూన్ కోసం బుక్ చేసుకున్న విమాన టికెట్లతో రాణి పారిస్, ఆమ్ స్టర్ డామ్ వెళ్తుంది. కొన్ని రోజులు విదేశాల్లో ఉన్న రాణి ఎలాంటి జీవితాన్ని అనుభవించింది. అక్కడ ఏర్పడ్డ పరిచయాలు, మిత్రులు రాణి జీవితంలో ఎలాంటి మార్పు తీసుకొచ్చారు..? రాణి విదేశాల్లో ఉండగా, విజయ్ మనసు ఎలా మారింది.. ? చివరకు రాణి, విజయ్‌లు ఎలా వివాహం చేసుకున్నారు అనే అంశాలను దర్శకుడు ఆసక్తిరంగా తెరకెక్కించాడు. విదేశాలకు వెళ్లిన రాణి, తనేంటో తెలుసుకునే సన్నివేశాలు, తను ఎలా బతకాలో నేర్చుకునే సంఘటలను ప్రేక్షకులను ఆకట్టుకునేలా తెరకెక్కించాడు దర్శకుడు వికాస్ భా. మహిళల మనస్సులను అర్థం చేసు కోకుండా ఏకపక్షంగా వ్యవహరించి, అనంతరం తన తప్పును తెలుసుకున్న విజయ్ పాత్ర సందేశాత్మకంగా ఉంటుంది. కంగనా రనౌత్, రాజ్ కుమార్ ఆద్యంతం తమ పాత్రల్లో ఒదిగిపోయారు.

# బర్డ్ మ్యాన్

దర్శకుడు: **అలెజాండ్రో గోంజాలెజ్ ఇన్యారీటూ** భాష: **ఇంగ్లీషు**

బర్డ్‌మ్యాన్ పాత్రను పోషించి దాని మీద విసుగొచ్చి రచన, దర్శకత్వం వైపు మరలడానికి ప్రయత్నించే ఓ నటుడి పాత్రతో రూపొందిన చిత్రం 'బర్డ్‌మ్యాన్' (ది అన్ ఎక్స్‌పెక్టెడ్ వర్చ్యూ ఆఫ్ ఇగ్నోరెన్స్). అనేక చిత్రాల్లో సూపర్‌హీరో 'బర్డ్‌మ్యాన్'గా పాత్రపోషణ చేసి సుపరిచితుడై, తెర మరుగైన రిగ్గన్ థామ్సన్ అనే హాలీవుడ్ నటుడి పాత్ర నేపథ్యంలో బర్డ్‌మ్యాన్ చిత్రాన్ని తెరకెక్కించాడు దర్శకుడు అలెజాండ్రో గోంజాలెజ్ ఇన్యారీటూ. తను అనుకున్నది సాధించడానికి దేనికైనా సిద్ధపడే రిగ్గన్ థామ్సన్ పాత్రలో మైఖేల్ కీటన్ కనిపిస్తాడు.

20 ఏళ్ళ క్రితం వచ్చిన 'బర్డ్‌మ్యాన్' చిత్రంతో సూపర్ హీరోగా పాపులర్ అవుతారు రిగ్గన్ థామ్సన్. కాని అది గతం. ఇప్పటి జనాలకు పెద్దగా తెలియదు. మధ్య వయస్సుకు వచ్చిన రిగ్గన్ ఇప్పుడు నటుడిగా స్థిరపడాలనుకుంటాడు. రైటర్‌గా, దర్శకుడిగా, నటుడిగా తనేంటో నిరూపించుకోవాలనుకుంటాడు. అతని స్నేహితుడు జాక్ ద్వారా ఇదంతా సులభం అవుతుందనుకుంటుంటాడు. వీళ్ళిద్దరు కలిసి 'రేమాండ్ కార్వర్' స్టోరీ ఆధారంగా సినిమా చేయాలని ప్లాన్ చేస్తారు. సినిమా చేయడం కోసం ఏమైనా చేయడానికి సిద్ధపడతారు. అందుకు కష్టపడి సంపాదించి కూడబెట్టుకున్న డబ్బును, తన లైఫ్‌ను రిస్క్‌లో పెట్టి మరి సినిమా నిర్మిం చాలనుకుంటాడు రిగ్గన్. ఎలాగైనా ఈ చిత్రాన్ని సక్సెస్ చేసి తీరాలనేది అతని తాపత్రయం. ఈ ప్రయత్నంలో చోటు చేసుకున్న హాస్యభరిత సన్నివేశాల సమాహారమే ఈ చిత్రం. కామెడీ డ్రామాగా విమర్శకుల ప్రశంసలు సైతం అందుకుంది.




ఒక వ్యక్తిలోని పట్టుదలను, అదే సందర్భంలో ఏదైనా చేయడానికి తెగించే సన్నివేశాలు దర్శకుడి ప్రతిభకు అద్దం పడతాయి. మంచి సందేశానికి కామెడీని జోడించి దర్శకుడు తెరకెక్కించిన విధానం ప్రపంచ ప్రేక్షకులకి కనెక్ట్ అయ్యేలా చేసింది. అద్భుతమైన స్క్రీన్‌ప్లేతో ప్రతి సీన్‌ని కొత్త అనుభూతిని పొందేలా చేస్తుంది. విజువల్‌గా ఒక కొత్త లోకంలోకి తీసు కెళ్తుంది చిత్రం.

పుస్తక పరిచయం

# పల్లె గుండె లోపలి నిశ్శబ్ద ధ్వనులు

**పల్లె వాతావరణంలోని వివిధ కోణాలను చూపించిన కథలపై విశ్లేషణ...**



కూర చిదంబరం

భావ వ్యక్తీకరణకు చిత్రపటం ఒక గొప్ప సాధనం. కుంచె, రంగులు, ఈజిల్, స్టాండ్‌లాంటి పరికరాలతో చిత్రకారుడు ఎక్కడో హిమాలయాల్లాంటి ప్రాంతాలకు వెళ్లి అక్కడి ప్రకృతితో మమేకమై 'చిత్రరచన' కావిస్తాడు.

చేయి తిరిగిన అక్షర శిల్పి డా. వెల్దండి శ్రీధర్‌కు అక్షరాలు చాలు. అక్షరంతోనే ఆయన ఆర్తి, ఆర్ద్రత, ఆవేదన, సంవేదనల్ని పాఠకుల గుండె లోతుల్లోకి చొచ్చుకుపోయేలా అక్ష(య)ర చిత్రాలు సృష్టిస్తాడు. అందుకు నిదర్శనం శ్రీధర్ ఇటీవల వెలువరించిన 'పుంజీతం' కథల సంపుటి. ఇందులోని పాత్రలు కథ ముగిసిన తరువాత కూడా పాఠకుడిని వదలవు. చాలా సేపటి వరకు మనోఫలకం మీద కదలాడుతూ వెంటాడి వేధిస్తాయి. ఒక రకమైన 'ట్రాన్స్'కు గురిచేస్తాయి. నిజానికి ప్రతి రచయిత కోరుకునేది ఇదే. ఒక 'గాలివాన', ఒక 'వడ్లగింజ'లా పాఠకులను ఒక సున్నితమైన బాధకు గురిచేసి అలా ఉండి పోవాలని అనుకుంటాడు.

శ్రీధర్ సాధించింది ఇదే! ఆయన కథలు నాలుగు కాలాలపాటు నిలుస్తాయి. కథల్లో కనిపించే పాత్రల మీద, సృష్టించిన ఆ పరిసరాల మీద బోలెడు సానుభూతిని ప్రకటించేలా చేస్తాయి. నిజాన్ని కళ్లెదుటే నిలబెట్టి నిలదీస్తాయి.

ఎకరాల్లో తాను అమ్ముకున్న ధరకే గజాల మేర కొనుక్కోవలసి రావటం




ప్రకాశ్ సార్ కొడుకు జీవాకే కాదు పాఠకుడి గుండె కూడా చెరువవుతుంది. అంశ్చేతన బాహ్య చేతనలుడిగిన తనను చుట్టుకుని, నెమ్మదిగా కబళిస్తోన్న కొండలాంటి కొండ చిలువ కడుపులోకి లాక్కోబడుతున్న అమాయకపు జింకపిల్ల గుర్తుకు వస్తుంది 'పుంజీతం' కథలో.

తెలంగాణ జానపదుల్లో 'పుంజీతం' అనే ఒక ఆట ఉంటుంది. ఇందులో ఒక పులి కొన్ని మేకలు పావులు. ఆడేవారి నైపుణ్యాన్ని అనుసరించి పులి మేకల్ని తినొచ్చు. లేదా మేకలే పులిని కట్టడి చేయవచ్చు. అది ఆడేవారి ప్రావీణ్యాన్ని బట్టి ఉంటుంది. కాని అదేం దౌర్భాగ్యమో శ్రీధర్ ఈ కథల్లో ఎప్పుడూ అమాయకపు మేకలే పులికి బలి అవుతూ ఉంటాయి. రాంమనోహర్ లాంటి పులి మేకల్ని చిత్తుచేసి ఒక్కొక్క మేకనే బ్రోచర్ల అరచేతి వైకుంఠాన్ని చూపి లాక్కుంటాయి. చివరకు తనకు సహకరించిన సర్పంచ్ జయరాం మామను కూడా ఈ కార్పోరేట్ పులి వదలదు. "మనుషుల్లేని మట్టికి నేను సర్పంచునైతేంది? కాకుంటేంది? పులులన్నీ ఎగబడ్డంక మేకలేడ బతుకుతయి? గద్దలన్నీ వాలినంక

కోడిపిల్లలేడ బతికి బట్టకడుతయి?" అన్న నిర్వేదానికి గురిచేసి ఊరు విడిచేలా చేస్తుంది.

పట్టణీకరణ, ప్రపంచీకరణ నేపథ్యంలో భూమి, మనుషులు, మనసులు, అనుబంధాలు అన్నీ పుంజీతం ఆటలోని మేకల్లా ఒక్కొక్కటే కబళించబడుతూ అంతిమ విజయం ఎప్పుడూ కోరలు సాచిన పులిదే అన్న కర్కశపు నిజాన్ని పాఠకుల గుండెల్లో చాకులా గుచ్చుకు పోయేలా రాస్తాడు శ్రీధర్.

కథా సంపుటికిచ్చిన టైటిల్‌తోనే తన ప్రతిభను ప్రకటించేస్తూ కథలన్నింటా ఆర్ద్రత అంతఃస్సూత్రమై నిలిచి ఆకట్టు కుంటాయి. పైన చెప్పిన చిత్రకారుడి పాత్ర పోషిస్తూ ఊరి వర్ణన.. "మా ఊరంటే వెన్నెల కోన, ఆత్మీయతల నిండు కుండ, ఆప్యాయతల పొదరిల్లు, అనురాగాల సందడి, పచ్చదనపు లోగిలి, చెరువు కింది మడి" 1950-1960ల నాటి పల్లెల్ని ఎంత బాగా చెప్పాడో!

అరవైలో అడుగు పెట్టిన ప్రతి పల్లీయుని గుండెల్లో (మాత్రమే) నిలిచిపోయే ఒకప్పటి పల్లె చిత్రం. ఉగాది నాటి వేపచెట్టు గాలిలా, కొత్తకుండలో వండిన పరమాన్నాన్ని గుర్తుకు తెచ్చే వర్ణన. ఇట్లాంటిదే మూసీ వర్ణన. కథ, కథనం, శిల్పం... అన్నింటా అందెవేసిన చేయి శ్రీధర్‌ది.

**తెలంగాణ జానపదుల్లో 'పుంజీతం' అనే ఒక ఆట ఉంటుంది. ఇందులో ఒక పులి కొన్ని మేకలు పావులు. ఆడేవారి నైపుణ్యాన్ని అనుసరించి పులి మేకల్ని తినొచ్చు. లేదా మేకలే పులిని కట్టడి చేయవచ్చు. అది ఆడేవారి ప్రావీణ్యాన్ని బట్టి ఉంటుంది. కాని అదేం దౌర్భాగ్యమో శ్రీధర్ ఈ కథల్లో ఎప్పుడూ అమాయకపు మేకలే పులికి బలి అవుతూ ఉంటాయి. రామనోహర్‌లాంటి పులి మేకల్ని చిత్తుచేసి ఒక్కొక్క మేకనే బ్రోచర్ల అరచేతి వైకుంఠాన్ని చూపి లాక్కుంటాయి. చివరకు తనకు సహకరించిన సర్పంచ్ జయరాం మామను కూడా ఈ కార్పోరేట్ పులి వదలదు.**

ఎత్తుగడ.. మిట్టమధ్యాహ్నం ఎండ వెండిలా మెరిసిపోతూ ముట్టుకుంటే కాలిపోతోందట. ముందు చూడబోయే చిత్రానికి ఈ మొదటి వాక్యం నాంది ప్రస్తావన. కథ ఎత్తుగడ నుంచి చివరి వాక్యం వరకూ ప్రతి అక్షరంలోనూ, ప్రతి పదంలోనూ, వాక్యంలోనూ ప్రతిభ పొదువుకున్న కథలు.

ప్రతి కథలోనూ ఎండతో ఆడుకున్న తీరు వెన్నెల్ని విరబూయించిన తీరు 'వాహ్' అనిపిస్తుంది. ఆర్ద్రతే కాదు పాఠకుడి పెదాల మీద మొలక నవ్వు పూయించగలడు శ్రీధర్.

"ఏమాయెనో పిల్లా! ఈ యేడు లగ్గం జేసుకుంటవా లేదా...?".

"అయ్యో! నా లగ్గం గురించి నీకే తొందరున్నట్లుంది తాతా! కొన్నేండ్లాగి పుట్టద్దా నిన్నే చేసుకుందును".

పల్లె నేపథ్యం ప్రతి చదువరి గుండెల్లో జ్ఞాపకాల గులాబులు పూయించే వాక్యాలు. ఆనాటి సరదాలు, సరసాలు, ఏమాయెనో... గడుసు జవాబుల భాగ్యలక్ష్ములు ఏరీ ఇప్పుడు?

కథల నిండా పల్లె పరిమళాల గుబాళింపు. "చేత్తె ఆరు దండుగ, చేయకుంటే మూడు దండుగ. పేదోళ్లను జూత్తే అందర్కి ఎచ్చిర్కే, ఉప్పుదింటే ఊష్ణం, పప్పుతింటే పైత్యం, ఏమాయెనయ్యా.. లెవ్వేమయ్యా (భర్తను పిలవడం) మా సాలు తియ్యి, నీళ్ల దంగిపోవటం, సారభాలీనె అక్షర పుష్పాలు.

పాత్రలకు అదనపు చేతులు, కాళ్ళు, రెక్కలు, తలలు మొలిపించే మేజిక్ రియలిజం కాదు. ఎడారిలో పూలు పూయించటం కాదు. చీకట్లో చుక్కలు చూయించటం కాదు.

గ్రామీణ జీవన సంవేదనల్ని చిత్రించిన కథలు. అక్షయమై, అక్షరమై సృష్టించిన పాత్రలు, పరిసరాలు, పరిస్థితులు



**కథా సంపుటికిచ్చిన టైటిల్‌తోనే తన ప్రతిభను ప్రకటించేస్తూ కథలన్నింటా ఆర్ద్రత అంతఃస్సూత్రమై నిలిచి ఆకట్టు కుంటాయి. పైన చెప్పిన చిత్రకారుడి పాత్ర పోషిస్తూ ఊరి వర్ణన.. "మా ఊరంటే వెన్నెల కోన, ఆత్మీయతల నిండు కుండ, ఆప్యాయతల పొదరిల్లు, అనురాగాల సందడి, పచ్చదనపు లోగిలి, చెరువు కింది మడి" 1950-1960ల నాటి పల్లెల్ని ఎంత బాగా చెప్పాడో!**

నాలుగు కాలాల పాటు నిలిచే కథలు. పల్లెపట్టుల (ఒకటి, రెండు తప్ప) సారభాన్ని, గడ్డిపూల పరిమళాన్ని అద్దుకుని వెచ్చగా తాకే కథలు. ఒక్కోసారి ఆ వెచ్చదనం పాత్రల్ని కాల్చేసే చురుకు కూడా కనిపించే కథలు. నిజాన్ని నిర్భీతిగా చిత్రికపట్టిన కథలు. సమాజాన్ని, కుసంస్కృతిని అభివృద్ధి అనే పేరుతో మధ్యపెట్టుకుంటున్న విషనాగుల ప్రశ్నించే కథలు.

శ్రీధర్ వీటన్నింటినీ ఊహల కత్తుల్తో ఛేదించి అదుగో నవలోకం అంటూ మన నెక్కడికో తీసుకుపోలేదు. నిజాన్ని కళ్లముందు నిలబెట్టి నువ్వే నిర్ణయించుకో పాఠకుడా అంటూ మనకే వదిలేసిన కథలు. చదువరిని అతలాకుతలం చేసి ఆర్ద్రత నింపే కథలు. ఆరుద్రపురుగుల్లాగే ఎప్పుడో ఒకప్పుడు కాని కనిపించని అరుదైన కథలు.

# గతాన్ని ఆకలించుకొని, వర్తమానంలో సాగిపోతున్న కవితో ముఖాముఖి

**'తిరునగరి'గా ప్రసిద్ధి చెందిన తిరునగరి రామానుజయ్య '2020 దాశరథి పురస్కారం' పొందిన సందర్భంగా తంగేడు ముఖాముఖి...**



మామిడాల రమేశ్‌బాబు

మహాత్ముల అడుగు జాడల్లో... నడుస్తున్న వాణ్ణి, మానవత్వాన్ని గుండెల్లో వెలిగిస్తున్న వాణ్ణి, గతాన్ని ఆకలించుకొని, వర్తమానంలో సాగిపోతున్నవాణ్ణి....

25 కి పైగా కావ్యాలు, నాటి భారతి నుండి నేటి మూసి వరకు వివిధ పత్రికలలో వేయికి పైగా విమర్శా వ్యాసాలు, 2 వేలకు పైగా వివిధ గ్రంథాలకు పీఠికలు, పలు విశ్వవిద్యాలయాల్లో పరిశోధనా పత్రాలు.. ఇంకా ఇంకా ఎన్నో. ఇవన్నీ సుప్రసిద్ధ సాహితీ వేత్త, అగ్రశ్రేణి విమర్శకులు, గొప్ప వక్త, కవి, పండితులు, మూడు తరాల సాహితీ వారధి తిరునగరి రామానుజయ్య గారి కృషికి నిదర్శనాలు. వీటికి గుర్తింపుగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2020 దాశరథీ పురస్కారంతో వీరిని గౌరవించింది. ఈ సందర్భంగా 'తిరునగరి'గా ప్రసిద్ధి చెందిన తిరునగరి రామానుజయ్య గారితో తంగేడు ముఖాముఖి...

**నమస్కారం సర్..**

**ముందుగా 2020 దాశరథీ పురస్కారాన్ని అందుకున్న మీకు తంగేడు సాహిత్య పక్ష పత్రిక తరపున అభినందనలు.**

ధన్యవాదములు

**మీ బాల్యం, విద్యాభ్యాసం గురించి మా పాఠకులకు వివరించండి.**

మాది ఇప్పటి యాదాద్రి భువనగిరి జిల్లా రాజాపేట మండలం బేషంపేట గ్రామం. 24-09-1945 న జన్మించాను. శ్రీమతి జానకీ రామక్క, మనోహర్ గారు మా తల్లిదండ్రులు. మాది చాత్తదశ్రీ వైష్ణవ సాంప్రదాయం. మా నాన్న గారు ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు. నా తొలి గురువు మా నాన్న గారే. వారి దగ్గరే సుమతి శతకం నుండి 'అమరం' వరకు నేర్చుకున్నాను. మా నాన్న గారే భాగవతం లోని ప్రముఖ ఘట్టాలన్నీ కంఠస్థం చేయించారు. మా అమ్మ కూడా సంప్రదాయ కీర్తనలు, తిరుప్పావై పాశురాలు, భక్తి గీతాలు శ్రావ్యంగా పాడేవారు. అవన్నీ నాకు కూడా వచ్చేవి. వీటితో పాటు బాల రామాయణం, పంచకావ్యాలు అన్నీ నాన్నగారే చదివించారు. తుర్కపల్లి, భువనగిరిలలో H.S.C చదివి, హైదరాబాదులో ఓరియంటల్ డిప్లమా ఉత్తీర్ణుడనయ్యాను. ఆ తర్వాత ఉద్యోగం చేస్తూనే B.O.L, M.O.L పూర్తి చేసాను.

**మీ ఉద్యోగ జీవితం గూర్చి వివరించండి.**

1965లో అప్పటి రంగారెడ్డి జిల్లా దేవర యాంజల్ లోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు పండితునిగా ఉద్యోగ



**ముఖాముఖి**

జీవితాన్ని ఆరంభించాను. 36 సం॥ల పాటు, తెలుగు పండితునిగా, జూనియర్ లెక్చరర్‌గా పనిచేసి 1999లో పదవీ విరమణ చేశాను.

**మరింత గొప్ప కవిగా, వక్తగా, విమర్శకులుగా పరిణితి చెందడానికి ప్రేరణగా ఎవరెవరిని చెబుతారు.**

ముందుగా మా నాన్న గారే నాకు తొలి గురువు. మా నాన్న మనోహరయ్య గారే నాకు సాహితీ పరిచయాన్ని కూడా చేశారు. ఆ తర్వాత నా తెలుగు ఉపాధ్యాయులు, స్వర్గీయ తోట రామదాసు గారు నా పద్య రచనను ప్రోత్సహించి దారిలో పెట్టారు. ఆ తర్వాత దాశరథిగారు నన్ను కవిగా ఎదిగేలా చేశారు.

**ఒక పద్య, గేయకవికి ఉండాల్సిన లక్షణాలు మీ దృష్టిలో...?**

ప్రాచీన కవిత్వాన్ని క్షుణ్ణంగా చదవాలి. నన్నయ, పాలకుర్తి, తిక్కన, శ్రీనాథులది ఒక రకమైన శైలి. ఆ తర్వాత వచ్చిన ప్రబంధాలతో రస ప్రపూర్ణమైన కవిత్వం వచ్చింది. వీటిని బాగా చదివినపుడే ఒక కవిత్వం అది పద్యమైనా, గేయమైనా ఇంకా ఏదైనా ఎలా ఉండాలి అన్న ఒక అవగాహన మనకు వస్తుంది. తనదైన శైలిని, ముద్రను ఏర్పరచుకోవడం కవికి అవసరం.

**మీకు పేరు తెచ్చిన 'తిరునగరీయం' కు ప్రేరణ, ఉద్దేశ్యం ఏమిటి..?**

ఆధునిక సమాజంలోని జీవితాన్ని వ్యంగ్యంగా, వక్రోక్తితో సందేశాత్మకంగా చెప్పాలనే ఉద్దేశ్యంతో 'తిరునగరీయం' ప్రారంభించాను. కాంత సమ్మితంగా కవిత్వం ఉండాలి కాబట్టి, ఎవరినీ నొప్పించకుండా కఠినమైన శబ్దజాలమేదీ లేకుండా రాశాను, రాస్తున్నాను. ఇప్పటికీ 4 భాగాలు వచ్చాయి. ప్రస్తుతం 5 వ భాగం వ్రాస్తున్నాను. సమాజమే దీనికి ప్రేరణ. అందుకే స్వర్గీయ సినారె ఒక చోట "తిరునగరీయం సమాజాన్ని విశ్లేషిస్తూ వచ్చిన ఎక్స్-రే లాంటి పద్య కావ్యం అన్నారు.

పొలముదున్నువాడు పూజ్యుడు జాతికి
బురద మేనుచూచి పోకు తొలగి
బురద చేతికంట పెరుగు నోటికందు
తిరునగరిది మాట తిరుగు లేదు



ఇలా బురద అంటిన ఒక రైతును చూచి బస్సులో అసహ్యించుకొన్న ఒక వ్యక్తి ని చూచి spontaneousగా రాసిన ఆట వెలది పద్యం. అక్కడి నుండి ఈ తిరునగరీయం ప్రారంభమైంది. ఇటువంటి సామాజికాంశాలను స్పృశిస్తూ, కృత్రిమమైన నాగరికత వద్దని, మన జీవన మూల్యాలను కాపాడుకోవాలనే లక్ష్యం తోనే ఇప్పటికి కూడా ఈ తిరునగరీయాన్ని కొనసాగిస్తున్నాను.

**వెయ్యికి పైగా సాహిత్య విమర్శా వ్యాసాలు రాసారు కదా. నేటి సాహిత్య విమర్శ దిశ, దశ ఎలా ఉంది. ఈ 50 ఏళ్ళలో మీరు ఏం గమనించారు.**

సాహిత్యం యొక్క పరమ ప్రయోజనం సమాజాన్ని సంస్కరించడమే. తిమిరంతో సమరం చేసే వారిని మనం మెచ్చుకోవాలి. చీకట్లోకి దీపాన్ని తీసుకురావడం లాంటిదే ఈ విమర్శ. విమర్శకుడు సహృదయుడై ఉండాలి. విమర్శకునికి ఒక గ్రంథాన్ని చదివేప్పుడు పవిత్రమైన ఆలోచన ఉండాలి. నా 50 ఏళ్ల సాహిత్య విమర్శలో ఎక్కువగా ఇష్టపడేది రాళ్లపల్లి అనంతకృష్ణశర్మ గారిని. కావ్యంలోని మంచి చెడులను సమదృష్టితో వివేచించడం వారి లక్షణం. నేను కూడా ఆ మార్గంలోనే వెళ్తున్నాను. ఒక గ్రంథానికి విమర్శ రాసేటప్పుడు ఏ కోణంలో రాస్తే సమాజానికి బలమొస్తుంది, మేలు జరుగుతుందో ఆలోచించాలి. ఇప్పుడొస్తున్న విమర్శలో ముందే ఒక కళ్ళజోడు పెట్టుకుని చూస్తున్నవే ఎక్కువగా ఉంటున్నాయి. అందరూ కాదు, కొందరు. కుందుర్తి చెప్పినట్టు "మనకున్న విమర్శా దీపం చిన్నది''. ఇది నిజం. ఇప్పటికీ అలాగే ఉంది. విమర్శ ఇంకా బలీయం కావాలి. పారదర్శకత ఉండాలి. సమదృష్టి ఉండాలి. కవిత్వం వచ్చినట్టుగా విమర్శ ఇంకా రావడం లేదు. విమర్శకులు ఇంకా లోతుల్లోకి వెళ్ళాలి. మూలాలను కదిలించాలి. ప్రామాణికత సంతరించుకున్నదే మంచి విమర్శ అని నా అభిప్రాయం.

**కవిత్వం, గేయం, విమర్శ, వ్యాఖ్యానం, వీటన్నిటిలో మీకు బాగా ఇష్టమైనది ఏది..?**

నేను ముందుగా కవిని. అందుకే కవిత్వమే నాకు అత్యంత ఇష్టం. ఆ తర్వాత ఇష్టమైనది సాహిత్య విమర్శ.

ముఖాముఖి

**ఈ 50 ఏళ్ల సాహిత్య జీవితంలో ఎన్నో ఉద్యమాలు చూశారు. మిమ్మల్ని ప్రభావితం చేసిన ఉద్యమం, లేదా మిమ్మల్ని ఆకర్షించిన కవిత, ఉద్యమం ఏదైనా ఉందా..?**

నేను భావ కవిత్వ ఉద్యమం వచ్చే నాటికే కవిగా ఎదిగాను. నన్ను మూడు తరాల వారధిగా కొందరంటారు. ఇది నిజమే. విశ్వనాథ నుండి నేటి కవుల వరకు అందరి కవిత్వాన్ని పరిశీలిస్తున్న వాన్ని. ఎన్ని ఉద్యమాలు వచ్చినా భావ కవిత్వం నుండే అభ్యుదయ కవిత్వం వచ్చింది. భావ కవిత్వాన్నే నేను చాలా ఇష్టపడుతాను. భావ కవిత్వం అనగానే కృష్ణ శాస్త్రి గారు గుర్తొస్తారు. ఆయన చెప్పిన ప్రతి విషయంలో ఒక నవ్యత ఉంది. ఆకులో, పూవులో, రెమ్మలో ప్రతి చోట కవిత్వం చూసినాడు. ప్రకృతి లోని ప్రతి విషయాన్ని అందంగా కవిత్వీక రించారు కృష్ణశాస్త్రి. జానపద జీవితంలోని రమ్యతను కూడా భావకవి చూశాడు. భావకవులలో నుండే అభ్యుదయ కవులు వచ్చారు. అందుకే సాహితీపరంగా కవిత్వ ఉద్యమమే గొప్పదిగా భావిస్తాను. అదే నాకు ఇష్టం కూడా. భావ కవిత్వం తర్వాత అసలు కవిత్వ స్థాయి పలుచబడి పోయిందని నా అభిప్రాయం. భావకవిత్వోద్యమం సౌందర్యం వైపు కవులను నడిపించింది. సందేశం వైపు నడిపించింది.

**దాశరథి అవార్డ్ తీసుకున్న సందర్భంగా మీ అనుభూతి?**

నేను 1966లో మొదటిసారి దాశరథిని కలిశాను. నా రచనలు చదివి ఆయన “అలాగే రాస్తుండు. శైలి బాగుంది. ప్రాచీన ఆధునిక రచనలు చదువుతుండు” అని ప్రోత్సహించారు. ఆయన నన్ను తమ్మునిగా చూశారు. గంగాఝరీ ప్రవాహ సదృశంగా వీడు మాట్లాడుతాడు అనేవారు. నిజాం బాద్ జైలు జీవితం లాంటి అనుభవాలు, అనుభూతులు చెప్పేవారు. ఈ అవార్డ్ తీసుకోవడం జీవితంలో సాధించిన గొప్ప విజయం అనుకొంటాను.

**ఉంటాను సర్, నమస్తే.**

కవిత

# మా పెరటి చెట్టు....!



**అయిత అనిత**
**జగిత్యాల**

మెల్లమెల్లంగ మాపటేలకాంగనే
వాడకట్టు పిల్లగాండ్లందరికీ
సక్కని సోపతై ముచ్చటవెట్టుతూ
నీడనిచ్చే పొదరిల్లయ్యేది మా పెరటిచెట్టు!

సీకటమ్మ తలుపులు గట్టిగా బిడాయించంగనే
తెల్ల ఎలుగులు తొంగిసూడంగనే
పొద్దుపొడుపు తంగేడుపువ్వై పుయ్యంగనే
మా గడుగ్గాయిలందరికీ
తానాల కొలనయ్యేది!

నేలంతా గరమెక్కే ఏళ
ఎండకాలపు కాలచ్చేపంలో
మా నానమ్మ నోటిలో కథల కుటీరమయ్యేది!
నులకమంచంలో పగటినిద్రకు పానుపయ్యేది!!

ఐతారపు ఆటవిడుపులో
మా బొమ్మరిల్లులకు ఆసరా అయ్యేది!
మా కిలకిల నవ్వులను సూసి తెగ మురిసిపోయేది!!

సలికాలంల
తన చిగురుటాకులతో
మా బగోన్ల పుల్లని పప్పయ్యేది!
ఒనగాయలనిచ్చి కమ్మటిరుచులతో
నాలుకతో దోస్తీకట్టేది!
పచ్చిచింతకాయ మెరుగుపులుసై
నోరూరించేది!

మార్గశిరపు చూపులు ముద్దుగ గిచ్చంగనే
మా జాడీలో తొక్కుగా ఫక్కుననవ్వేది!

సూరీడు
మబ్బులసాటుకు మాయమైతుంటే
పొద్దుగూకినంక
అలసిన పక్షులకు నెలవయ్యేది!
నిద్దురవోక మారాంజేసే చిన్నోళ్లకు
అమ్మచెప్పే దయ్యమై భయపెట్టేది!

నీల్లోసుకున్న మా సుట్టపోళ్లందరికీ
నోరూరే పులిహోరై
కడుపునింపేది!

మా పెరడుకు పెద్ద దిక్కై
మా కుటుంబానికి ఆకలితీర్చే అన్నపూర్ణై
మా బతుకున పున్నమి ఎన్నెలయ్యేది!
మాకు శుభకామనలిచ్చే
పెద్ద ముత్తైదువయ్యేది!
మా గుబురు చింతచెట్టు!!

ఇప్పుడు
ఏడున్నదోగాని కంటికైతే కానరాదు!
సిమెంటుగోడల సమ్మెటపోటుకు
బలైందేమో!
భవంతుల పునాదుల్లో కనుమరుగైందేమో!
ఆ..చెట్టూ లేదూ ఆనాటి ఆప్యాయతలూ లేవు!!

సాహితీ శిఖరం

## నోబెల్ సాహిత్య పురస్కారం 2016

# బాబ్ డైలాన్



అమెరికా గేయ రచయిత బాబ్ డైలాన్‌కు 2016లో సాహిత్య విభాగంలో నోబెల్ బహుమతి లభించింది. సాహిత్యవిప్లవకారుడు, ప్రజా వాగ్గేయకారుడు, రచయిత అయిన బాబ్ డైలాన్, అమెరికా గేయ సంప్రదాయంలో కొత్త కవితా భావజాలాన్ని రూపొందించినందుకు గానూ ఈ పురస్కారం దక్కింది. బాబ్ రచించిన బ్లోయింగ్ ఇన్ ది విండ్, ది టైమ్స్ దే ఆర్ ఎ-చేంజింగ్ గేయాలు అమెరికా పౌర హక్కులు, యుద్ధ వ్యతిరేక ఉద్యమాలకు స్ఫూర్తినిచ్చే గీతాలుగా మారాయి. 'బ్లోయింగ్ ఇన్ ద విండ్' కవితలో యుద్ధ వ్యతిరేకతను, మానవ సంక్షోభాన్నీ, వేదననూ అద్భుతంగా ప్రతిఫలిస్తాడు. ఆయన పాటల్లో మౌఖిక జానపద సాంప్రదాయంలోని ఒక క్రమశిక్షణ, కఠినమైన కూర్పు ఉంటాయి.



## జ్ఞాన్ పీఠ్ అవార్డు గ్రహీత 2014

# భల్‌చంద్ర నెమడే

ప్రముఖ మరాఠీ సాహితీ వేత్త భల్‌చంద్ర నెమడే, 50వ జ్ఞాన్ పీఠ్ అవార్డుకు ఎంపికయ్యారు. భల్‌చంద్ర నెమడే నవల 'కోసల'కు జ్ఞాన్ పీఠ్ అవార్డు లభించింది. 1963లో ప్రచురితమైన 'కోసల' మరాఠీ సాహిత్యంలో కొత్త ఒరవడిని సృష్టించింది. భల్‌చంద్ర నెమడే 2010 లో రచించిన Hindu: Jaganyachi Samruddha నవల మంచి ఆదరణ పొందింది. 1938లో జన్మించిన భల్‌చంద్ర నెమడే, తన 25 ఏండ్ల వయసులోనే 'కోసల'ను రచించారు. హూల్, బిదార్, జరీలా, ఝూల్ వంటివి భల్‌చంద్ర నెమడే ప్రముఖ రచనలు. నెమడే 1991 లో సాహిత్య అకాడమీ అవార్డును, 2011 లో పద్మశ్రీ అవార్డును పొందారు.

# సినారె రచనా శిల్పం

**తనదైన అక్షర ముద్రను అడుగడుగునా ప్రతిఫలించిన ప్రతిభాశాలి సినారె రచనా శిల్పం పరిచయం చేస్తున్న వ్యాసం....**



డా॥ గండ్ర లక్ష్మణ రావు

జ్ఞానపీఠ పురస్కార గ్రహీత ఉన్నత పదవులు ఉదాత్తంగా నిర్వహించిన ప్రజ్ఞాధురంధరులు డా.సి.నారాయణ రెడ్డి. నవ్వని పువ్వునుండి నా రణం మరణం పైనే దాకా సాహిత్యసృజనలో ఎన్నో శిఖరాల నధిరోహించిన మహాగిరి సముదాయం సినారె కవిత. ఏ శిఖరాన్ని చూసినా అక్కడే ఆగిపోయి అబ్బురపడి అక్కడి శిల్ప వైభవాన్ని విశ్లేషించడం మరిచిపోయి తన్మయులమవుతాం. అది సినారె రచనా శిల్పం లోని వైశిష్ట్యం.

రచనలోని శిల్పం అంటే రచనా కళ అనీ, రచనా నైపుణ్యం అనీ చెప్పుకోవాలి. ప్రాచీన ఆలంకారికుల ప్రకారం శబ్దార్థాలంకారాదుల ప్రయోగం, రసరామణీయకాలు, ధ్వని మొదలైనవి శిల్పంలో అంతర్భాగాలు. సినారె పండిత కవి. ప్రాచీన సాహిత్యాన్ని అధ్యయనమే కాదు అర్థవంతంగా సమర్థవంతంగా అధ్యాపనం చేసిన అనుభవ సంపన్నుడు. ఆధునిక సాహిత్యంలో సంప్రదాయము ప్రయోగములు పేరుతో నిశితంగా శోధించిన పరిశోధకుడు. ప్రాచీనాధునికతల సమ్మేళనం ఆయన మేధోక్షేత్రం. జానపదుల యాసలనుండి, పాటలనుండి, మాటలనుండి, శబ్దలయను హృదయగతం చేసుకున్న సహృదయుడు. పద్యాన్నీ పాటనూ సమంగా ప్రేమించి మధ్యేమార్గంగా గేయాన్ని అద్వితీయంగా నడిపించిన నవ్య కవితా వైతాళికుడు.

గేయమైనా, సినీగేయమైనా, ప్రపంచ పదులైనా, ద్విపదులైనా, వచన కవితలైనా, వచనకవితా కావ్యాలైనా, వచనమైనా తనదైన అక్షర ముద్రలు అడుగడుగునా ప్రతిఫలింపజేసిన ప్రతిభాశాలి సినారె. తన అక్షరాలలో లయలు, అంతర్లయలు, ప్రాసలు, యతులు, అంత్యప్రాసలు, వృత్త్యనుప్రాసలు అలవోకగా సాగిపోతాయి. అక్షర రమ్యత అతిమనోహరంగా పాఠకుని లేదా శ్రోతలను పరవశింపజేస్తుంది. లకుమ నాట్యానికి రాయలు వివశుడైనట్లు సినారె పదాలకు సహృదయులంతా పరవశులయినారు.

కావ్యాన్ని ప్రేమించి తన గొంతులో నుంచి అందంగా వినిపించిన వాడే కాదు, స్వయంగా తొలినాళ్ళలో పద్య కావ్యం రచించినవాడు. రామప్పలో ఒక పద్యం...

ఏదో వెల్గు కరళ్ళు ద్రొక్కినటులై ఏదో మహాసౌరభం
బీదగ్గుమ్ము నురుంగు లెత్తినటులై ఈ నా సమస్తాంగముల్
పాదుల్ వీడెను, జీవనాడులను శంపావల్లరుల్ నృత్యము
ర్యాదల్ జూపెను - ఈ మహానుభవ మౌరా! యెట్లు రూపొందునో?

ఒక కళానుభూతిని శార్దూల విక్రీడితంలో బంధించిన తీరు ఇది.

సినారె సంప్రదాయం నుండి సారాంశాన్ని తీసుకున్నారు. కాని తిరస్కరించలేదు.

నేను సంప్రదాయాన్ని జీర్ణించుకున్న
ప్రయోగాన్ని
ప్రయోగంలో జీవిస్తున్న
సంప్రదాయాన్ని....

అని తన కవితా సిద్ధాంత తత్వాన్ని ఆవిష్కరించారు.

ఈ దృష్టితో సినారె రచనా శిల్పాన్ని సంప్రదాయ విమర్శలోను, ఆధునిక విమర్శలోను విశ్లేషించుకునే అవకాశం ఉంది.

నవ్వని పువ్వు నుండి నారాయణ రెడ్డి కవిత అనగానే చటుక్కున ఎవరికైనా స్ఫురించేవి శబ్దలయ, అంత్య ప్రాసలు. రెండింటినీ కాకుంటే కనీసం అంత్యాన్ని పాటించడం ఆయన సహజ ధారా లక్షణం.

ఓ చిన్నమొగ్గా ! ఓ కన్నెమొగ్గా !
చల్లచల్లని తీగె తల్లి ఒడిలో నూగు
ఓ చిన్ని మొగ్గా ! ఓ కన్నె మొగ్గా !
చివురుటాకుల లోన / రవల రేకుల లోన
మంచు ముత్యాలుంచి / మంచి మధువుల నించి
ఉదయ భాను కరాల / సుధలు జారే వేళ
ప్రకృతీ లక్ష్మి దివ్య / పాదపూజలు చేసి... అని తొలిగేయం సాగింది. ఇందులో పదేసి మాత్రలకొక పాదం విరుగుతూ ఆది ప్రాసనూ అంత్య ప్రాసనూ పాటించారు. ప్రతి రెండు పాదాలలో

వాడిన పదాల మాత్రలు సమతూకంలో ఉన్నాయి. దీనితో గేయ లయను సాధించారు. 'నడక నా తల్లి' అని చెప్పుకోవడంలో తన ఉదయపు నడకకే కాదు తన హృదయ కవిత్వపు నడకకు కూడా వర్తిస్తుంది. నాటినుండి గేయం వచన గేయంగా మారినా ఈ ప్రాసనియ మాలను, ఒకింత పదాలలో తూగునూ, నాద స్వభావాన్నీ మరిచిపోలేదు. విడిచి పెట్టలేదు. మాట్లాడినా, యతి ప్రాసలు దొర్లి పోయేవి. ఆ క్రమంలో ఆయన మాటే పాటయింది. పాటే పలువు రాడుకునే మంచి మాటయింది. అందుకనే 'మాటకు దండం పెడతా / పాటకు దండం పెడతా / మాటను పాటను నమ్మిన మనిషికి దండం పెడతా' అన్నాడు. ఇందులో మాట, పాట అనేవి ప్రాసలు. 'దండం పెడతా' అనే పదం మనలను పల్లెలకు పట్టుకొని పోతుంది. తన మాట, పాట జానపదం అనే ధ్వని ఈ మాటలో ఉంది. ఈ రెంటినీ నమ్మిన మనిషికి అనడం కళాకారునికి, పల్లెటూరి శ్రమజీవికి, భాషావేత్తలకు, పశుత్వం కాక పరవశత్వం పొందే హృదయానికి అనేంత అర్థయుక్తి ఉంది. అర్థ వ్యాఖ్యానం ఇంత చేయడానికి ఆ వాడిన పదాలు, వాటి తీరే కారణం కదా!

గేయాల గతులను, సినీ గేయాల శ్రుతులను గురించి వివరించకుండా, వాటిలోని రచనా శిల్పాన్ని గురించి కొంత ప్రస్తావిస్తాను.

గేయాలలో అంత్యప్రాసలతో పాటు అనుప్రాసలు, అంత్య ప్రాసలు కూడా పడి వాటి నడకల్లో సరికొత్త అందాలు, గానం లో మాధుర్యాలు తొణికిస లాడినాయి.

రాలలోపల పూలు పూసిన రామ మందిర లీలా

ఆ రామ మందిర హేలా!

రాలలో హృదయాలు మోసిన రాసకేళీశాల

రామ మందిర లీల.... అనే ఈ గేయంలో ఎన్ని 'ర', 'ల' లు జతకట్టుకొని రాలిపడ్డాయి. అవే ఒక లీలను ధ్వనింపజేస్తాయి. 'రాల'లో 'రామ' మందిర, ఆ 'రామ' సుందర

'రాలలో........ రాసకేళీశాల............

అనేక చోట్ల 'రామ', రాలు మధ్యలో రావడం వల్ల పద్యాల్లో యతివలె, ప్రాసయతివలె, నడకకు లయనూ అందాన్నీ కూర్చాయి. ఇట్లా గేయాలలో అనేకం చూపవచ్చును.

కనురెప్పల దుప్పట్లు, చిక్కుముళ్లలో తొక్కిసలాట...మొదలైనవి.

సినీగేయాలలో నన్ను దోచుకుందువటే నుండి అన్నింటిలోను ఈ ప్రాస యతుల నియమాలు నియమంగా కాక సహజంగా కనిపించడం సినారె పదశిల్పం.

కవితాశిల్పంలో కవితా నిర్మాణం, కావ్య నిర్మాణం రెండూ ఉంటాయి. కథాకావ్యాల్లో, దీర్ఘ కవితల్లో వస్తుపరమైన నిర్మాణం విభాగాలుగా అంతస్సూత్రంతో బంధించబడి ఉంటాయి. భూమిక, మట్టీమనిషీ ఆకాశం, మొదలుకొని విశ్వంభర దాకా ఈ అంతస్సూత్రం ఉంది. ఇది కథాకథన శిల్పంగా భావించాలి. విశ్వంభరను మానవేతిహాసంగా ఐదు ఖండాలుగా విభజించాడు. ఇవి మనిషి దశలు. బాల్య కౌమార యౌవన వార్థక్య అవసాన దశలు, చతురాశ్రమాలు - తరువాత జీవన భ్రమణం - జననమరణాల పునశ్చరణం - అయిదవ ఖండంలో తనదైన మానవతా సిద్ధాంతంతో ముడివేసి "తరలిపోయే జీవితం - తిరిగి చూడని చిరపథం' మనసుకు తొడుగు మనిషి, మనిషికి ఉడుపు జగతి, అని ముగించడంలో మనిషి మనసు ప్రకృతి అనే మూడింటి అనుబంధాలు విడదీయరాదని బోధించారు.

ఒకటి ప్రపంచ చారిత్రక మానవేతిహాసం.

రెండు మనిషి ఆబాల్య జీవనాంతం దశల గమనం.

మూడు ప్రకృతి జీవుల అవినాభావ సంబంధం.

ఈ మూడు అంశాలు మూడు పొరలుగా సాగింది విశ్వంభర. ఇది మహాకావ్య లక్షణం ఇది కథా కథన శిల్పమయితే కథే లేని అంశాన్ని కథగా మలిచి వర్ణించడం మరో వినూత్న శిల్పం.ఈ విశ్వంభరను అనుశీలనం చేసిన మిత్రుడు గురిజాల రామశేషయ్య శాస్త్రి వ్యాఖ్యాన గ్రంథం సాహితీలోకానికి గమనార్హం. దీర్ఘ కథా కావ్యాలలో ఒకటి కేవలం స్పృశించాను.

అర్థశతాబ్దం వెలువడిన యాభయి పైగా కవితాసంకలనాలలో కవితల నిర్మాణాలు, బహురూపాలను సంతరించుకున్నాయి.

1. భావలయలు (లయలు) 2. దృశ్య చిత్రాలు 3. నాటకీయత - సంభాషణ శైలి 4. ప్రశ్నలు - ప్రశ్నోత్తరాలు 5. శబ్ద, అర్థ ధ్వనులు 6. శ్లేషలు 7. చమత్కారాలు 8. కొత్త ప్రయోగాలు - పదబంధాలు 9. నిర్మాణ వైవిధ్యాలు 10. కొత్త రూపాలు - ప్రపంచపదులు, గజళ్ళు మొదలగునవి.

ఒక భావం కోసం ఒక లయను రెండుపాదాలుగా , లేదా రెండుమూడు నాలుగు పాదాలుగా పాదసామ్యాన్ని పాటిస్తూ నడిపించడం భావలయ.

కాలం కేలెత్తి పిలుస్తున్నది / కంకాళం లేచి నడుస్తున్నది

గిరిజనుడే పురజనుడై / ధరాచక్రమును తిప్పే

తరుణం వస్తున్నది - కాలం......

**'నడక నా తల్లి' అని చెప్పుకోవడంలో తన ఉదయపు నడకకే కాదు తన హృదయ కవిత్వపు నడకకు కూడా వర్తిస్తుంది. నాటినుండి గేయం వచన గేయంగా మారినా ఈ ప్రాస నియమాలను, ఒకింత పదాలలో తూగునూ, నాద స్వభావాన్నీ మరిచిపోలేదు. విడిచి పెట్టలేదు. మాట్లాడినా, యతి ప్రాసలు దొర్లి పోయేవి. ఆ క్రమంలో ఆయన మాటే పాటయింది. పాటే పలువు రాడుకునే మంచి మాటయింది. అందుకనే 'మాటకు దండం పెడతా / పాటకు దండం పెడతా / మాటను పాటను నమ్మిన మనిషికి దండం పెడతా' అన్నాడు.**

(అక్షరాల గవాక్షాలు)

సినారె కవితల్లో దృశ్యచిత్రాలు భావాలను అనుభూతం చేయడమే కాక కళ్ళముందుంచుతాయి. వాస్తవంగా కనిపించే వాటిని వర్ణించి చూపడం, లేనివాటిని ఉన్నట్లుగా చిత్రించడం రెండు రకాల దృశ్యచిత్రాలుంటాయి.

నదులు, పర్వతాలు, శిల్పాలు, జలపాతాలు, వృక్షాలు, పక్షులు, ఋతువులు, మొదలైన వాటినన్నిటినీ సహజోక్తిలో చెపుతూనే శబ్ద సౌష్టవాన్నీ, అర్థగాంభీర్యాన్నీ పొదుగుతారు. వర్ణనలలో ఔచిత్యం పరచుకొని ఉంటుంది.

తడిమట్టి పొరల్లో తలదాచుకున్న / విత్తనం మొక్కగా పైకి లేచి / కాలానుగుణంగా శాఖోపశాఖలతో వృక్షమై విస్తరిస్తుంది (ప్రాకృతిక రూపాలు - అలలెత్తే అడుగులు)... ఇందులో మట్టిలో ఉన్న విత్తు మొలకై వృక్షమై విస్తరించడం చాలా సహజమైన విషయం. అయితే మట్టిలో తలదాచుకోవడం, పైకి లేవడం, విస్తరించడం అనే పదాలలో అటు చెట్టుకు, ఇటు ఎదిగే మనిషికి, లేదా ఏదైనా ఒక క్రమపరిణామం చెందే అంశానికి వర్తిస్తుంది. అర్థపరంగా కలిగే విస్తృతి ఇది. ఇక గింజ మొలకెత్తడం, పైకి లేవడం, చెట్టుగా ఎదగడం అనేది ఒక దృశ్యక్రమమే. నాలుగు పంక్తుల్లో చెప్పడం కూడా నాలుగు కాలాల వ్యాపకాన్ని తెలియజేస్తుంది.

ఇట్లాంటి పంక్తుల్లో సూర్యుడు, మబ్బు, గాలి, నీరు అంశాలను గురించి కూడా నాలుగేసి పంక్తుల్లో చిత్రించి చివరకు

వృక్షం, సూర్యబింబం, నీలిమేఘం, మారుతం, సాగరం అనే పదాలు వేరు వేరు పాదాలుగా విరిచి చివర "విశ్వానికి స్థితి కారకంగా ఉన్న / ప్రాకృతిక రూపాలు" అని ముగింపులో రాశారు. పైన నాలుగు పాదాలలో చెప్పిన వాటికి క్రమంగా వాచ్యం చేసి క్రమాలంకారం పాటించారు. అంతేకాదు పంచభూతాలను ప్రాకృతిక రూపాలుగా నాలుగు, తరువాత ఒకటి చొప్పున ఐదేసి పంక్తులుగా పేర్చడం వలన పంచభూతాల పంచీకరణ

> **నిన్న లేని అందమేదో / నిదుర లేచె నెందుకో? ఈ సినీగీతం ప్రశ్నతో మొదలై ఒక ఆశ్చర్యార్థాన్ని, ఒక ఆనందాన్ని, ఉద్వేగాన్ని ప్రకటిస్తున్నది. ఈ ప్రశ్నలో కవి, లేదా నాయకుడు సమాధానం ఆశించడం లేదు. తరువాతి చరణంలో "ఇన్నాళ్ళీ శోభలన్నీ ఎచట దాగెనో?" అంటాడు. ఇక్కడ కూడా ఎప్పుడూ ఉన్నవే అయినా ఇవాళ శోభాయమానంగా కన్పడుతున్నాయనే భావననే వ్యక్తమవుతుంది కాని ప్రశ్న సమాధానాన్ని ఆశించింది కాదు.**

ధ్వనిస్తుంది.చివరి మాటల్లో స్థితికారకాలు అని ప్రాకృతికాలు అంటే మూలాలు అనీ ప్రకృతి సంబంధాలు అనీ ఎప్పటికీ ఉండేవి అనీ స్పష్టం చేశారు. ఈ మాటలతో పై పాదాలను మరలా చదివితే కలిగే అర్థవ్యాకోచం మరోవిధంగా ఉంటుంది. ఉత్తమ కవిత్వానికుండాల్సిన లక్షణాల్లో ఒకటి అది మరలా చదివింపజేసేదిగా ఉండడం. భావవ్యక్తీకరణలో రూపనిర్మాణ శిల్ప వైశిష్ట్యం ఇది. ఇదంతా దృశ్యమానం కావడం మరొక విశేషం. ఇది ఒక మచ్చుతునక మాత్రమే. ఇట్లాంటివి ఇంకా అనేక రకాల శిల్పాలు సినారె కవితల్లో కనిపిస్తాయి.

నాటకీయ పద్ధతిలో కవిత్వం సంభాషణా రూపంలో సాగిస్తారు కొన్ని చోట్ల....

రోజులు గడుస్తున్నాయి / పూలు వాడిపోతున్నాయి

గత్యంతరం లేక / తీగల్ని బతిమాలుకున్నాయి

"మమ్మల్ని మీలో పొదుగు కుంటారా?" అనగానే తీగలు జాలి చూపులు ప్రసరించి

"వేళ దాటిపోయింది

అనాలోచితంగా మీరు తీసుకున్న నిర్ణయం

మీ అవసాన దశకు దారితీసింది,

ఇప్పుడు నేనేం చేయలేను"

ఇదంతా పూలకు తీగలకు జరిగిన సంభాషణ. నాటకంలో పాత్రలు మాట్లాడుకున్నట్లుగా పంక్తులు ప్రశ్నలు, జవాబులుగా ఉండటం, వాటి తీరు తెన్నులు కూడా హావభావాలను ప్రకటిస్తున్నట్లు చూపడం కనిపిస్తుంది. తీగ జాలిచూపులు చూపడం వంటివి మానవీకరణ చేసినట్లుగా ఉన్నాయి. ఇట్లాంటివి కూడా సినారె కవితల్లో ఎన్నో ఉన్నాయి.

ప్రశ్నలు సంధించి సమాధానం రాబట్టటం. ఇక్కడ పాత్రల వలె కాక కవియే ఒక సన్నివేశంలో ఒక ప్రశ్నను సంధించడం దానికి సమాధానం కూడా తానే సూచించడం.

ఏం చేసుకోను ఈ వెండి కంచం? / ఏవేవో క్రిములు కదలుతున్నాయి

ఎలా పట్టుకోను ఈ మధుచషకం / ఏ వికట స్మృతులో తొణకుతున్నాయి

(విశ్వంభర).... వీటిలో ప్రశ్న సమాధానమూ రెండూ ఉన్నాయి. పాత్ర కవి ఒకరే. ఒకవేళ ప్రశ్నలేకుండానే చెపితే "కంచం వెండిదే అయినా క్రిములు కదులుతున్నాయి" అని చెపితే అంత బలంగా వ్యక్తం కాదు. ఎవరో తనకు వెండి కంచమే ఇచ్చారు, కాని చూస్తే అందులో క్రిములున్నాయి, అంటే ఆ కంచం శూన్యం కాదు అందులో ఏవో పదార్థాలున్నాయి, వాటికి చీమలు పట్టినాయి, వెండి అయినా బంగారం అయినా ఆరగించే పదార్థానికి చీమలు పడితే వ్యర్థం కదా! అనే అర్థం ఈ ప్రశ్నతోనే సాధింపబడింది. అట్లే రెండవ ప్రశ్నలో తీసుకునే చషకంలో ఉన్న మధువులో లోపం లేదు, కాని తీసుకుంటే వికట స్మృతులు కలవరపెడతాయనే భయంలాంటి ఆందోళన వ్యక్తమవుతుంది. ఒకటి భౌతికమయింది, రెండవది మనస్సుకు చెందింది. మామూలు ప్రశ్నల వలె కనిపించే ఈ చరణాలలో ఇంత అర్థాన్ని ఇమిడించాడు సినారె. ఈ ప్రశ్నోత్తరాల నిర్వహణ కూడా నిర్మాణంలో

వ్యాసం

ఒక భాగమే.

కొన్ని చోట్ల ప్రశ్నలే ఉంటాయి, సమాధానం వ్యక్తం కాదు, ఊహకు వదిలేస్తారు,

నా మదిలో విరిసిన ఆమనివో?
నా కన్నుల మెరిసిన పున్నమివో?...

ఈ ప్రశ్నలో నీవు ఆమనివా? పున్నమివా? అని ఆమె సౌందర్యాన్ని సందేహాలం కారంగా ప్రకటించారు. ఈ రెండుగా నాలో నిండి ఉన్నావనే ధ్వని మాత్రమే ఉంది. ఇవి నిజంగా సమాధానం ఆశించిన ప్రశ్నలు కావు.

కొన్ని చోట్ల ప్రశ్నలు నిశ్చయార్థాన్ని తెలుపుతాయి.

ఎన్ని రంగులు పులుముకున్నా / ఎపుడైనా గెలిచిందా చీకటి?
ఏ ఆంక్షలు నిషేధించినా / ఉద యించకుంటుందా కిరణ సంపుటి?

ఈ ప్రశ్నలను విశేషణాలతో సహ ప్రయోగించారు. చీకటి గెలువదు, ఉదయం ఆగదు అనే నిశ్చయార్థాన్ని చెప్పడానికి చీకటికి రంగులు పులిమే విశేషణం, ఆంక్షలు ఆపలేని లక్షణాన్ని కిరణాలకు విశేషణం, ఈ రెండూ అసాధ్యాలని స్థిరమైన అర్థమే ఇందులో సూచితం. అజ్ఞానం చీకటికి అహంకారాది రంగులు పులమటం వ్యర్థం, వెలుగు కిరణాలకు వేళ్ళు అడ్డుపెట్టడం కూడా వ్యర్థం అనే నిషేధాలను కూడా ఇందులో వ్యంజింపజేశారు. నిశ్చయాన్ని, నిషేధాన్ని నిర్వచనంలా కాకుండా ప్రశ్నలా వేయడం వలన పాఠకుడు కూడా అవును కదా! అని సమాధానం తానే చెపుతున్నట్లుగా అనుభూతిని పొందుతాడు. ఒక భావాన్ని బలంగా చెప్పడానికి వాడుకున్న నిర్మాణ మార్మికత ఇది.

నిన్న లేని అందమేదో / నిదుర లేచె నెందుకో?

ఈ సినీగీతం ప్రశ్నతో మొదలై ఒక ఆశ్చర్యార్థాన్ని, ఒక ఆనందాన్ని, ఉద్వేగాన్ని ప్రకటిస్తున్నది. ఈ ప్రశ్నలో కవి, లేదా నాయకుడు సమాధానం ఆశించడం లేదు. తరువాతి చరణంలో "ఇన్నాళ్ళీ శోభలన్నీ ఎచట దాగెనో?" అంటాడు. ఇక్కడ కూడా ఎప్పుడూ ఉన్నవే అయినా ఇవాళ శోభాయమానంగా కన్పడుతున్నాయనే భావననే వ్యక్తమవుతుంది కాని ప్రశ్న సమాధానాన్ని ఆశించింది కాదు. ప్రశ్నలను అనేక విధాలుగా ప్రయోగిస్తూ కవితా నిర్మాణంలో కొత్త దారులు చూపించారు సినారె. దాశరథి, శ్రీశ్రీ మొదలైన వారిలో కూడా ఈప్రశ్నల రూప కవిత్వం ఉంది, అయితే వైవిధ్యం, నూతనత్వం ఎక్కువగా ప్రవేశపెట్టాడు సినారె.

కవిత్వంలో రసధ్వనులు ప్రధానాలు, ప్రాణాలు అని ఆలంకారికులు చెప్పినారు. సినారె అలంకార శాస్త్రాలు చదివారు. బోధించారు. ఆయనలో చాలా విషయాలు జీర్ణమయినాయి. అందువలన అవి ఆయన కవిత్వంలో అప్రయత్నంగానే దొర్లుతుంటాయి. వాటిలో ధ్వని ఒకటి.

విత్తనం మట్టిలోకి విసరితే
వృక్షమై పేలుతుంది...

ఈ పంక్తుల్లో ఇంతకు ముందు చూపిన గింజ చెట్టుగా మారడమనే భావనయే ప్రధానంగా కన్పడుతుంది. కాని మట్టిలో గింజ దాక్కోవడం వేరు, లేదా మట్టిలోకి చల్లడం వేరు, ఇక్కడ విసరితే అన్నాడు పేలుతుంది అన్నాడు. ఈ రెండు పదాలు బాంబులు విసరడానికి పేలడానికి వాడేవి. ఈ రెండు మాటలతో విత్తనమంత బాంబు విసరినా చెట్టంత పేలుతుంది అని, ఒక మొలకను రాబట్టే వాడు నాటాలని కాని విసరకూడదని, దానినుండి మంచి ఫలితాన్ని ఆశించాలని కాని అది పేలిపోయి తనను తన చుట్టూ ఉన్న వారిని పేల్చేయకూడదని, విధ్వంసం కాదు, విచ్చుకోవాలని, పిల్లలను చక్కగా పెంచాలి కాని విసరేసినట్లు వదలేస్తే వారే సమాజానికి హానిచేస్తారని , ఇట్లా అనేకానేకార్థాలను ఈ రెండు మాటలలో పొదిగాడు. ఇది ధ్వని.

నిత్య నినదిని అక్షరం / నిశ్శబ్ద ప్రాకార విచ్ఛేదిని అక్షరం
గజ్జెలా కాళ్ళకు కమ్ముకొని/ డప్పులా బాహువులను కరచుకొని
చెమట చుక్కల్లా శరీరాన్ని కప్పుకొని / గొంగడి గొంతులో చిందేసిన అక్షరాలు
దోపిడి దుర్గాలను కూల్చే ఘోషలవుతాయి / ఎర్రకారం పీల్చే శ్వాసలవుతాయి

ఈ మొత్తంలో శ్రమజీవి, కళాజీవి, ధిక్కారస్వరం అన్నీ ధ్వనిస్తున్నాయి. ఒక జానపదకళారూపం కళ్ళముందు కదలా డుతుంది. ఎన్నో ఉపమానాలు, రూపకాలు పదాలు అర్థాలు పోటీపడుతు న్నట్లున్నాయి. దీన్నే పరస్పరాన్యోన్యతా క్రమణలు అంటారు. పదాన్ని అర్థం, అర్థాన్ని, రూపం ఒకదాన్నొకటి మించిపోవడానికి పోటీపడుతున్నాయా అన్నట్లుండడం. ప్రతి పదాన్ని జాగ్రత్తగా ఔచితీవంతంగా, ఆకర్షణీయంగా, రూపావిష్కరణ చేసే విధంగా ప్రయోగించారు.కరుచుకొని, కప్పుకొని, కమ్ముకొని వంటి సమతూకమైన అంత్యాలు సినారెకు సహజం.

సినారె కవిత్వంలో శ్లేషలు కోకొల్లలు. సినీగీతాలలో కూడా వాటిని అలవోకగా సాధించారు.

నాదానివి, నీవే నా దానివి, కలవరించి, కల, వరించి, హరి జనుడై, హరిజనుడే, వంటివి ఇది సభంగ శ్లేషలు. ఇంకా ఉత్ప్రేక్షలు, ఉల్లేఖనాలు ఎన్నో ఉన్నాయి. ఇవి అలంకారాలే అయినా శిల్పంలో భాగాలే.

సినారె రచనల్లో కొత్త ప్రయోగా లున్నాయి. అవి ప్రక్రియా పరమైనవి, విషయ పరమైనవి. భాషాపరమైనవి.

గజళ్ళు తెలుగులో విస్తృత ప్రచారంలోకి తెచ్చింది సినారె. ప్రపంచపదులు, వంటివి రూపపరమైనవి.

ప్రబంధ కథానాయికలను రూపకాలుగా, నాటికలుగా మార్చి రచించడం కూడా విషయపరంగా ప్రయోగాలు. వరూధిని, సుగాత్రి, నాగార్జు నసాగరం, కర్పూర వసంతరాయలు. కర్పూర వసంతరాయలు గేయ కథాకావ్యంగా రూపొందించినా తిరిగి గేయరూపకంగా మలిచారు.

బుర్రకథ అదివరకున్న రూపమే అయినా వాటిలో దరువులను, ఎత్తుకునే వంత చరణాలను ఎన్నిటినో కొత్తవి

వ్యాసం

ప్రయోగించారు.

ఎవరన్నా రవి కన్నులని, అరరే మధువొలికే గిన్నెలవి,

ఎవరన్నారివి బుగ్గలని, అరరే ఎర్రని రోజా మొగ్గలవి.... కన్నులను మధువొలికే గిన్నెలతో, బుగ్గలను రోజా మొగ్గలతో పోల్చడం సినారె చేసిన కొత్త ప్రయోగం. అంతకు ముందు కలువలు, పద్మాలు, మీనాలు మొదలైనవాటితో కన్నులు పోల్చడం ఉండేవి.

జ్వలన శీలం కోల్పోయిన వ్యక్తిత్వం/ శ్వాసకు వేలాడే కళేబరం..... ఇందులో జీవచ్ఛవం అనే మాటకు బదులు శ్వాసకు వేలాడే కళేబరం అనేది కొత్త ప్రయోగం.

నదుల నందులు తరగల తలలతో / కుమ్ముకు పోతుంటాయి... ఇందులో నదులను నందులుగా , అలలు కొమ్ములుగా చెప్పడం కొత్త ప్రయోగం. అయితే గట్టు చిమ్మెయడం అనే సామాన్య లక్షణాన్ని అంటగట్టి ఇది సాధించాడు.

అగ్గిపుల్ల గీకిన శబ్దం వింటే / తలమీద కప్పు తగలబడి పోతుంది... ఇందులో తలమీద కప్పు ఇంటి కప్పును, తలమీద అనడంతో మరో అర్థం తన నీడయైన నివాసాన్ని అని మామూలు మాటలో రెండర్థాలు పొదిగించడం.

'ఎన్ని కుట్లు వేసినా / చినిగిన వాక్కులకు/ ఆ దృఢత్వం రాదు... వాక్కులను వస్త్రంతో పోల్చడం కొత్త. కావ్య దుకూలముల్ అని దాశరథి అన్నాడు అది కావ్యానికి చెందిన ప్రయోగం. ఇది వాక్కులకు సంబంధించింది.

సినారె కవిత్వంలోనే కాదు వచనరచనలో కూడా తనదైన ముద్ర ఉంటుంది. క్రియాంతాలు తక్కువగా విశేషణాంతాలు ఎక్కువగా వాడి ఒక లయను సాధిస్తారు. విశ్వంభరకు రాసిన ముందు మాటలో....

"ఈ కావ్యానికి నాయకుడు మానవుడు. రంగస్థలం విశాల విశ్వంభర. ఇతివృత్తం మనిషికథ. ఈ కథకు నేపథ్యం ప్రకృతి." ఇట్లా సాగిన వాక్యాల్లో క్రియలు కనిపించవు. చాలా పుస్తకాలకు రాసిన ముందు మాటలు గమనిస్తే కూడా క్లుప్తతతో పాటు వాక్యాన్ని ఒక కొత్త ఒడుపుగా చెప్పిన తీరు కనిపిస్తుంది. 'నా వచనం బహు వచనం' అన్నారొక చోట.బహు అంటే ఏక వచన, బహువచనంలోని బహువచనం అని ఒక అర్థం కాగా బహు అంటే గౌరవార్థకం కూడా అవుతుంది. గొప్ప అనే ఆంతర్యం కూడా ఉంది.

వచనంలో కూడా సినారె రచనా శైలిని విడిగా వింగడించి చూపవచ్చు.

సినారె రచనల్లోని శిల్ప నిర్మాణాలకు సంబంధించి సంప్రదాయ దృష్టితో కొన్నింటిని మాత్రమే నేనిక్కడ ప్రస్తావించాను. ఆధునిక దృష్టితో ప్రతీకలు, శబ్దసంయోజనాలవైవిధ్యం, శీర్షికల పేర్లు , మనోవైజ్ఞానికత, కొత్త పదబంధాలు వంటివెన్నో ఉన్నాయి. వాటిని ఎవరైనా పరిశోధన చేయవచ్చు. ఒక గ్రంథంగా వ్రాయవచ్చు.

ఎన్ని సార్లు చెక్కితే శిల్పం / ఎన్ని సార్లు తీర్చితే చిత్రం

కబుర్లు చెప్పకు కాలమా / ఎన్ని సార్లు చస్తే జీవితం.....

ఆయనే చెప్పినట్లుగా కవితాశిల్పాన్ని ఎంతో జాగరూకతతో అపురూపంగా, అద్వితీయంగా చెక్కిన అసమాన ప్రతిభాశాలి సినారె.

పద్య కవిత

# ప్రసిద్ధమయ్యె...

పాప హరుడు ఏలు పసిడి ఏదులబాద్
పొన్న పూవుల దెచ్చి పొమ్మనంగ
నీలకంఠుడు ఏలు లీల నిజాంబాద్
నీల శంఖు పూల నేరి తెచ్చె
కాళేశ్వరుడు ఏలు కర్నార మందున
కట్ల పూవుల దండ కట్టుమనగ
మల్లన్న ఏలు రాగిల్లు మెతుకు సీమ
మందార పూవులు మరియు దెచ్చె
వీర భద్రుడు ఏలు ఓరుగల్లుకు పోయి
వంగ పూలను దెచ్చి వరుస పేర్చె
సంగమేశుడు ఏలు స్తంభాద్రి గట్టున
సంపంగి పూవులు సదిరి దెచ్చె
పాప నాశుడేలు పాలమూరుకు పోయి
పచ్చి తంగెడు దెచ్చె విచ్చుకొనగ
రామలింగన ఏలు రంగరెడ్డిని జేరి
రాజీవముల కూడ రాంగ దెచ్చె
భాగ్య నగరమందు బస్తీలు తిరిగైన
బంతి పూవుల తెమ్ము పట్టి యనగ
ఛాయ సోముడు ఏలు ఛవి నల్లగొండెక్కి
చామంతులవి గూడ చాన దెచ్చె
కుంట్ల కల్వల తోటల కూర్పు నొప్ప
పరమ శోభల బతుకమ్మ సురవధూటి
కవిత రాగాలు పాడగా నవత పొంది
చంద్రశేఖరుడేలేటి చక్కనైన
మేటి తెలగాణ సీమలో కోటి కలల
చంద్ర కాంతపు పూవుల చేడె తెచ్చె.

గోగు గోరంట గన్నేరు గునుగు పూలు
తెచ్చి ప్రేమల పొదరింట తీపి ఎదను
పొద్దు పోనీక బతుకమ్మ పూని పేర్చ
సిద్ధమయ్యెను భూమి ప్రసిద్ధమయ్యె.

కల్వకుంట్ల
సందీప్ రావు



# మిమిక్రీ సామ్రాట్, 'నేరెళ్లకు నివాళి'

**పుష్పలత ప్రేమ్‌కుమార్‌కు పురస్కార ప్రదానం**

వడ్డేపల్లి, డిసెంబర్ 28: ప్రపంచ ప్రఖ్యాత మిమిక్రీ కళాకారుడు నేరెళ్ల వేణుమాధవ్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. హన్మకొండ పబ్లిక్ గార్డెన్స్‌లోని కళా ప్రాంగణంలో వేణుమాధవ్ కాంస్య విగ్రహానికి మేయర్ గుండా ప్రకాశ్‌రావు, హుడా ఛైర్మన్ మర్రి యాదవ్‌రెడ్డి తదితర ప్రముఖులు, సాహితీవేత్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. తరువాత సురభి కళాకారిణి రేకందార్ పుష్పలత, సీనియర్ మిమిక్రీ ఆర్టిస్ట్ గుండి ప్రేమ్‌కుమార్‌ను సత్కరించారు. ఈ కార్యక్రమంలో నేరెళ్ల శోభా వేణుమాధవ్, రామాచంద్ర మౌళి, పొట్లపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.




# ఎర్రోజు శతకం ఆవిష్కరణ

కరీంనగర్, డిసెంబర్ 25 : సమైక్య సాహితీ ఆధ్వర్యంలో ఎసి క్యాంప్ కార్యాలయంలో ఎర్రోజు వెంకటేశ్వర్లు రచించిన ఎర్రోజు శతకం పసిడి పలుకును అడిషనల్ కలెక్టర్ జి.వి. శ్యామ్ ప్రసాద్ లాల్ ఆవిష్కరించారు. కవి ఎర్రోజు అనేక అంశాలను ఆవిష్కరిస్తూ ఈ శతకం రచించారని, ఇది సమాజానికి ఎంతో ఉపయోగకరమని ఆయన అన్నారు. కూకట్ల తిరుపతి పుస్తక సమీక్ష చేయగా సంస్థ అధ్యక్షుడు మాడిశెట్టి గోపాల్ అధ్యక్షత వహించారు.

# జాగృతి బుక్ క్లబ్ జూమ్ సభ

డిసెంబర్ 26 శనివారం రోజు సాయంత్రం 5.00 గంటలకు తెలంగాణ జాగృతి బుక్ క్లబ్ జూమ్ పి.వి. సంస్మరణ సభను నిర్వహించింది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పి.వి. స్మరణ సంవత్సరంగా ప్రకటించిన దరిమిలా తెలంగాణ జాగృతి పి.వి. నరసింహారావు సాహిత్యాన్ని గురించి ప్రతి నెలా సభలు ఏర్పాటు చేస్తున్న విషయం తెలిసిందే. ఆనాటి సభలో 'సాహితీ విరాణ్మూర్తి పి.వి.' అనే అంశం మీద విశ్రాంత అదనపు డైరెక్టర్ (దూరదర్శన్, ఢిల్లీ) రేవూరు అనంత పద్మనాభరావు ప్రసంగించారు. పి.వి. గురించి పలువురు ప్రముఖ కవులు వ్రాసిన పద్యాలను ఆయన రాగయుక్తంగా ఆలపించి వీక్షకులను అలరించారు. పి.వి. సాహితీ వ్యక్తిత్వం గురించి ఆయన కథలను గురించి పద్మనాభరావు సోదాహరణంగా వివరించారు. ఈ కార్యక్రమాన్ని దత్తాత్రేయ శర్మ, వడ్డేపల్లి కృష్ణ, దేవకీ దేవి, హరనాథ్ లాంటి ప్రసిద్ధ సాహితీవేత్తలు తమ ప్రశ్నలతో ఆసక్తివంతం చేసారు. ఇంకా చాలా మంది సాహితీవేత్తలు పాల్గొన్న ఈ కార్యక్రమానికి జాగృతి బుక్ క్లబ్ కన్వీనర్ డా॥ కాంచనపల్లి గోరా సంచాలకులుగా వ్యవహరించారు.

# దృశ్యం నుండి దృశ్యానికి ఆవిష్కరణ

పోచమ్మ మైదాన్, డిసెంబర్ 29 : ఓరుగల్లుకు చెందిన కవి వి.ఆర్. విద్యార్థి రచించిన దృశ్యం నుండి దృశ్యానికి కవిత్వ సంపుటిని సినీ దర్శకుడు కవి బి. నర్సింగ్‌రావు ఆన్‌లైన్‌లో ఆవిష్కరించారు. ఈ జూమ్ సభలో ఆయన మాట్లాడుతూ విద్యార్థి కవితలు అనుభూతి కవితలుగా పేర్కొన్నారు. విద్యార్థి కవితలు సమాజాన్ని జాగృతపరచడానికి గాఢమైన వ్యక్తీకరణతో ఉంటాయని ఆయన అన్నారు. కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ళ రామశాస్త్రి అధ్యక్షుడుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అంపశయ్య నవీన్, ఎ.కె. ప్రభాకర్, పొట్లపల్లి శ్రీనివాసరావు, బిల్ల మహేందర్ మొదలయిన వారు పాల్గొన్నారు.






## వ్యాసాలు - ప్రసంగాలు

దుగ్గిరాల సోమేశ్వర రావు
6-3-668/10/45
దుర్గానగర్ కాలనీ, పంజాగుట్ట
హైదరాబాదు - 500 082
సెల్ : 92480 42266
వెల.రూ. 130/-




## సులభ వ్యాకరణము

బొంత లచ్చారెడ్డి
(పాలపిట్ట బూక్స్) హైదరాబాదు
ఫోన్ : 040-27678430
సెల్ : 94935 57554
వెల.రూ. 100/-




## శిశిర వసంతం

స్వాతి శ్రీపాద
301, యమునా అపార్ట్‌మెంట్స్
రామంతపూర్, హైదరాబాదు
సెల్ : 8297248988
వెల.రూ. 100/-




## ఎవరీ మహనీయులు

గనిశెట్టి రాములు
రాష్ట్రంలోని అన్ని పెద్ద పుస్తక షాపులో
సెల్ : 9440633299
వెల.రూ. 80/-




## స్వేచ్ఛా విహంగాలు

వెలపాటి రామ రెడ్డి
2-7-1166, కనకదుర్గా కాలనీ,
హనుమకొండ, వరంగల్
సెల్ : 988592144
వెల.రూ. 100/-




## పైసల చెట్టు

డా॥ మడత భాస్కర్
మడత సంధ్య
వినాయక కాలనీ, వరంగల్
సెల్ : 8919328582
వెల.రూ. 100/-




## రవీంద్ర గీతాంజలి

కమలేకర్ రామచందర్‌జీరావు
మహబుబ్‌నగర్,
సెల్ : 7013638332
పాలపిట్ట బుక్స్, హైదరాబాదు
సెల్ : 9848787284
వెల.రూ. 80/-




## కావ్య కుసుమాలు

బొంత లచ్చా రెడ్డి
అదిలాబాద్, సెల్ : 9493557554
పాలపిట్ట బుక్స్, హైదరాబాదు
ఫొన్ : 040-27678430
వెల.రూ. 60/-




## తెలంగాణ గెలుపు

ముత్య బోయిన మలయశ్రీ
మంచిర్యాల, సెల్ : 9908275593
డా॥ పి.రమణ, సెల్ : 989924488
ఎమ్. కుమారస్వామి యాదవ్
సెల్ : 9705037367




## రాజుగారి కథలు

ఆర్.సి. కృష్ణస్వామిరాజు
సెల్ : 9393662821
వెల.రూ. 125/-
rcksrajulic@gmail.com

